

ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం

# వ్యవసాయం

మే, 2025

సంపుటి - 11 సంచిక-05 పేజీలు- 52 వెల : ₹ 20/-



# ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో గత నెలలో జరిగిన వివిధ కార్యక్రమాల దృశ్యమాలిక



బియ్యం ఎగుమతి విధానంపై ఏర్పాటు చేసిన సదస్సులో మాట్లాడుతున్న పౌరసరఫరాల శాఖ మంత్రి గౌ॥ శ్రీ ఉత్తమ్ కుమార్ రెడ్డి



డా॥ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా వారి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘన నివాళులర్పిస్తున్న ప్రొ॥ అల్దాస్ జానయ్య, ఉపకులపతి




పర్యావరణ పరిరక్షణ కొరకు మానవ రహిత వ్యవసాయం దిశగా పరిశోధనలు సాగాలి అనే అంశంపై ఏర్పాటు చేసిన సదస్సులో ప్రసంగిస్తున్న ప్రొ॥ అల్దాస్ జానయ్య, ఉపకులపతి




116వ అకడమిక్ కౌన్సిల్‌లో దిశా నిర్దేశం చేస్తున్న ప్రొ॥ అల్దాస్ జానయ్య, ఉపకులపతి



వ్యవసాయంలో కృత్రిమ మేధ వినియోగంపై వర్సిటీతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంటున్న బిట్స్ పిలాని



పిజెటిఎయుని సందర్శించిన భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి నూతన డైరెక్టర్ జనరల్ డా॥ ఎం.ఎల్. జాట్‌ను సత్కరిస్తున్న ప్రొ॥ అల్దాస్ జానయ్య, ఉపకులపతి

# వ్యవసాయం

సంక్షిప్త వ్యవసాయ సమాచార మాస పత్రిక

మే, 2025

స్వస్తిశ్రీ చాంద్రమాన శ్రీ విశ్వావసు నామ సం॥ర వైశాఖ శుద్ధ చవితి నుండి జ్యేష్ఠ శుద్ధ పంచమి వరకు



## సంపాదక వర్గం



**ప్రధాన సంపాదకులు**

**డా॥ ఆర్. సునీత దేవి**

ప్రధాన వ్యవసాయ సమాచార అధికారి

ప్రధాన శాస్త్రవేత్త (ఎంటమాలజి)

**సాంకేతిక పర్యవేక్షణ నిపుణులు**

**డా॥ పి. లీలా రాణి**

ప్రధాన శాస్త్రవేత్త (క్రాప్ ప్రొడక్షన్) & హెడ్

**డా॥ ఎ. పద్మశ్రీ**

అసోసియేట్ ప్రొఫెసర్ (ఎంటమాలజి)



వ్యవసాయ మాస పత్రిక సంవత్సర చందా రూ. 200/- మరియు జీవిత కాలపు (10 సంవత్సరాలు) చందా రూ. 1000/- నగదు రూపంలో లేదా డి.డి. రూపంలో చెల్లించవచ్చు. డి. డి. అయితే

Principal Agricultural Information Officer,
Agricultural Information and Communication Center
PJTAU Press, Rajendranagar, Ranga Reddy
Pin Code : 500 030

పేరిట తీసి హైదరాబాద్‌లో చెల్లుబాటయ్యే విధంగా పంపించాలి



**చిరునామా :**

ప్రధాన వ్యవసాయ సమాచార అధికారి
వ్యవసాయ సమాచార మరియు ప్రసార కేంద్రం
ఎ.ఆర్.ఐ క్యాంపస్, రాజేంద్రనగర్, హైదరాబాద్ - 30.
తెలంగాణ, ఫోన్ నెం. 040-24015380
e-mail : paio.pjtau@gmail.com, pjtau.paio@gmail.com
vyavasayam.pjtau@gmail.com


పాఠక మహాశయులు మాసపత్రిక అభ్యున్నతికి తోడ్పడుటకుగాను తమ అమూల్యమైన సలహాలను సూచనలను అందచేయవలసిందిగా కోరుతున్నాము.

## విషయ సూచిక


1. ఉపకులపతి సందేశం........................................ 5
2. ఈమాసంలో చేయవలసిన వ్యవసాయ పనులు............... 6
3. వాతావరణం-పంటల పరిస్థితి-విశ్లేషణ.................... 11
4. సాంకేతిక వ్యాసాలు
   - ప్రధానమంత్రి-ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రోఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్ప్రైజెస్ స్కీమ్ కామన్ ఇంక్యుబేషన్ సెంటర్, జగిత్యాల ద్వారా రైస్ ప్రాసెసింగ్........................... 12
   - మొక్కజొన్న నిల్వలో రక్షణ: పురుగులు, శిలీంధ్రాల నివారణకు సమగ్ర యాజమాన్యం........................... 15
   - విత్తన నిల్వ ధాన్యాన్ని ఆశించే చీడపీడలు-సమగ్ర నివారణచర్యలు............................................ 18
   - నేల ఆరోగ్యం మరియు పంట రక్షణలో వేపపాత్ర.......... 20
   - కిసాన్ క్రెడిట్ కార్డు రైతుల ఆర్థిక వెన్నుముక............... 22
   - వ్యవసాయ పదవినోదం.................................... 23
   - పాలిహౌస్ సాగులో నెమటోడ్ యాజమాన్య పద్ధతులు...... 24
   - ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ద్వారా 2024లో విడుదలైన వంగడాలు.. 26
   - మిద్దె తోటల సాగుతో ఆహారం-ఆరోగ్యం.................. 29
   - అన్నదాతకు లాభం-వేసవి కూరగాయల సాగుతో సాధ్యం.. 31
   - మే మాసంలో ఉద్యాన పంటల్లో చేపట్టవలసిన సేద్యపు పనులు............................................ 34
   - మల్లె మరియు నేల సంపంగి పంటలలో మిడ్జ్ సమగ్ర సమాచారం................................................36
   - పసుపు కొమ్ములతో విలువ ఆధారిత పదార్థాల తయారీ... 38
   - ఎకో- ఫ్రెండ్లీ పద్ధతిలో పశు ఆహారం- రైతులకు ఆధునిక పరిష్కారం........................................ 41
   - పశువులలో వ్యాధుల నిర్ధారణకై ఆధునిక పరీక్షలు- వసతులు.................................................. 43
5. టి.వి.ఛానళ్ళలో ప్రత్యక్ష ప్రసారాల ద్వారా వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలతో రైతుల ముఖాముఖి కార్యక్రమాలు............................................ 45
6. రైతన్నకో ప్రశ్న............................................46
7. విశ్వవిద్యాలయ వార్తలు.....................................47
8. రైతు విజయగాథ
   - గిరిజన ఉపప్రణాళిక లబ్ధిదారుడి విజయగాథ: మల్చింగ్ పద్ధతిలో టమాట సాగు...................................... 48

# మే మాసం క్యాలెండర్ - 2025

## స్వస్తిశ్రీ చాంద్రమాన శ్రీ విశ్వావసు నామ సం॥ర వైశాఖ శుద్ధ చవితి నుండి జ్యేష్ఠ శుద్ధ పంచమి వరకు

| SUN<br>ఆది<br>రాహుకాలం<br>సా. 4.30-6.00 | MON<br>సోమ<br>రాహుకాలం<br>ఉ.7.30-9.00 | TUE<br>మంగళ<br>రాహుకాలం<br>మ.3.00-4.30 | WED<br>బుధ<br>రాహుకాలం<br>మ.12.00-1.30 | THU<br>గురు<br>రాహుకాలం<br>మ.1.30-3.00 | FRI<br>శుక్ర<br>రాహుకాలం<br>ఉ.10.30-12.00 | SAT<br>శని<br>రాహుకాలం<br>ఉ.9.00-10.30 |
|---|---|---|---|---|---|---|
| | | | | 1 వైశాఖ శుద్ధ చవితి సా. 4-24 మృగశిర రా. 7-16 తె.వ. 3-21 ల 4-54 | 2 పంచమి ప. 2-41 ఆర్ద్ర సా. 6-22 వర్జ్యము లేదు | 3 షష్ఠి ప. 1-20 పునర్వసు సా. 5-50 ఉ.వ. 6-05 ల 7-39 రా.వ. 1-48 ల 3-23 |
| 4 సప్తమి ప. 12-25 పుష్యమి సా. 5-44 వర్జ్యము లేదు | 5 అష్టమి ప. 11-59 ఆశ్రేష సా. 6-07 ఉ.వ. 6-44 ల 8-21 | 6 నవమి ప. 12-03 మఘ సా. 6-59 ఉ.వ. 6-33 ల 8-12 తె.వ. 3-27 ల 5-08 | 7 దశమి ప. 12-38 పుబ్బ రా.8-21 తె.వ. 4-06 ల | 8 ఏకాదశి ప. 1-42 ఉత్తర రా. 10-10 ఉ.శే.వ 5-49 వ | 9 ద్వాదశి ప. 3-10 హస్త రా. 12-22 ఉ.వ. 7-19 ల 9-04 | 10 త్రయోదశి సా. 4-59 చిత్ర రా. 2-51 ఉ.వ. 9-11 ల 10-57 |
| 11 చతుర్దశి రా. 7-00 స్వాతి తె. 5-27 ఉ.వ. 9-03 ల 10-49 | ○ 12 పూర్ణిమ రా. 9-01 విశాఖ పూర్తి ప.వ. 11-39 ల 1-26 | 13 వైశాఖ బ॥ పాడ్యమి రా. 10-53 విశాఖ ఉ. 8-02 ప.వ. 12-25 ల 2-10 | 14 విదియ రా. 12-27 అనూరాధ ఉ. 10-23 సా.వ. 4-27 ల 6-11 | 15 తదియ రా. 1-38 జ్యేష్ఠ ప. 12-24 రా.వ. 8-56 ల 10-39 | 16 చవితి రా. 2-21 మూల ప. 2-01 ప.వ. 12-18 ల 2-01 రా.వ. 12-03 ల 1-44 | 17 పంచమి రా. 2-33 పూర్వాషాఢ ప. 3-07 రా.వ. 11-19 ల 12-58 |
| 18 షష్ఠి రా. 2-15 ఉత్తరాషాఢ ప. 3-44 రా.వ. 7-45 ల 9-22 | 19 సప్తమి రా. 1-28 శ్రవణం ప. 3-52 రా.వ. 7-49 ల 9-24 | 20 అష్టమి రా. 12-14 ధనిష్ఠ ప. 3-33 రా.వ. 10-33 ల 12-06 | 21 నవమి రా. 10-38 శతభిషం ప. 2-51 రా.వ. 8-58 ల 10-30 | 22 దశమి రా. 8-43 పూర్వాభాద్ర ప. 1-48 రా.వ. 10-52 ల 12-23 | 23 ఏకాదశి సా. 6-34 ఉత్తరాభాద్ర ప. 12-29 రా.వ. 11-43 ల 1-13 | 24 ద్వాదశి సా. 4-14 రేవతి ఉ. 10-58 తె.వ. 5-36 ల |
| 25 త్రయోదశి ప. 1-48 అశ్విని ఉ. 9-20 ఉ.శే.వ. 7-05 వ సా.వ. 6-15 ల 7-44 | 26 చతుర్దశి ప. 11-19 భరణి ఉ. 7-38 సా.వ. 6-49 ల 8-18 | ● 27 అమావాస్య ఉ. 8-55 కృత్తిక ఉ. 6-00 రోహిణి తె. 4-36 రా.వ. 9-04 ల 10-34 | 28 జ్యేష్ఠ శు॥ పాడ్యమి ఉ. 6-40 విదియ తె. 4-43 మృగశిర తె. 3-21 ఉ.వ. 9-54 ల 11-25 | 29 తదియ రా. 2-59 ఆర్ద్ర రా. 2-23 ఉ.వ. 11-25 ల 12-57 | 30 చవితి రా. 1-38 పునర్వసు రా. 1-47 ప.వ. 2-05 ల 3-38 | 31 పంచమి రా. 12-40 పుష్యమి రా. 1-35 ఉ.వ. 9-43 ల 11-18 |

12 బుద్ధ పూర్ణిమ

కృత్తిక కార్తె (11.05.25 నుండి 24.05.25) వేసవి పనులు

రోహిణి కార్తె (25.05.25 నుండి 07.06.25)

# పప్పుధాన్యాలు సాగు చేద్దాం - స్వయం సమృద్ధిని సాధిద్దాం



అల్దాస్ జానయ్య
**ఉపకులపతి**

భారతదేశంలో ప్రజల ఆహారపు అలవాట్లలో పోషక విలువలు కలిగిన ఆహార పంటలు పప్పుధాన్యాలు (అపరాలు). ఇవి మాంసకృత్తులు, ప్రోటీన్లను ఎక్కువ కలిగి ఉంటాయి. పేదలకు మరియు శాఖాహారులకు మాంసకృత్తుల సరఫరా ద్వారా ఆరోగ్య సంరక్షణకు ఇవి దోహదం చేయగలవు. దానితో మన ఆహార అవసరాల కొరకు, ఇతర దేశాల నుండి పప్పు దినుసులను దిగుమతి చేసుకోవడం వలన విలువైన విదేశీ మారక ద్రవ్యం కోల్పోవలసి వస్తుంది. భారత ఆరోగ్య పరిశోధనా మండలి సిఫారసు మేరకు, ప్రతి వ్యక్తి ఆహారంలో ప్రతి రోజు 52 గ్రాముల అపరాలను తీసుకోవాలి. కానీ, పూర్తి స్థాయిలో అపరాలు అందుబాటులో లేని కారణంగా ప్రస్తుతం 37 గ్రాములు మాత్రమే లభ్యమవుతున్నాయి.

మనదేశ ప్రజలకు ప్రోటీన్ యొక్క ప్రధాన మూలం అపరాలు. వీటిలో ఎక్కువగా పీచు పదార్థం, విటమిన్‌లు, అమైనో ఆమ్లాలు ఉంటాయి. అందువల్ల ఇవి క్యాన్సర్, చక్కెర వ్యాధి, గుండె జబ్బులు, ఊబకాయంను నిరోధించటంలో ముఖ్య పాత్ర వహిస్తాయి. సమతుల ఆహారంలోనే కాకుండా వీటిని సాగు చేయడం వలన అనేక లాభాలున్నాయి. అపరాల పంటలు వాతావరణంలో ఉన్న నత్రజనిని సంగ్రహించి, వ్రేళ్ళలో బుడిపెల రూపంలో నిల్వ చేస్తుంది. వీటి యొక్క తక్కువ కాలపరిమితి వలన ఒకే సంవత్సరం అదే భూమిలో రెండు లేదా మూడు పంటలను (వరి-అపరాలు, వరి-వరి-అపరాలు) వేసుకోవచ్చు. అందువల్ల రైతులు అధిక ఆదాయాన్ని పొందవచ్చు. వీటిని పండించడానికి ఎరువులు అవసరం లేదు లేదా తక్కువ ఎరువులు అవసరమవుతాయి. అపరాలను తక్కువ నీటితో లేదా అవశేషతేమ ఆధారంగా కూడా పండించవచ్చు. వీటికి ఎక్కువ ఆకుల వృద్ధి మరియు మొక్కలు మధ్య తక్కువ అంతరాన్ని కలిగి ఉండటం వలన నేల కోతను అరికట్టడంలో ఉపయోగపడతాయి మరియు ఆకుల రూపంలో నేలకు సేంద్రీయ పదార్థాన్ని అందిస్తాయి. వీటిని పంటల సరళి, మిశ్రమ మరియు అంతరపంటలలో ప్రముఖంగా సాగు చేస్తారు.

ఆరుతడి పంటలలో అపరాలు ప్రధానమైనవి. మన రాష్ట్రంలో సాగులో ఉన్న అపరాలలో మినుము, పెసర, కంది, శనగ, అలసందలు, ఆనప ముఖ్యమైనవి. వరి తర్వాత మినుము, పెసర పైర్లు సాగుచేయడం మన రాష్ట్రంలో అనాదిగా వస్తున్న ఆనవాయితి ప్రకారం ముఖ్యంగా అవశేష తేమ ఆధారంగా నల్లరేగడి నేలల్లో, వరి మాగాణుల్లో అపరాలైన మినుము లేదా పెసర సాగు చేయడం ద్వారా పంట మార్పిడి జరుగుతుంది. తద్వారా పంటలను ఆశించే పురుగులు మరియు తెగుళ్ళ ఉధృతిని తగ్గించుకోవచ్చు. గాలిలో నత్రజనిని నేలలో స్థిరీకరణ ద్వారా నేల ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచుతూ అన్ని రకాల వ్యవసాయ విధానాల్లో అన్ని పంట కాలాల్లో, వివిధ రకాల నేలలలోనూ వాతావరణ పరిస్థితుల్లో, ముఖ్య పంటగా గాని, అంతరపంటగా గాని ఇముడుతూ, నేల, వాతావరణ ఆరోగ్యాన్ని పెంపొందించడానికి ఉపయోగపడుతున్నాయి. అపరాల పంట నుండి కార్బన్‌డై ఆక్సైడ్ తక్కువగా విడుదలవుతుంది. తద్వారా గ్లోబల్ వార్మింగ్‌కి తక్కువ ప్రభావితం చూపిస్తుంది.

ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం అపరాల సాగు మరియు దిగుబడి పెంచడానికి వివిధ రకాలైన ఆధునిక రకాలతో పాటు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిస్తూ ముఖ్యపాత్ర పోషిస్తుంది. పెసరలో ఎమ్.జి.జి-385, డబ్ల్యు.జి.ఎల్-42, ఎమ్.జి.జి-351, ఎమ్.జి.జి-295, ఎమ్.జి.జి-347, ఎమ్.జి.జి-348 వంటి మేలైన రకాలు అధిక దిగుబడినిస్తూ పల్లాకు తెగులును తట్టుకుంటాయి. మినుములో ఎమ్.బి.జి-1070, ఎమ్.బి.జి-207 పల్లాకు తెగులును తట్టుకొని అధిక దిగుబడినిస్తాయి. కందిలో డబ్ల్యు.ఆర్.జి-255, డబ్ల్యు.ఆర్.జి-97, డబ్ల్యు.ఆర్.జి-93, డబ్ల్యు.ఆర్.జి-121, టి.డి.ఆర్.జి-59, టి.డి.ఆర్.జి-272, పి.ఆర్.జి -176 వంటి అధిక దిగుబడినిచ్చు రకాలు అందుబాటులో ఉన్నాయి.

వ్యవసాయ విశ్వవిద్యాలయం విస్తరణలో భాగంగా కృషి విజ్ఞాన కేంద్రాలు మరియు ఏరువాక కేంద్రాలు అపరాల యాజమాన్య పద్ధతుల ప్రచురణలు, శిక్షణా కార్యక్రమాలు, ప్రథమ శ్రేణి ప్రదర్శనా క్షేత్రాలు, కిసాన్ మేళాలు లాంటి వివిధ విస్తరణ కార్యక్రమాలతో నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులకు అందజేస్తూ, నిరంతరం రైతుల అభివృద్ధికి కృషి చేస్తున్నాయి.

కావున మన రాష్ట్ర రైతాంగం శాస్త్రవేత్తల సలహాలు, సూచనలను పాటిస్తూ అపరాల పంటల ఉత్పత్తిలో, ఉత్పాదకతలో సమృద్ధిని సాధించి పోషకాహార భద్రతను సాధించే దిశగా అడుగులు వేస్తారని ఆశిస్తూ...

(అల్దాస్ జానయ్య)
**ఉపకులపతి**



## వరి

- తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వరి పైర్లు కోతదశలో ఉన్నాయి.
- యాసంగిలో వరి పంటను ఆలస్యంగా వేసిన ప్రాంతాల్లో కోత దశలో ఉంది. రైతు స్థాయిలో సొంత విత్తనాన్ని సేకరించుకొని (ముఖ్యంగా సూటి రకాలను) ముందుగానే ఎంపిక చేసుకున్న చిన్న మడి నుండి బెరుకులు/కేళీలు/కల్తీలు ఏరివేసి పంటను కోసుకోవాలి. కోసిన పనల నుండి గింజలను రాల్చుకొని వేరుగా నీడలో ఎండబెట్టి విత్తనంగా నిల్వ ఉంచుకోవాలి. విత్తనం కొరకు సేకరించినప్పుడు ఎలాంటి మట్టి పెడ్డలు, రాళ్ళు, పుచ్చిపోయిన, మొలకెత్తిన, రంగుమారిన మరియు తాలు గింజలు లేకుండా చూసుకోవాలి. దుబ్బు కట్టే మరియు పూత దశలో ఒకవేళ కేళీలు తీసివేయని పరిస్థితుల్లో సాగు చేస్తున్న మొక్క రకం లక్షణాలు, గింజ రంగు మరియు ఆకారం మొదలగు లక్షణాలు గమనించి ఒకే విధంగా ఉన్న మొక్కల నుండి మాత్రమే విత్తనాలను సేకరించుకోవాలి. అలాగే విత్తనాలను నిల్వ చేసేటప్పుడు అధిక తేమ మరియు ఉష్ణోగ్రతలకు గురికాని గాలి, వెలుతురు బాగా తగిలే ప్రదేశాల్లో నిల్వ చేయాలి. పచ్చి వడ్లుగా అమ్ముకొన్నట్లైతే చేను మీదే గింజలు బాగా ఎండిన తర్వాత పంట కోతలు చేపట్టాలి. ధాన్యాన్ని కోసిన తర్వాత నేరుగా ఎండ వేడికి ఆరబెట్టకుండా నీడ ప్రాంతాల్లో (12 శాతం తేమ వరకు) ఎండబెట్టి నిల్వ చేసుకోవాలి. నేరుగా ఎండబెడితే నూకశాతం పెరుగుతుంది.
- నాట్లు బాగా ఆలస్యమైన ప్రాంతాల్లో గింజ పాలుపోసుకునే దశలో మెడవిరుపు లక్షణాలు తొలిదశ లో గమనించినట్లైతే ఎకరానికి ట్రైసైక్లోజోల్ + మ్యాంకోజెబ్ 500 గ్రా. లేదా ఐసోప్రోథయోలేన్ 320 మి.లీ. లేదా కాసుగామైసిన్ 500 మి.లీ. పిచికారి చేయాలి. ఉధృతి అధికంగా ఉన్నట్లైతే ట్రైఫ్లాక్సిస్ట్రోబిన్ 25% + టెబ్యుకొనజోల్ 50% (75 డబ్ల్యుజి) 80 గ్రా. లేదా పికాక్సీస్ట్రోబిన్ 6.78% + ట్రైసైక్లోజోల్ 20.33% ఎస్‌సి 400 మి.లీ. లేదా అజాక్సీస్ట్రోబిన్ 16.7% + ట్రైసైక్లోజోల్ 33.3% ఎస్‌సి 200 మి.లీ. లేదా అజాక్సీస్ట్రోబిన్ 18.2% + డైఫెన్‌కొనజోల్ 11.4% ఎస్‌సి 200 మి.లీ. 200 లీటర్ల నీటిలో కలిపి ఎకరానికి పిచికారి చేయాలి.
- మే మాసంలో బాగా మాగిన పశువుల ఎరువు లేదా గొర్రెల మరియు కోళ్ళ ఎరువు మొదలైన సేంద్రియ ఎరువులను సేకరించి పొలమంతటా సమానంగా చల్లుకోవాలి. రసాయనిక ఎరువుల వినియోగం తగ్గించి భూసారాన్ని పెంపొందించుకోవడానికి వీలుగా పచ్చిరొట్ట పైరులైన జనుము, జీలుగ మరియు పిల్లిపెసర విత్తనాలను ఈ మాసంలో సేకరించి సిద్ధంగా ఉంచుకోవాలి. ముఖ్యంగా నేల ఆరోగ్యాన్ని పెంపొందించుకోవడానికి సేంద్రియ ఎరువులతో పాటుగా పచ్చిరొట్టపైరు వేసి పూత దశలో భూమిలో కలియదున్నాలి.
- మే మాసంలో వేసవి దుక్కులు చేసుకోవాలి. దీనివలన నీటి వినియోగ సామర్థ్యం పెరగటమే కాకుండా కలుపు, కోశస్థ దశలోని పురుగులు, భూమిలోని వ్యాధికారక శిలీంధ్రాల సిద్ధ బీజాలు ఎండవేడికి నశిస్తాయి. ముఖ్యంగా ఈ యాసంగిలో కాండం తొలిచే పురుగు ఉధృతి అధికంగా ఉంది. కావున రైతులు వేసవి దుక్కులు చేసుకోవాలి.విధిగా నీటి వసతి ఉన్న చోట మే నెలలోనే నీరు పెట్టి తీసివేస్తే కొన్ని రోజుల్లో రెక్కల పురుగులు బయటకు వచ్చి ఆహారం లేక చనిపోతాయి.
- తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా నేలల్లో భాస్వరం ఎరువులు మోతాదుకు మించి ఉన్నాయని పరిశోధనల్లో గుర్తించడమైనది. కావున రైతులు మట్టి నమూనాలను సేకరించి భూసార పరీక్ష చేయించుకోవాలి. అలాగే పరీక్షా ఫలితాల్లో కూడా భాస్వరం ఎరువు మోతాదుకు మించి గమనించినట్లైతే ఈ వానాకాలం 25% భాస్వరం ఎరువును తక్కువగా వేసుకోవాలి.
- క్రమం తప్పకుండా పైరును గమనిస్తూ పురుగులు మరియు తెగుళ్ళ ఉధృతిని అంచనా వేసుకోవాలి. ఒకవేళ నష్టపరిమితి స్థాయి దాటే అవకాశం ఉన్నచో నిపుణుల సలహా మేరకు తగు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి.



- తెలంగాణ రాష్ట్రంల్లో దీర్ఘకాలిక రకాలు (150 రోజుల కాలపరిమితి గల) వానాకాలంలో సాగు చేయడం వలన ఎక్కువ నీరు మరియు విద్యుత్ వాడకమే కాకుండా పచ్చిరొట్ట పంటలను వేసి భూమిలో కలియదున్నడానికి సమయం ఉండదు. అలాగే దీర్ఘకాలిక రకాలను చెరువులు మరియు నీటి పారుదల ప్రాజెక్టుల క్రింద ఆలస్యంగా నాట్లు వేయడం వలన పంట వివిధ రకాల చీడపీడలకు గురికావడంతో పాటుగా పూత సమయంలో చలి వలన తాలు గింజలు ఏర్పడి దిగుబడులు గణనీయంగా తగ్గుతాయి. కావున మధ్య మరియు స్వల్పకాలిక సన్నగింజ రకాలను సాగుచేయడం మంచిది. దీర్ఘకాలిక రకాలనే సాగు చేయాల్సిన సందర్భంలో అవకాశం ఉన్నచోట నేరుగా విత్తే పద్ధతిలో విత్తుకోవచ్చు. తద్వారా సుమారు ఎకరాకు రూ. 5000-6000/- సాగు ఖర్చును ఆదా చేసుకోవచ్చు.

**డా॥ సిహెచ్. దామోదర్ రాజు, ప్రధాన శాస్త్రవేత్త (వరి) & హెడ్, వరి పరిశోధన సంస్థ, రాజేంద్రనగర్, హైదరాబాద్, ఫోన్ నెం. 9440225385**

## మొక్కజొన్న

మొక్కజొన్నను నూర్పిడి చేసిన తర్వాత మంచి మార్కెట్ ధర రావాలంటే తప్పనిసరిగా పాటించవలసిన నాణ్యతా ప్రమాణాలు:

- దుమ్ము, చెత్త, రాళ్ళు, మట్టిపెళ్ళలు 1.0 శాతం మించరాదు.
- గింజలో తేమ 14 శాతం కంటే ఎక్కువ ఉండరాదు.
- విరిగిన విత్తనాలు 2.0 శాతం మించరాదు.
- పాడైపోయిన విత్తనాలు 6.0 శాతంలోపు ఉండాలి.
- ఇతర రంగు మొక్కజొన్న గింజలు 6.0 శాతం మించకుండా ఉండాలి.

మొక్కజొన్నను విత్తనం కొరకు నిల్వచేయదలచినచో డెల్టామెత్రిన్ మందును 4 గ్రాములు ఒక క్వింటాలు విత్తనానికి పట్టించి పురుగు ఆశించకుండా భద్రపరచుకోవాలి. గోదాములో ఎలుకలను, పురుగులను నివారించుటకు టన్ను ధాన్యానికి మూడు అల్యూమినియం ఫాస్ఫైడ్ బిళ్ళలతో ఊదర బెట్టాలి.

**వానాకాలం మొక్కజొన్న సాగుకు సమాయత్తమవడానికి చేపట్టవలసిన పనులు:**

గట్లు శుభ్రపరిచి మురుగు నీరు పోవుటకు కాలువలు ఏర్పరచుకోవాలి. నీటి వసతి కలిగిన రైతులు తొలకరి వర్షాన్ని ఉపయోగించుకొని పిల్లి పెసర, జనుము మరియు జీలుగ లాంటి పంటలను వేసి భూసారాన్ని పెంచుకొనవచ్చు.

రాబోయే వానాకాలంలో వేసే మొక్కజొన్న పంటకై వేసవి దుక్కులు దున్నుకొని నేలను తయారు చేసుకోవాలి. ఇలా చేసినచో చీడపీడలు మరియు కలుపు మొక్కలు నివారణయే కాకుండా నేల వర్షపు నీటిని ఎక్కువ మోతాదులో గ్రహించగలుగుతుంది. నాణ్యమైన విత్తనాలను పరిశోధన స్థానము లేదా గుర్తించబడిన ప్రైవేట్ విత్తన సంస్థల నుండి సేకరించి, మొలక శాతం 90కి పైగా ఉన్నవాటినే విత్తుకోవాలి.

## చిరుధాన్యాలు

వానాకాలం సాగుకు పొలం తయారీ వేసవిలో కురిసే వర్షాలకు మరియు నేలలో తేమ అనుకూలంగా ఉన్నప్పుడు భూమిని రెండు మూడు సార్లు లోతుగా దున్ని పొలంను తయారుచేసుకోవాలి. ఇలా లోతుగా దున్నడం వలన భూమి గుల్లబారి వర్షాకాలంలో వచ్చే నీరు భూమిలోకి బాగా ఇంకుతుంది. భూమిని దున్నటము వలన భూమి లోపల ఉండే పురుగులు, వీటి కోశస్థ దశలు మరియు రోగకారక శిలీంధ్రాలు ఎండ వేడిమి వలన భూమి పైకి వచ్చి నశిస్తాయి. దున్నే ముందు పశువుల ఎరువును పొలంలో వేసి బాగా కలియదున్నాలి.

**సజ్జ:** వేసవిలో సాగు చేసిన సజ్జ పంట ప్రస్తుతం కోతకు సిద్ధంగా ఉంటుంది. కావున కంకులను కోసి పలుచగా ఆరబెట్టి తరువాత నూర్పిడిచేసి గింజలను ఎండబెట్టి, నిల్వచేసుకోవాలి.

**రాగి:** వేసవిలో సాగుచేసిన పంట ప్రస్తుతం కోతకు సిద్ధముగా ఉంటుంది. పిలక కంకుల కంటే ప్రధాన కాండపు కంకులు



మొదట కోతకు వస్తాయి. కాబట్టి రెండు మూడు దశలలో కంకులను కోయాలి. బాగా ఆరబెట్టిన వెన్నులను కర్రతో కొట్టిగాని, ట్రాక్టరుతోగాని యంత్రముతోగాని నూర్పిడి చేసి గింజలను ఎండబెట్టి నిలువ చేసుకోవాలి.

యాసంగి జొన్న పంట కోత అనంతరం పంట వ్యర్థాలను తీసివేసి లోతుగా దుక్కులు దున్నుకోవాలి. ఇలా చేయడం వలన వివిధ రకాల పురుగుల కోశస్థ దశలు బయల్పడి నిర్మూలించబడతాయి. తరువాత పంటకాలంలో పురుగుల ఉధృతి తగ్గుతుంది. వానాకాలంలో పడే వర్షపు నీరు భూమిలోకి ఇంకి తరువాత పంటకు ఉపయోగపడుతుంది.

**డా॥ యం. సుజాత, ప్రధాన శాస్త్రవేత్త (మొక్కజొన్న మరియు చిరుధాన్యాలు) & హెడ్, మొక్కజొన్న పరిశోధన స్థానం, రాజేంద్రనగర్, హైదరాబాద్, ఫోన్ నెం. 8008404874**

## వేరుశనగ

- వేరుశనగ పంటకోత తరువాత వాటి కాయలను నీడలో ఆరబెట్టాలి. విత్తనం కొరకు, కాయలలో తేమ శాతం 9% మించకుండా నీడలో ఆరబెట్టి గోనె సంచులలో నిలువ చేసుకోవాలి. నిలువ చేసుకునే ముందుగా కిలో కాయలకి 5 మి.లీ. వేపనూనె పట్టించి నిలువ చేసుకోవడం వలన ఎటువంటి పురుగులు ఆశించవు. గోదాము గోడలపైన, కాయ నిల్వ చేసే సంచులమీద మలాథియాన్ 10 మి.లీ. ఒక లీటరు నీటికి కలిపి ప్రతి రెండు మూడు వారాలకు ఒకసారి పిచికారి చేసుకోవాలి. భూసార పరీక్షలకు ఇది చాలా మంచి సమయం. పొలాన్ని లోతుగా దున్ని ఎండబెట్టాలి. ఏటవాలుకు అడ్డం లోతు దుక్కులు చేసుకున్నట్లైతే తరువాత కురిసే వర్షానికి నీరు భూమిలోకి బాగా ఇంకి పోవడమే కాకుండా మట్టి వర్షానికి కొట్టుకొని పోకుండా కాపాడుకోవచ్చు. దీని వలన భూమి బాగా గుల్లబారి సారవంతముగా తయారవుతుంది. ఆయా ప్రాంతాలకు అనుకూలమైన రకాలను ఎంచుకొని, కాయల నుండి విత్తనాన్ని ఒలిచి పెట్టుకోవాలి. పంటలకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు మరియు రసాయన ఎరువులను ముందుగానే సమకూర్చుకోవాలి.

## ఆముదం

- యాసంగిలో సాగు చేసిన ఆముదం ఆఖరి దశలో ఉంది. ఈ దశలో మిగిలిన గెలలను కోసి, ఎండబెట్టి నూర్పిడి చేసుకోవాలి. ముందస్తు వానాకాలం ఆముదం పండించుటకు దుక్కి చేసి పెట్టుకోవాలి.

## నువ్వులు

- ముందస్తు వానాకాలం నువ్వులు వేయాలనుకున్న రైతులు దుక్కి తయారు చేసుకోవాలి. ఆయా ప్రాంతాలకు అనుకూలమైన రకాలను సేకరించుకోవాలి. విత్తే ముందు కిలో విత్తనానికి 3 గ్రా. మ్యాంకోజెబ్‌తో విత్తనశుద్ధి చేయాలి. పంట తొలి దశలో రసం పీల్చే పురుగుల బారి నుండి కాపాడటానికి ఇమిడాక్లోప్రిడ్ 2.0 మి.లీ. కిలో విత్తనానికి కలిపి విత్తనశుద్ధి చేయాలి. ఆఖరి దుక్కిలో ఎకరానికి 4 టన్నుల పశువుల ఎరువు, 16 కిలోల నత్రజని, 8 కిలోల పొటాష్ మరియు 8 కిలోల భాస్వరాన్నిచ్చే ఎరువులు వేసుకోవాలి. మే రెండవ పక్షంలో విత్తుకోవచ్చు. విత్తిన వెంటనే పలుచటి నీటి తడిని ఇవ్వాలి. వరుసల మధ్య 30 సెం.మీ. మరియు వరుసలోని మొక్కల మధ్య 15 సెం.మీ. దూరం ఉండేలా నువ్వులను విత్తుకోవాలి.

## కుసుమ

- ఏకపంటగా లేదా స్వల్పకాలిక అపరాల తర్వాత కుసుమను విత్తుకునే ప్రాంతాలలో వర్షం పడినప్పుడు వేసవి లోతు దుక్కులు చేసుకోవాలి.

## ప్రొద్దుతిరుగుడు

- ఫిబ్రవరి మాసంలో విత్తిన ప్రొద్దుతిరుగుడు పంట ఇప్పుడు కోతకు వచ్చింది. పువ్వు వెనుక భాగం నిమ్మ పచ్చ రంగుకి మారిన తర్వాత, పువ్వులను కోసి 2-3 రోజులపాటు



ఆరనివ్వాలి. ట్రాక్టరుతో నడిచే నూర్పిడి యంత్రాలను ఉపయోగించి విత్తనాన్ని వేరుచేసుకోవచ్చు. గింజల్లో తేమ శాతం 9-10% వచ్చే వరకు ఎండబెట్టాలి.

**డా॥ యస్. వాణిశ్రీ, ప్రధాన శాస్త్రవేత్త (నూనె గింజలు), ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, పాలెం, ఫోన్ నెం.8186945838**

## అపరాలు

- వేసవిలో ఆలస్యంగా విత్తిన పెసర/మినుము పంటలలో 80% కాయలు పరిపక్వతకు వచ్చిన తరువాత మొక్కలను మొత్తంగా కాని, కాయలను కాని లేదా యంత్ర సహాయంతో పంటను కోయవలెను. ఆ తర్వాత నూర్పిడి చేసి శుభ్రపరిచి బాగా ఎండనిచ్చి గింజల్లో తేమ 9-10 శాతం మించకుండా చూసుకొని నిల్వ చేసుకోవాలి. గృహావసరాలకు నిల్వ చేయునప్పుడు బాగా ఎండిన తర్వాత నిల్వ చేసినచో పెంకు పురుగు ఆశించకుండా నివారించవచ్చు.
- **వివిధ పంటలకు ముందు పెసర సాగు:** పెసర స్వల్పకాలిక పంట (60-65 రోజులు) కావున తొలకరితో, తొలకరి కంటే ముందు అనగా కృత్తిక ఆఖరు రోహిణీలో విత్తుకున్నచో అదనపు ఆదాయం పొందవచ్చు అలాగే కాయలు కోసిన తర్వాత భూమిలో కలియదున్ని భూసారాన్ని పెంచడమేకాక ఆ తర్వాత వేసే పంట దిగుబడి పెంచుటకు దోహదపడుతుంది.
- **వానాకాలం పంటకు సమాయత్తం / రకాలను ఎంపిక / విత్తన సేకరణ:** పొలంలో ఉన్న కలుపు మొక్కలను మరియు గత పంట యొక్క అవశేషాలను తీసివేయాలి. వీలైనంత వరకు పంట భూములకు బాగా చివికిన పెంట లేదా చెరువు మట్టి తొలి భూమిలో కలిసేలా గుంటక తొలి సారవంతం చేసుకోవాలి. సిఫారసు చేయబడిన అధిక దిగుబడినిచ్చే రకాలను ఎంపిక చేసుకొని సకాలంలో విత్తుకోవడానికి సిద్ధం చేసుకోవాలి.
- విత్తనాలతో పాటు పంటకు సరిపోయే ఎరువులను కూడా సేకరించి పెట్టుకున్నచో సకాలంలో పంట విత్తేటప్పుడు ఆఖరు దుక్కిలో వేసుకోవచ్చును.

**డా॥ కె. రుక్మిణి దేవి, ప్రధాన శాస్త్రవేత్త (అపరాలు) & హెడ్, వ్యవసాయ పరిశోధన స్థానం, మధిర, ఫోన్ నెం. 7675050041**

## సోయాచిక్కుడు

సోయాచిక్కుడు తెలంగాణ రాష్ట్రంలో ఖరీఫ్‌లో సాగు చేయబడుతున్న ముఖ్యమైన నూనెగింజలు మరియు పప్పు దినుసుల పంట. ఇందులో 20-23 శాతం నూనె మరియు 42-45 శాతం వరకు అధిక నాణ్యత కలిగిన మాంసకృత్తులు ఉన్నాయి. ఈ పంటను ఖరీఫ్‌లో ప్రత్తి, కంది, జొన్న, మొదలగు పంటలలో అంతరపంటగా గాని లేదా ఏక పంటగా కూడా సాగుచేసుకోవచ్చు.

**సోయాచిక్కుడు విత్తే ముందు చేయవలసిన పనులు:**

**దుక్కి మరియు ఎరువుల వాడకం:** వేసవిలో లోతైన దుక్కులు చేసుకోవాలి. చివరి దుక్కిలో సిఫారసు చేసిన నత్రజని ఎరువులో 50% నత్రజనితోపాటు సిఫారసు చేసిన మొత్తం భాస్వరం మరియు పొటాష్ ఎరువులను విత్తే ముందు అడుగు మందుగా భూమిలో వేయాలి. భాస్వరం ఎరువును సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ రూపంలో వేస్తే గంధకం కూడా లభ్యమవుతుంది. అలాగే ఎకరానికి 20 కిలోల చొప్పున జింక్ సల్ఫేట్‌ను దుక్కిలో వేయాలి.

**రకాల ఎంపిక:** మన ప్రాంతానికి అనువైన, రోగ నిరోధక శక్తి కలిగి అధిక దిగుబడినిచ్చే రకాలను ఎంపిక చేసుకోవాలి. మన తెలంగాణ ప్రాంతానికి, తక్కువ కాలపరిమితి కలిగిన జె.యస్-93-05 రకం, మధ్యస్థ కాలపరిమితి గల జె.యస్-335, ఆదిలాబాద్ ఇండోర్ సోయాచిక్కుడు-1, ఎం.ఏ.యు.యస్-612, డి.యస్.బి-34, ఎం.ఏ.సి.యస్-1460 రకాలు, అలాగే బాసర వంటి దీర్ఘకాలిక రకాలు అనువైనవి. అనువైన రకాన్ని ఎంపిక చేసేటప్పుడు, నేల స్వభావం మరియు నీటి వసతులను పరిగణలోనికి తీసుకోవాలి. విత్తనాలు



ప్రభుత్వ రంగ విత్తన సంస్థల ద్వారా లేదా గుర్తింపు పొందిన డీలర్ల వద్ద మాత్రమే కొనుగోలు చేయాలి. కొనుగోలు రశీదు తీసుకొని, విత్తన సంచి లేబులింగ్ తప్పకుండా చూసుకోవాలి. అలాగే విత్తుకునే ముందు రైతులు మొలక శాతాన్ని తప్పకుండా పరీక్షించుకోవాలి.

**విత్తనశుద్ధి:** తెగుళ్ళ నుండి రక్షణ మరియు అధిక దిగుబడికి తప్పకుండా విత్తనశుద్ధి చేయాలి. ముందుగా ప్రతి కిలో విత్తనానికి 2 గ్రా. థైరమ్ (75 డబ్ల్యు.పి) లేదా 1 గ్రా. కార్బండాజిమ్ (50% డబ్ల్యు.పి) లేదా 1.5 గ్రా. కార్బక్సిన్ 37.5% + థైరమ్ లేదా 2 గ్రా. థియోఫానేట్-మిథైల్ + పైరాక్లోస్ట్రోబిన్, తరువాత 1.5 మి.లీ. ఇమిడాక్లోప్రిడ్ (600 ఎఫ్.ఎస్)తో విత్తనశుద్ధి చేయాలి. చివరగా విత్తే గంట ముందు ప్రతి 10 కిలోల విత్తనానికి 200 గ్రా. బ్రాడి రైజోబియం జపానికం కల్చరును నీరు, జిగురుతో కలిపి నీడలో ఆరబెట్టి విత్తుకోవాలి.

**డా॥ ఎం. రాజేందర్ రెడ్డి, ప్రధాన శాస్త్రవేత్త (సోయాచిక్కుడు), వ్యవసాయ పరిశోధన స్థానం, ఆదిలాబాద్, ఫోన్ నెం. 97041 34304**

## చెఱకు

- మే మాసంలో పెరుగుతున్న ఉష్ణోగ్రతలకు తట్టుకునేలా, పిలకదశలో ఉన్న చెఱకును నీటి ఎద్దడి పరిస్థితుల నుండి కాపాడుకోవడం కొరకు రైతులు కొన్ని మెలకువలు తీసుకోవాలి.
- నీటి వసతి ఉన్న పరిస్థితుల్లో తేలిక పాటి నేలల్లో ఏడు రోజులకు ఒకసారి, బరువైన నేలల్లో 10 నుండి 15 రోజులకొకసారి పిలకదశలో ఉన్న చెఱకు పంటకు నీటి తడిని అందించాలి. తడికి తడికి మధ్య వ్యవధిని పెంచి పైరుకు బెట్టను తట్టుకునే శక్తిని కలుగజేయాలి.
- నీటి వసతి తక్కువగా ఉండి పంట నీటి ఎద్దడికి గురయ్యే పరిస్థితుల్లో చెఱకు చెత్తను ఎకరాకు 1.25 టన్నుల చొప్పున మొక్క మరియు కార్శి తోటకు పరచటం వలన నీటి ఎద్దడిని కొంతవరకు తట్టుకుంటుంది. నీటి ఎద్దడి ఉన్న చోట ముచ్చెలు నాటిని తర్వాత చెఱకు చెత్తను బోదెల్లో పరచుట వలన నేలలో తేమ నిలిచి ఉంటుంది. చెత్తను మందంగా కప్పడం వలన తోటలో మొలక శాతం, కార్శి తోటల్లో పిలకల సంఖ్య తగ్గుతుంది. పురుగులు, తెగుళ్ళు సోకిన తోటల నుండి చెత్తను వాడకూడదు. చెదలు ఎక్కువగా ఆశించే ప్రాంతాలలో చెత్త కప్పే ముందు క్లోరోపైరిఫాస్ 50% లీటరు నీటికి 5 మి.లీ. చొప్పున కలిపి మందు ద్రావణం పిచికారి చేయాలి.
- నీటి వసతి తక్కువగా ఉండి, పంట నీటి ఎద్దడికి గురయ్యే పరిస్థితుల్లో 2.5 శాతం యూరియా + పొటాష్ ద్రావణాన్ని పిచికారి చేయడం వలన పంట బెట్టను తట్టుకుంటుంది.
- నీటి లభ్యత తక్కువగా ఉనప్పుడు బిందు సేద్యం ద్వారా నీటిని పొదుపుగా వాడుకోవడం లాభదాయకంగా ఉంటుంది.
- లేత చెఱకు పంటలో ముఖ్యంగా వేసవి కాలంలో పీకపురుగు ఎక్కువగా నష్టపరుస్తూ ఉంటుంది. దీని తాకిడి వర్షాధారపు చెఱకుపై ఎక్కువగా ఉంటుంది. భూమి ఉపరితలంపై కణుపు వచ్చిన తర్వాత ఈ పురుగులు కాండం తొలచడం ప్రారంభించి మొక్క లోపలికి చొచ్చుకొనిపోయి కాండం లోపలి భాగాన్ని తినివేయడం వలన మొవ్వులు ఎండి చనిపోతాయి. చనిపోయిన మొక్కలు పీకిన తేలికగా బయటకు వస్తాయి. కుళ్ళిపోయిన మొవ్వు నుండి చెడు వాసన వస్తుంది. దీని నివారణకు పురుగు ఆశించిన తోటలలో 3 మి.లీ. క్లోరోపైరిఫాస్ 20 ఇసి. లేదా 0.75 మి.లీ. క్లోరాంట్రానిలిప్రోల్ లేదా ఫిప్రోనిల్ 3 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. పంట నాటిన 30 రోజుల తర్వాత 2 సార్లు పిచికారి చేయడం వలన పీక పురుగు సమర్ధవంతంగా నివారించుకోవచ్చు. అంతేకాకుండా జీవనియంత్రణ పద్ధతిలో ట్రైకోగ్రామా ఖిలోనిస్ గ్రుడ్డు పరాన్నజీవిని ఎకరాకు 20,000 చొప్పున చెఱకు నాటిన 30 రోజుల వ్యవధిలో 4 సార్లు విడుదల చేయాలి.

**డా॥ యం. విజయ్ కుమార్, ప్రధాన శాస్త్రవేత్త (చెఱకు) & హెడ్ వ్యవసాయ పరిశోధన స్థానం, బసంత్‌పూర్, మెదక్, ఫోన్ నెం. 9849535756**

# వాతావరణం-పంటల పరిస్థితి-విశ్లేషణ

డా॥ పి. లీలా రాణి మరియు డా॥ యస్. జి. మహాదేవప్ప
వ్యవసాయ వాతావరణ పరిశోధన కేంద్రం, వ్యవసాయ పరిశోధన స్థానం, రాజేంద్రనగర్, హైదరాబాద్

రాష్ట్రంలో నైరుతి ఋతుపవనాల (జూన్ నుండి సెప్టెంబర్) కాలంలో 962.6 మి.మీ వర్షపాతం (౦30 శాతం), పోస్ట్ మాన్సూన్ సీజన్‌లో (అక్టోబర్ నుండి డిసెంబర్) 86.5 మి.మీ వర్షపాతం (-24 శాతం), చలి కాలంలో (జనవరి నుండి ఫిబ్రవరి) 0.2 మి.మీ వర్షపాతం (-98 శాతం) మరియు వేసవి కాలంలో (మార్చి నుండి ఏప్రిల్ ) 33.2 మి.మీ. వర్షపాతం (౦23 శాతం) నమోదైనది.

రాష్ట్రంలో యాసంగి పంటకాలానికి ఇప్పటి వరకు (30.04.2025) సాధారణ విస్తీర్ణంలో (ఎకరాలలో) వరి- 126 శాతం (5978010), జొన్న - 263 శాతం (366558), మొక్కజొన్న - 155 శాతం (912846), కంది - 325 శాతం (10372), శనగ - 67 శాతం (222772), పెసర - 58 శాతం (13361), మినుములు - 117 శాతం (56273), ఉలవలు - 83 శాతం (982), వేరుశనగ - 96 శాతం (251115), ప్రొద్దుతిరుగుడు - 95 శాతం (21491) మరియు కుసుమ - 60 శాతం (7193) సాగు చేయటం జరిగింది. ఈ సంవత్సరం యాసంగి పంటకాలంలో ఇప్పటి వరకు 126 శాతం మేర పంటలు సాగుచేయటం జరిగింది. ఇందులో ఆహార పంటలు 133 శాతం, పప్పుదినుసులు 74 శాతం, నూనె గింజల పంటలు 88 శాతం సాగుచేయటం జరిగింది.

భారత వాతావరణ విభాగం న్యూఢిల్లీ వారి ముందస్తు వాతావరణ సూచనల ప్రకారం రాష్ట్రంలో మే మాసంలో కనిష్ట మరియు గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువ నమోదయ్యే సూచనలున్నాయి మరియు వర్షపాతం సాధారణం కంటే ఎక్కువగా నమోదయ్యే సూచనలున్నాయి. ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, కరీంనగర్ మరియు సంగారెడ్డి జిల్లాలలో సాధారణం కన్నా 2-3 రోజులు ఎక్కువగా వడగాలులు వీచే అవకాశం కలదు.

వడగాల్పులు మరియు అధిక ఉష్ణోగ్రతల నుండి పంటలను, పండ్ల తోటలను, పశువులను మరియు కోళ్ళను కింద సూచించిన విధంగా కొన్ని యాజమాన్య పద్ధతులను పాటించడం ద్వారా కొంత వరకు నష్టం నివారించుకోవచ్చు.

## వాతావరణాధారిత వ్యవసాయ సలహాలు

- వేసవి దుక్కుల వలన భూమిలో నిద్రావస్థలో ఉన్న పంటలపై చీడపీడలు కలిగించే పురుగుల, తెగుళ్ళకు చెందిన వివిధ దశలు భూమిలో నుండి అవి బైటపడి అధిక ఉష్ణోగ్రతలకు చనిపోతాయి. బయటపడిన ప్యూపాలను, గుడ్లను, పక్షులు తిని నాశనం చేస్తాయి ఇలా పలువిధాల మేలు కలగడమే గాక భూమి గుల్లభారి నీటి నిల్వ శక్తి పెరుగుతుంది. అందువల్ల అప్రమత్తంగా ఉండి వేసవి జల్లులను ఆసరా చేసుకొని వేసవి దుక్కులను చేసుకోవాలి.
- పండ్ల తోటలో వేసవి కాలంలో గుంతలు తీసి ఎండకు ఎండ నివ్వాలి. దీని వల్ల నేలలో ఉన్న పురుగులు, వాటి గుడ్లు, తెగుళ్ళను కలిగించే శిలీంద్రాలు నశిస్తాయి. ఆ తర్వాత పండ్ల మొక్కలు నాటుకోవటం మంచిది.
- పెసర మరియు మినుము పంటలలో తెల్లదోమ నివారణకు 1.6 మి.లీ. మోనోక్రోటోఫాస్ లేదా 1.5 గ్రా. ఎసిఫేట్ మందును లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి లేనియెడల పల్లాకు తెగులు వ్యాప్తి చెందును.
- కూరగాయ పంటలలో రసం పీల్చే పురుగులు గమనించినట్లైతే, నివారణకు 2 మి.లీ. డైమిథోయేట్ లేదా 1.5 గ్రా. ఎసిఫేట్ లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. మందుల పిచికారికి పవర్ స్ప్రేయర్ వాడినట్లయితే మందుల మోతాదు రెట్టింపు చేసి నీటి పరిమాణమును సగానికి తగ్గించి పిచికారి చేయాలి.
- మట్టి నమూనాలను సేకరించి నేల లోని పోషక విలువల సమాచారం కొరకు మట్టి నమూనాలను పరిక్ష చేయించుకోగలరు.
- నీటి వసతి గల ప్రాంతాలలో పచ్చిమేత కొరకు పశుగ్రాస పంటలుగా జొన్న మరియు మొక్కజొన్న పంటలను వేసుకోవచ్చును, తక్కువ నీటి వసతి గల ప్రాంతాలలో పశుగ్రాస పంటలుగా సజ్జ మరియు బొబ్బర్ల పంటలను వేసుకోవచ్చును.

ఇతర వివరములకు సంప్రదించవలసిన
ఫోన్ నెం. 9492359789

# ప్రధాన మంత్రి - ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్ప్రైజెస్ స్కీమ్ కామన్ ఇంక్యుబేషన్ సెంటర్, జగిత్యాల ద్వారా రైస్ ప్రాసెసింగ్

ఎ. పోశాద్రి, డి. శ్రీలత, పి.రవి, డి. ఎ. రజనీ దేవి, ఇ. రజనీకాంత్ మరియు కె. స్వాతి
ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, జగిత్యాల




దేశంలో పండించే పంటలను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకు రావాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇక్కడ మనం ఒక సామెతను గుర్తు చేసుకోవాలి “ధాన్యం ప్రాసెసింగ్, ధాన్యం ఉత్పత్తికి సమానం”. రైతు ఆదాయం రెట్టింపు, ప్రజలకు నాణ్యమైన ఆహారం, గ్రామీణ యువతకు ఉపాధి అవకాశాలు, ద్రవ్యోల్బణం నియంత్రణలో ఉండాలన్నా, దేశంలో విదేశీ మారక ద్రవ్యం పెరగాలన్నా ఫుడ్ ప్రాసెసింగ్ రంగాన్ని ప్రోత్సహించడం తక్షణ కర్తవ్యం. ఫుడ్ ప్రాసెసింగ్ రంగాన్ని వృద్ధి చేయడం ద్వారా భారత ప్రభుత్వం లక్ష్యాలైన వికసిత్ భారత్-2047 అనే లక్ష్యానికి మన రైతులు చేరువయ్యే అవకాశం ఉంటుంది. ఒక జిల్లా ఒక రకమైన ఆహార ఉత్పత్తి కేంద్రం వంటి విధానాలతో స్థానిక పంటలకు విలువ జోడించుట, రైతులకు గిట్టుబాటు ధర అందించడం, ఆయా ప్రాంత ప్రజలకు కావలసిన నాణ్యమైన ఆహార పదార్థాలను అందించడం, గ్రామీణ యువతి యువకులకు ఉపాధి అవకాశాలను పెంపొందించడం వంటి ముఖ్య ఉద్దేశాలతో ఆత్మ నిర్భర్ భారత్ అభియాన్ కింద స్కీంను ప్రారంభించడం జరిగినది. ఈ పథకం ద్వారా ప్రస్తుత ఐదు సంవత్సరాలలో (2020-21 నుండి 2024-2025 వరకు) సుమారు 10,000 కోట్లు కేంద్ర ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ ద్వారా 200,000 మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ లకు క్రెడిట్ లింక్డ్ సబ్సిడీతో నేరుగా సహాయం అందించబడుతుంది. ఈ స్కీంను 2025-2026 ఆర్థిక సంవత్సరానికి కూడా వర్తిస్తుందని కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించింది. ఆహారశుద్ధి రంగాన్ని వేగవంతంగా అభివృద్ధి చేయడానికి తగిన ఆర్థిక సహాయం అందించడం వలన తగినన్ని మౌలిక సదుపాయాలు పెరిగి ఈ రంగం సంస్థాగత నిర్మాణానికి దోహదపడుతుందని మన గౌరవ ప్రధానమంత్రి గారు ఈ పథకాన్ని తీసుకురావడం జరిగింది. కేంద్ర ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ, రాష్ట్ర మరియు కేంద్ర పాలిత ప్రాంతాల ప్రభుత్వాల సహకారంతో ఆయా ప్రాంతాలలో ఉన్నటువంటి సూక్ష్మ ఆహార శుద్ధి పరిశ్రమలను ఆధునీ కరించడం, ఆయా పరిశ్రమలకు కావలసిన ఆర్థిక, సాంకేతిక మరియు మార్కెటింగ్ అవకాశాలను వృద్ధి చేయడం కోసం కేంద్ర ప్రాయోజిత ప్రైమ్ మినిస్టర్ ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్ప్రైజెస్ (పిఎమ్-ఎఫ్ఎమ్ఇ) స్కీంను ప్రారంభించడం జరిగింది. తెలంగాణ రాష్ట్రంలో రైస్ ఉత్పత్తి ఆధారంగా, కరీంనగర్, పెద్దపల్లి, జనగాం జిల్లాలలో బియ్యము మరియు వాటి విలువ ఆధారిత ఉత్పత్తులపైన పరిశ్రమల ఏర్పాటును ప్రోత్సహించడం కోసం ప్రధాన మంత్రి సూక్ష్మ ఆహార పరిశ్రమల అధికారికీకరణ, ఒక జిల్లా ఒక రకమైన ఆహార ఉత్పత్తి కేంద్రం ద్వారా అన్ని వర్గాల వారికి ప్రయోజనం ఉంటుందని కేంద్ర ప్రభుత్వం గుర్తించింది.

కేంద్ర ఆహార శుద్ధి మంత్రిత్వ శాఖ ప్రాయోజిత కార్యక్రమమైన ప్రధానమంత్రి సూక్ష్మ ఆహార పరిశ్రమల క్రమబద్ధీకరణ (పిఎమ్ఎఫ్ఎమ్ఇ) పథకం ద్వారా మూడు కోట్ల 30 లక్షల 50 వేల రూపాయల నిధులతో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయ పరిధిలోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, పొలాస, జగిత్యాలలో కామన్ ఇంకుబేషన్ సెంటర్ ఏర్పాటు చేయటం జరిగినది. దీని ద్వారా జగిత్యాల జిల్లా మరియు చుట్టుపక్కల ప్రాంతాలలో రైతులు పండిస్తున్న రైస్‌కు విలువ జోడించడం ద్వారా అదనపు ఆదాయము పొందడానికి శిక్షణ, వివిధ రకాల ఆహారపదార్థాల తయారీ మరియు మార్కెట్లోకి నాణ్యమైన ఆహార ఉత్పత్తులను అందుబాటు లోకి తీసుకురావడానికి మరియు పండించిన పంటకు విలువ జోడించడం ద్వారా నిల్వ చేయడం వంటి కార్యక్రమాలను ప్రోత్సహిస్తుంది.

వరి గింజలను మిల్లింగ్ ద్వారా మనము బియ్యం తయారు చేసుకుంటాం. రైసును పిండి పట్టడం ద్వారా బియ్యం పిండి, రవ్వ, రైస్ స్టార్చ్ మొదలైన ఉత్పత్తులుగా మార్చిన తర్వాత వివిధ ఆహార పరిశ్రమలకు ముడి సరుకుగా సమకూర్చి లాభం పొందవచ్చు. బియ్యం పిండితో చాలా రకాల తినుబండారాలు, స్నాక్స్, సంప్రదాయ వంటకాలు, బేకరీ ఉత్పత్తులు, స్వీట్స్, సాసులు మరియు సూప్ పౌడర్స్, వర్మిసెల్లి , పాస్తా, నూడిల్స్ , మిల్క్ షేక్స్, ప్రోటీన్ పౌడర్స్, వెజిటేబుల్ ప్రోటీన్ పౌడర్స్, హైడ్రోకోలైడ్స్ మొదలైన వాటిని తయారు చేయవచ్చు. వడ్ల నుండి అటుకులు, పేలాలు, పోహా అటుకులు, మరమరాలు తక్కువ ఖర్చుతో తయారు చేయవచ్చు.

## రైస్ ప్రాసెసింగ్ & విలువ జోడింపు ద్వారా క్రింది రకాలైన ఆహార ఉత్పత్తులను తయారు చేసుకోవచ్చు:

**ఫోర్టిఫైడ్ రైస్:** భారత ప్రభుత్వం పోషకార లోపాలను అధిగమించడానికి ఫోర్టిఫైడ్ రైస్ (బియ్యానికి వివిధ రకాల విటమిన్‌లు మరియు ఖనిజ లవణాలు కలుపుతారు) మధ్యాహ్న భోజన పథకము మరియు స్త్రీ, శిశు సంక్షేమ శాఖల ద్వారా ప్రజలకు అందించాలనుకుంది. బియ్యానికి విటమిన్ ప్రిమిక్స్ నేరుగా కలిపి కానీ, ఎక్స్ట్రుషన్ అనే పద్ధతి ద్వారా కలిపి ఫోర్టిఫైడ్ రైస్ తయారు చేయవచ్చు.

**వివిధ అల్పాహార (బ్రేక్ ఫాస్ట్ మిక్స్) పదార్థాలు:** ప్రస్తుతం మార్కెట్లో ఇన్‌స్టంట్ ఫుడ్స్, బ్రేక్ ఫాస్ట్ మిక్స్‌లకు చాలా డిమాండ్ ఉంది. ఇడ్లీ, దోశ పిండి వంటివి తయారుచేసి కోల్డ్ చైన్ ద్వారా మార్కెట్లో అమ్ముతున్నారు.

**అటుకులు, పేలాలు :** అటుకులు, పేలాలకు మార్కెట్లో అనాదిగా మంచి డిమాండ్ ఉంటుంది. ముఖ్యంగా వివిధ రంగురంగుల వడ్లతో తయారుచేసిన అటుకులకు, పేలాలకు మార్కెట్లో అధిక ధరకు అమ్ముకోవడానికి అవకాశం ఉంటుంది.

**బియ్యం పిండితో వివిధ రకాల తినుబండారాల తయారీ:** బియ్యం పిండితో సర్వపిండి, సర్వపిండి మిక్స్, సకినాల మిక్స్, సకినాలు, సత్తుపిండి, మురుకులు, చెక్కలు, వివిధ రకాల స్వీట్స్, అరిసెల మిక్స్, అరిసెలు తయారుచేసి అమ్మినట్లయితే మంచి లాభం వస్తుంది.

## బియ్యం మరియు ఇన్‌స్టంట్ ఆహార ఉత్పత్తులు

**మొలకెత్తిన బియ్యం గింజలు:** వడ్లను మొలకెత్తిన తర్వాత ఎండబెట్టి, పెనం పైన వేయించినట్లయితే మంచి పోషకాలు కలిగినటువంటి రుచికరమైన మొలకెత్తిన బియ్యం గింజలు తయారుచేసి ప్యాక్ చేసి అమ్మినట్లయితే మంచి లాభం ఉంటుంది.

**అన్నము మరియు వివిధ రకాల ఇన్స్టెంట్ ఆహార ఉత్పత్తులు:** బ్రౌన్ రైస్‌తో పాటు, వివిధ రకాల రంగు గల బియ్యాన్ని అమ్మినట్లయితే మంచి ఆదాయం లభిస్తుంది. సాధారణ బియ్యంగా కాకుండా, బియ్యానికి వివిధ రకాల పదార్థాలు కలిపి ఇన్‌స్టంట్ కిచిడి, ఇన్‌స్టంట్ సాంబార్ రైస్, ఇన్‌స్టంట్ వెజిటేబుల్ బిర్యాని, ఇన్‌స్టంట్ పలావ్, ఇన్‌స్టంట్ మసాలా రైస్, ఇన్‌స్టంట్ పొంగల్ రైస్, ఇన్‌స్టంట్ జీరా రైస్, ఇన్‌స్టంట్ పులిహోర వంటి మొదలైన రుచికరమైన ఆహార పదార్థాలను తయారు చేసి మార్కెట్లో అమ్మినట్లయితే అధిక లాభాలను గడించవచ్చు.

**అన్నం నాణ్యతలో అమైలోజ్ శాతం ఆవశ్యకత:** వరి నాణ్యత లక్షణాలలో బియ్యం వండుటకు కావలసిన నీటి పరిమాణం కూడా ముఖ్యం. కొన్ని రకాల బియ్యానికి నీరు ఎక్కువ అవసరం కాగా, మరికొన్ని రకాల బియ్యం ఉడకడానికి తక్కువ నీరు సరిపోతుంది. సాధారణంగా కోత కోసిన వెంటనే ముఖ్యంగా కొత్త బియ్యం వండితే అన్నం ఉడకడానికి తక్కువ పరిమాణంలో నీరు సరిపోతుంది. అన్నం మెతుకులు ఒకదానికొకటి అతుక్కునే అవకాశం ఉంటుంది. నిల్వ ఉంచిన ధాన్యం ముఖ్యంగా పాత బియ్యం ఉడికించేందుకు ఎక్కువ నీరు అవసరం అవుతుంది. బియ్యంలో ఉండే అమైలోజ్ శాతం పెరిగే కొద్దీ అన్నం ఉడకడానికి ఎక్కువ నీరు అవసరం అవుతుంది వరి గింజలో అమైలోజ్, అమైలో పెక్టిన్ అనే రెండు రకాల పిండి పదార్థ (కార్బోహైడ్రేట్స్) రేణువులుంటాయి. మనం తినే అన్నం యొక్క నాణ్యత లక్షణాలన్నీ

ప్రధానంగా బియ్యపు గింజలోని అమైలోజ్ శాతం పై ఆధారపడి ఉంటుంది. అమైలోజ్ శాతాన్ని బట్టి వరి రకాలను అమైలోజ్ రహిత (వ్యాక్సి), అమైలోజ్ కలిగినటువంటి (నాన్ వాక్సి) రకాలుగా విభజిస్తారు. అమైలోజ్ కలిగి ఉన్నటువంటి నాన్ వాక్సి రకాలను అమైలోజ్ శాతాన్ని బట్టి 4 రకాలుగా అతి తక్కువ (2-9%), తక్కువ (10-20%), మధ్యస్థం (20-25%) ఎక్కువ (25-35%) రకాలుగా వర్గీకరిస్తారు. అమైలోజ్ శాతం ఎక్కువగా బియ్యాన్ని కనుక వండినట్లయితే ఉడికిన తర్వాత అన్నం చాలా బిరుసుగా ఉంటుంది. అన్నం గింజ పరిమాణం కూడా పెరుగుతుంది. అన్నం చల్లారిన తరువాత గట్టిగా ఉండి తినేందుకు అనుకూలంగా ఉంటుంది. అమైలోజ్ శాతం తక్కువగా ఉండే బిఎఫ్ గింజలు ఉడికిన తర్వాత మెతుకులు ఒకదానికొకటి అతుక్కుని అన్నం మెత్తగా ముద్దగా అయ్యే అవకాశం ఉంది. అమైలోజ్ శాతం తక్కువగా ఉన్న రకాలు అన్నం వండుకోవడానికి పనికిరావు. మధ్యస్థ అమైలోజ్ (20-25) శాతం కలిగిన వరి రకాలు అన్నం వండుకోవడానికి అత్యంత అనువైనవి. అమైలోజ్ శాతం తక్కువ కలిగిన వరి రకాలను చిన్నపిల్లల ఆహారము మరియు వృద్ధుల ఆహారము తయారు చేయడానికి ఎక్కువగా ఆహార పరిశ్రమల్లో ముడి సరుకుగా వాడుతారు. ఎక్కువ అమైలోజ్ శాతం కలిగిన వరి రకాలను నూడిల్స్, పాస్తా, ఇతర ఆహార పదార్థాలలో ముఖ్యమైన సరుకుగా వాడుతారు.

**బేకరీ ఉత్పత్తులు:** బియ్యం పిండి, వివిధ బేకరీ ఉత్పత్తులలో ప్రపంచవ్యాప్తంగా విరివిగా వినియోగిస్తున్నారు. బియ్యం పిండి కలపడం ద్వారా గోధుమ పిండి యొక్క శాతాన్ని ఆ యొక్క ఆహార ఉత్పత్తిలో తగ్గించవచ్చు.

**నూడిల్స్, పాస్తా మరియు వెర్మీసలి మొదలైన ఫాస్ట్ ఫుడ్స్:** గోధుమ పిండితో పాటు బియ్యం పిండి, రవ్వ ను కలపడం వలన మంచి బలవర్ధకమైన ఆహారం తయారవుతుంది.

**రైస్ పాపడ్ :** తక్కువ ఖర్చుతో బియ్యం పిండితో వివిధ రకాల పాపడ్స్ తయారు చేసి అమ్మవచ్చు.

పైన తెలిపిన వివిధ రకాల ప్రాసెసింగ్ పద్ధతులు కామన్ ఇంకుబేషన్ సెంటర్ ద్వారా జిల్లా రైతులకు మరింత అందుబాటులో తేవడానికి కృషి చేస్తుంది. చిన్న సూక్ష్మ తరహా పరిశ్రమలు ఏర్పాటు జిల్లాలో మరింత ప్రోత్సహించడానికి, అంకుర పరిశ్రమలకు కావలసిన శాస్త్రీయ సాంకేతిక సలహాలను, శిక్షణ కార్యక్రమాలను, జిల్లాలోని రైతాంగాన్ని, యువతను, మహిళా సంఘాలను, రైతు ఉత్పత్తిదారుల సంఘాలను మరిన్ని ఆహార పరిశ్రమలను జిల్లాలో ఏర్పాటు చేయుటకు ప్రోత్సహించడానికి కామన్ ఇంక్యుబేషన్ సెంటర్ భవిష్యత్తులో ఎంతో ఉపయోగపడుతుందని ఆశిద్దాం.

ఇతర వివరములకు సంప్రదించవలసిన
ఫోన్ నెం. 9492828965

**ఏప్రిల్ 2025 మాసంలో పి.జె.టి.ఏ.యు. వారి అగ్రికల్చర్ వీడియో - యూట్యూబ్ ఛానల్‌లో అప్‌లోడ్ చేసిన నూతన వీడియోలు**

| | | |
|---|---|---|
| 1. | 03.04.2025 | పంటల ప్రదర్శన శాల (క్రాప్ కేఫేటిరియా) |
| 2. | 09.04.2025 | రుద్రూరు పరిశోధన స్థానం నుండి విడుదలైన నూతన వరి రకం ఆర్.డి.ఆర్. 1200 |
| 3. | 10.04.2025 | రుద్రూరు పరిశోధన స్థానం నుండి విడుదలైన నూతన వరి రకం ఆర్.డి.ఆర్. 1162 |
| 4. | 17.04.2025 | ప్రొ. జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం వారి నూతన పంట రకాలు 2024 |
| 5. | 17.04.2025 | కృషి విజ్ఞాన కేంద్రం అదిలాబాద్ దృశ్యమాలిక |
| 6. | 17.04.2025 | సుస్థిర వర్షాధార వ్యవసాయానికి నీటికుంటలు |
| 7. | 22.04.2025 | చిరుధ్యానాల పంటలలో విలువల జోడింపు |
| 8. | 22.04.2025 | ప్రత్తి పంట తరువాత నువ్వు సాగు రైతు విజయగాథ |
| | | **యూట్యూబ్ ఛానల్‌లో అప్‌లోడ్ చేసిన నూతన షార్ట్స్** |
| 1. | 04.04.2025 | యాసంగి వరిలో మెడవిరుపు తెగులు - నివారణ |
| 2. | 24.04.2025 | ప్రత్తి + కంది -రైతు విజయగాథ |
| 3. | 30.04.2025 | వరంగల్ వరి 1246 |
| 4. | 30.04.2025 | కంపాసాగర్ వరి 6251 |

# మొక్కజొన్న నిల్వలో రక్షణ: పురుగులు, శిలీంధ్రాల నివారణకు సమగ్ర యాజమాన్యం

**డా॥ కె. వాణిశ్రీ, డా॥ బి. మల్లయ్య, డా॥ డి. భద్రు, డా॥ వై.యస్. పరమేశ్వరి మరియు డా॥ యం. సుజాత**
మొక్కజొన్న పరిశోధన కేంద్రం, వ్యవసాయ పరిశోధన సంస్థ, రాజేంద్రనగర్, హైదరాబాద్

మొక్కజొన్న ధాన్యాన్ని నిల్వలో భద్రపరచే సమయంలో ప్రధానంగా పురుగులు, శిలీంధ్రాలు మరియు ఎలుకలు కారణంగా గణనీయమైన నష్టం వాటిల్లుతోంది. అందులో ముఖ్యంగా పురుగుల వలన అధిక నష్టం సంభవిస్తోందని అధ్యయనాలు సూచిస్తున్నాయి. అందుబాటులో ఉన్న లెక్కల ప్రకారం, నిల్వలో పురుగుల వలన సుమారు 2-4.2%, ఎలుకల వలన 2.5%, పక్షుల వలన 0.85%, మరియు అధిక తేమ వలన 0.68% ధాన్య నష్టం జరుగుతోంది. అన్ని రకాల ధాన్య పంటలను కలిపి ఈ నష్టం దాదాపు 7,000 కోట్ల రూపాయల వరకు ఉంటుందని అంచనా. కావున, నిల్వ సమయంలో సరైన జాగ్రత్తలు తీసుకుంటే, ధాన్య నష్టం తగ్గి నికర ఆదాయం గణనీయంగా పెరిగే అవకాశం ఉంది.

**పురుగులు :** మొక్కజొన్న నిల్వలో ఆశించు కీటకాలలో ముక్కు పురుగు, వడ్ల చిలుక, తుట్టెపురుగు, నుసి పురుగు, కాప్రా బీటిల్ మరియు పిండి పురుగులు ముఖ్యమైనవి.

**ధాన్యాన్ని నష్టపరిచే విధానాన్ని బట్టి పురుగులను రెండు రకాలుగా విభజించవచ్చు**

- గింజ లోపల అభివృద్ధి చెందే పురుగులు
- గింజ బయట ఉండి నష్టం కలిగించే పురుగులు

**గింజ లోపల అభివృద్ధి చెందే పురుగులు :** ఇవి లార్వా దశలో గింజల లోపల చేరి, పోషక పదార్థాలను తిని వేసి, అక్కడే జీవిత దశలన్నీ పూర్తి చేసుకొని, తల్లి పురుగు గింజలను రంధ్రం చేసుకొని బయటకు వస్తాయి. వీటిలో ముఖ్యమైనవి వడ్ల చిలుక, ముక్కు పురుగు మొదలగునవి.


**వడ్ల చిలుక :** వీటి రెక్కల పురుగులు పొలంలోనే గింజలపై గ్రుడ్లు పెడతాయి. నిల్వ చేసినప్పుడు ఈ గ్రుడ్ల నుంచి పగిలిన పిల్ల పురుగులు గింజకు చిన్న రంధ్రం చేసి లోపలికి వెళ్ళి నష్టపరుస్తాయి. ఇవి తమ జీవిత చక్రాన్ని నెల రోజుల్లో పూర్తి చేసుకుంటాయి. కాబట్టి సంవత్సరానికి 11 నుంచి 12 తరాల పురుగులు గింజలను ఆశించి నష్టపరుస్తాయి. గోదాములలోని ఉపరితలంపై రెక్కల పురుగులు గాలిలో ఎగరడం చూసి వడ్ల చిలుక ఆశించినట్లు గుర్తించవచ్చును. మొక్కజొన్నను నిల్వ చేసినప్పుడు ఈ పురుగు వలన ధాన్యంపై నుంచి 1 1/2 అడుగు లోపలి వరకు మాత్రమే నష్టం జరుగుతుంది.

**ముక్కు పురుగు:** ఇవి 3 మి.మీ. పొడవు ఉండి తల భాగం సన్నని ముక్కుగా బయటకు వచ్చి ముదురు గోధుమ రంగు నుంచి నలుపు రంగులో ఉంటాయి. ఆడ పురుగులు గింజలపై సన్నని రంధ్రాలు చేసి లోపలికి గ్రుడ్లు పెట్టి పైన జిగురు వంటి పదార్థంతో కప్పి వేస్తాయి. ఒక్కొక్క ఆడ పురుగు గింజకు ఒక్కటి చొప్పున 150 నుండి 250 వరకు గ్రుడ్లను పెడుతుంది. ఈ గ్రుడ్ల నుంచి కాళ్ళు లేని మెత్తని పిల్ల పురుగులు పగిలి గింజలోనే ఉండి అందులోని పదార్థాన్ని పూర్తిగా తిని పైపొరను మాత్రం మిగులుస్తాయి. తల్లి పురుగులు బయటకు వచ్చి 3 నుంచి 5 నెలలు జీవించి మళ్ళీ మళ్ళీ మొక్కజొన్నకు నష్టం కలుగచేస్తాయి.

**నుసి పురుగు :** నుసి పురుగు యొక్క లార్వాల కన్నా తల్లి పురుగులే ఎక్కువగా నష్టపరుస్తాయి. మొక్కజొన్న గింజలను తక్కువ తేమ శాతంతో నిల్వ ఉంచినప్పుడు కూడా ఈ పురుగు బలమైన దవడలు కలిగి ఉన్నందున గింజలకు ఎక్కువ నష్టం కలుగచేయడమే కాకుండా, గింజ లోపలకు గ్రుడ్లను చొప్పించగలదు. ముదురు కాఫీ రంగులో ఉన్న ఒక్కొక్క రెక్కల తల్లి పురుగు రోజుకు పది చొప్పున దాదాపు 400 నుండి 500 గ్రుడ్ల వరకు పెడుతుంది. తల్లి పురుగులు చేసే నష్టం వలన గింజలు ముక్కలుగాను మరియు పిండిగాను తయారవుతాయి.












ఈ నష్టపరచిన గింజ ముక్కలు మరియు పిండిని లార్వాలు తిని తిరిగి తల్లి పురుగులుగా ఎదుగుతాయి. ఈ పురుగు ఆశించిన బస్తాల నుండి పిండి రాలడం గమనించవచ్చు.

**గింజ బయట ఉండి నష్టం కలిగించే పురుగులు:** ఈ పురుగులు ధాన్యం బయట ఉండి, విరిగిపోయిన లేదా పగుళ్ళు ఉన్న ధ్యాన్యంను ఆశించి తిని వేస్తాయి. వీటిలో ముఖ్యమైనవి తుట్టె పురుగు, నుసి పురుగు, పిండి పురుగులు మొదలగునవి.

**తుట్టె పురుగు:** ఈ పురుగు లార్వాలు ఎక్కువగా ముక్కలైన గింజలను మరియు పిండిని ఆశించి నష్టపరుస్తాయి. లార్వాలు విడుదల చేసే సిల్క్ దారాల వలన గింజలు, పురుగు కోశస్థ దశ గూళ్ళు మరియు అవి విసర్జించే మలమూత్రాలు అన్నీ కలిపి ముద్దగా తయారవుతాయి. ఈ విధంగా జరిగే నష్టం లార్వాలు గింజలను తినడం వలన జరిగే నష్టం కన్నా చాలా ఎక్కువగా ఉంటుంది. వీటి రెక్కల పురుగులు ఒక్కొక్కటి 60-160 గ్రుడ్లను గింజల, సంచుల మరియు గోదాముల గోడలపైన పెట్టి గింజలను నష్టపరిచే లార్వాలను ఉత్పత్తి చేస్తాయి.

**పిండి పురుగు:** ఈ పురుగు ధాన్యం కన్నా ఎక్కువగా మొక్కజొన్న పిండిని ఆశించి నష్టపరుస్తుంది. ఇది రోజుకు రెండు నుంచి మూడు చొప్పున మొత్తం 300 నుండి 400 వరకు గ్రుడ్లను పెడుతుంది. పురుగులు పిండి లోపల సొరంగాలు నిర్మిస్తూ ఒక విధమైన వాయువును విడుదల చేయడం వలన దుర్వాసన వస్తుంది. అందువల్ల పిండి పూర్తిగా దెబ్బతిని నాణ్యత కోల్పోతుంది.

పురుగుల వలన కలిగే నష్టాలు

- గింజ బరువు తగ్గిపోతుంది.
- పురుగు పట్టిన ధాన్యాన్ని శిలీంధ్రాలు ఆశించి ధాన్యం రంగు మారిపోతుంది.
- రుచి, వాసన మారిపోయి, ధాన్యం తినడానికి పనికిరాదు.
- నాణ్యతతో పాటు మొలక శాతం తగ్గిపోతుంది.
- ప్రోటీన్లు, పోషక విలువలు తగ్గిపోతాయి.
- నాణ్యత తగ్గుట వలన మార్కెట్ లో ధర పలకదు.

**శిలీంధ్రాల వలన కలిగే నష్టాలు:** ధాన్యం నిల్వలో తేమ శాతం ఎక్కువైతే శిలీంధ్రాలు ఆశించి గింజలన్నీ అట్టకట్టుకొని పోయి వేడెక్కిపోతాయి. బూజు తెగుళ్ళు ఆశించిన విత్తనం మొలక శాతం మరియు నాణ్యత కోల్పోతాయి. నిల్వ ధాన్యాన్ని ఆశించే శిలీంధ్రాలలో ముఖ్యమైనవి ఆస్పరిజిల్లస్ మరియు పెన్సిలియమ్ మొదలైనవి.

**శిలీంధ్రాలు నిల్వ ధాన్యాన్ని రెండు విధాలుగా నష్టపరుస్తాయి**

- ధాన్యాన్ని ఆశించి వేడి పుట్టి అట్టలు కట్టి నాణ్యత కోల్పోవడం
- విషపూరితమైన అఫ్లోటాక్సిన్ లాంటి పదార్థాలను విడుదల చేయడం

దీని వలన మొలక శాతం దెబ్బతినడమే కాకుండా ధాన్యం బరువు, పోషక విలువలు కోల్పోయి. దుర్వాసన వేస్తూ నాణ్యత తగ్గుట వలన మార్కెట్ ధర పలకదు. అలాగే విషపూరిత అఫ్లోటాక్సిన్ వల్ల ఆహారం విషతుల్యమై మనుషుల్లో మరియు పెంపుడు జంతువులలో రకరకాలైన వ్యాధులు కలగడానికి కారణమవుతుంది. ముఖ్యంగా కాన్సర్ బారినపడే అవకాశం ఉన్నది.

**శిలీంధ్రాలు ఆశించడానికి గల కారణాలు**

- నిల్వ ధాన్యంలో అధిక తేమ శాతం ఉండటం
- నిల్వ ఉంచిన గదిలో అధిక ఉష్ణోగ్రత కల్గి ఉండటం
- పొలంలో తెగులు సోకిన ధాన్యాన్ని గ్రేడింగ్ చేయకుండా నిల్వ చేయటం
- పురుగులు, నల్లులు ధాన్యాన్ని ఆశించటం

**ఎలుకల వలన కలిగే నష్టాలు :** ఎలుకల వలన 2.5% ధాన్యం నష్టపోవటం జరుగుతుంది. ముఖ్యంగా చిట్టెలుక, నల్ల ఎలుక, గోధుమ రంగు ఎలుక మరియు పందికొక్కు ముఖ్యమైనవి.

**గింజలను ఆశించే ఎలుకలు**

ఎలుకల వలన నిల్వ ధాన్యానికి 3 రకాలుగా నష్టం కలుగుతుంది

- ఎలుకలు ధాన్యాన్ని ఎక్కువ పరిమాణంలో తింటాయి.
- మల, మూత్ర విసర్జన ద్వారా, వెంట్రుకలు రాల్చటం ద్వారా ధాన్యాన్ని కలుషితం చేస్తాయి.
- నిల్వ చేసే గోనె సంచులను మరియు గాదెలను కొట్టివేస్తాయి.

**యాజమాన్యం**

- ధాన్యాన్ని నూర్చడానికి ఉపయోగించే పనిముట్లను శుభ్రంగా ఉంచుకోవాలి.
- కోసిన తర్వాత ధాన్యంలో తేమ శాతం 20-24 శాతం వరకు ఉంటుంది. కావున ధాన్యంలో తేమ శాతం 12 వచ్చే వరకు ఎండలో ఆరబెట్టాలి. తీక్షణమైన ఎండలో ఆరబెట్టకూడదు.
- ధాన్యాన్ని శుభ్రపరిచి నిల్వ చేసుకోవాలి
- ధాన్యాన్ని నిల్వ చేసే గదులు, గోదాములు శుభ్రం చేసుకొని పగుళ్ళు, ఎలుక కన్నాలు ఉంటే సిమెంటుతో పూడ్చుకొని పెట్టుకోవాలి
- క్రొత్త ధాన్యాన్ని పాత ధాన్యంతో కలుపరాదు
- గోదాము గోడలకు సున్నం వేయించుకొని మలాథియాన్ 10 మి.లీ. లీటరు నీటికి కలిపి ప్రతి 100 చదరపు మీటర్లకు 3 లీటర్ల మందు ద్రావణాన్ని పిచికారి చేయాలి.
- వీలైనంత వరకు కొత్త సంచులను వాడాలి. ఒకవేళ పాత సంచులను, వాడినట్లయితే పాత సంచులను డెల్టామిత్రిన్ 1.5 మి.లీ. లేదా మలాథియాన్ 10 మి.లీ. లీటరు నీటికి కలిపిన మందు ద్రావణంలో 10 నిమిషాలు ముంచి నీడలో ఆరబెట్టాలి
- గోదాములను ఎత్తయిన ప్రదేశాల్లో నిర్మించుకోవాలి.
- ఎలుకలు ప్రవేశించని విధంగా గోదాము నిర్మించుకోవచ్చు. పునాదిని 2-3 అడుగులు నేల పైకి నిర్మించి చుట్టూ సజ్జాను ఏర్పాటు చేసినచో ఎలుకలు ప్రవేశించలేవు.
- తగినంత గాలి వెలుతురు వచ్చే విధంగా కిటికీలను, వెంటిలేటర్లను అమర్చి జాలీ బిగించుకోవాలి.
- నిల్వ ఉంచిన బస్తాలను గోదాము గోడలకు తగలకుండా కనీసము అర మీటరు ఎడమ ఉండేటట్లు చూసుకోవాలి. ఇలా చేయడం వలన సంచులకు గాలి తగలడమే కాకుండా గోడల నుంచి తేమ, శిలీంద్రాలు లాంటివి రాకుండా నివారించవచ్చును. అంతేకాకుండా మనుష్యులు తిరగడానికి అనువుగా ఉండి పురుగుల తాకిడిపై నిఘా ఉంచవచ్చును.
- బస్తాలను నేరుగా నేలకు ఆనించకుండా బస్తా సైజు చెక్కపీటలను తయారుచేసుకొని వరుసగా గోదాములో పేర్చి వాటిపై ధాన్యపు బస్తాలను పేర్చుకోవాలి.
- గోదాములలో బస్తాలను టార్పలిన్ లతో కప్పి ప్రతి టన్ను గింజలకు 3 గ్రా. అల్యూమినియం ఫాస్ఫైడ్ బిళ్ళలు మూడింటిని పెట్టి 5 రోజులు ఊదరపెట్టడం వలన, గింజ లోపల ఉన్న అన్ని దశలలోని పురుగులను నివారించుకోవచ్చు
- ఎలుక కన్నాలలో కూడా ఈ బిళ్ళలను వేసి మూసినట్లైతే ఎలుకలను నివారించవచ్చు.

**గమనిక**

- గృహ అవసరాల కోసం తక్కువ మొత్తంలో గింజలను నిల్వ ఉంచుకునేటప్పుడు వేపాకు, యూకలిప్టస్ ఆకులు, వస కొమ్ములు మొదలైన వాటిని కలపడం వలన నిల్వలో ఆశించే పురుగులను నివారించుకోవచ్చు
- పరాద్ ఆయుర్వేదపు బిళ్ళలను క్వింటాలుకు 4 చొప్పున ఉంచి పిండి పురుగు, పెంకు పురుగు, తుట్టె పురుగు, నుసి పురుగు మరియు ముక్కు పురుగును నివారించుకోవచ్చు.

**ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం.9494407924**



# విత్తన నిల్వ ధాన్యాన్ని ఆశించే చీడపీడలు - సమగ్ర నివారణ చర్యలు



డా॥ ఓ. శైల, డా॥ టి. ప్రభాకర్ రెడ్డి, వి. పుష్పలత, డా॥ ఆది శంకర్, కె. రామకృష్ణ, డా॥ బి. రాజశేఖర్, ఆర్. రఘువరణ్ సింగ్, యమ్. రాజేష్, వై. సుల్తాన్ మరియు బి. హరీష్
కృషి విజ్ఞాన కేంద్రం, పాలెం, నాగర్‌కర్నూల్

వివిధ పంటల్లో కోతల తర్వాత విత్తన నిల్వ అనేది చాలా ప్రాముఖ్యమైనదిగా చెప్పవచ్చు. సుమారుగా నిల్వలో 10-30% నష్టం కలుగుతుందని అంచనా. దీన్ని దృష్టిలో పెట్టుకొని నిల్వలో చేపట్టాల్సిన యాజమాన్యం ఈ క్రింద వివరించడం జరిగింది. జన్యురీత్యా అధిక నాణ్యత గల ఆరోగ్యకర విత్తనం ఎక్కువ కాలం పాటు నిల్వ సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది. కాని విత్తన నిల్వలో తగు జాగ్రత్తలు పాటించకపోవడం వలన ఆ విత్తన నాణ్యతను

వివిధ పంటల్లో పంటకోత సమయంలో విత్తన తేమ శాతం అధికంగా ఉంటుంది. కాబట్టి ధాన్యాన్ని విత్తన నిల్వకు ఉండవలసిన నిర్దిష్ట తేమశాతం వచ్చే వరకు ఆరబెట్టాలి. విత్తన నిల్వను ప్రభావితం చేసే అంశాలలో మరొకటి విత్తనాన్ని నిల్వ చేసే సంచులు పంట రకాన్ని బట్టి కూడా విత్తన సంచులు మారుతాయి. విత్తన సంచులలో తేమను అనుమతించేవి. తేమను అనుమతించని పాలిథీన్ లైన్డ్ హెచ్‌డిపిఇ సంచులలో నిల్వ చేస్తారు.

| క్ర.సం. | పంట రకం | కోత సమయంలో విత్తనంలో తేమశాతం | విత్తన నిల్వ తేమశాతం |
|---|---|---|---|
| 1. | వేరుశనగ | 18-20% | 9% |
| 2. | శనగ | 14-18% | 9% |
| 3. | మినుము | 14-18% | 9% |
| 4. | పెసర | 14-18% | 9% |
| 5. | కంది | 14-18% | 9% |
| 6. | సోయాచిక్కుడు | 13-15% | 12% |
| 7. | ఆముదం | 18-20% | 8% |
| 8. | వరి | 18-20% | 13% |
| 9. | జొన్న | 20-25% | 12% |
| 10. | మొక్కజొన్న | 25-30% | 12% |

కోల్పోయే అవకాశం ఉంటుంది. విత్తన నిల్వను ప్రభావితం చేసే అంశాలలో విత్తన తేమ శాతం ముఖ్యమైనవి. నిర్దిష్ట తేమ శాతం వరకు విత్తనాన్ని ఆరబెట్టడం వలన నిల్వ సమయంలో చీడపీడల బారిన పడకుండా విత్తన నాణ్యత క్షీణించకుండా ఉండును. యాసంగిలో పండించిన పంటలలో నిల్వ సమస్యలు అధికంగా ఉంటాయి. విత్తనాన్ని పండించే ప్రదేశం యొక్క వాతావరణం కూడా విత్తన నిల్వను ప్రభావితం చేస్తాయి.

ప్రాసెసింగ్‌కు ముందు విత్తనం నిల్వ చేయడానికి కొత్త సంచులనే వాడాలి. ఒకవేళ పాత బల్క్ స్టోరేజి కోసం పాత సంచులను వాడవలసి వస్తే వాటిలో ముందు నిల్వ చేసిన విత్తనం ఏమి లేకుండా చూసుకోవాలి. సంచులను ఎండలో బాగా ఆరబెట్టడం లేదా మాలాథియాన్ ద్రావణం లీటరు నీటికి 10 మి.లీ. కలిపి సంచులను వాటిలో నానబెట్టి బాగా ఆరిన తర్వాత విత్తనాన్ని నిల్వ చేసుకోవాలి. ఇలా చేయడం వలన సంచులలో ఉన్న చీడపీడలు నశిస్తాయి.



విత్తనం నిల్వ చేసే గోదాములకు ఎక్కువ కిటికీలను అమర్చకూడదు. కిటికీలు ఉంటే వాటిని మూసివేసి వెంటిలేటర్స్ ద్వారానే గాలి ప్రసరణ జరిగేలా చూడాలి. వెంటిలేటర్స్ ద్వారా కూడా ఎలుకలు, చీడపీడలు ఆశించే ఆస్కారం ఉంటుంది. కావున వెంటిలేటర్స్‌కు మెష్‌లు విధిగా ఏర్పాటు చేసుకోవాలి.

విత్తనాన్ని నేల మీద నిల్వ చేయరాదు. ఐరన్ లేదా చెక్కతో చేసినటువంటి ప్యానెల్స్ పైనే నిల్వ చేయాలి. ఇలా చేయడం ద్వారా నేల నుండి విత్తనంలోకి తేమ ప్రవేశించదు. సంచులను ఒక దాని పైన ఒకటి 8-10 వరుసల ఎత్తు వరకు అమర్చాలి. మరీ ఎత్తుగా అమర్చకూడదు. సోయాచిక్కుడు విత్తనాన్ని 6-7 సంచుల ఎత్తు వరకు మాత్రమే అమర్చుకోవాలి. లేకపోతే విత్తనం యొక్క మొలక శక్తి దెబ్బతినే అవకాశం ఉంటుంది. పప్పుదినుసులలో అయితే పుచ్చు పురుగు యొక్క ప్రభావం ఎక్కువగా ఉంటుంది. వీటి నుండి విత్తనాన్ని రక్షించుకోవడానికి ఫ్యూమిగేషన్ లేదా రసాయనాల పిచికారి తప్పనిసరిగా అవసరం అవుతుంది.

ఫ్యూమిగేషన్ చేసేటప్పుడు 1 లేదా 2 అల్యూమినియం ఫాస్ఫైడ్ టాబ్లెట్స్ 1 టన్ను విత్తనానికి విత్తన సంచుల క్రింద భాగం దగ్గర ఉంచి సంచులను మందపాటి టార్పాలిన్ పట్టాలతో కప్పాలి. అల్యూమినియం ఫాస్ఫైడ్ టాబ్లెట్స్ పైన 1 లేదా 2 చుక్కల నీరు వేయడం వలన టాబ్లెట్స్ నుండి విడుదలయ్యే గ్యాస్ విత్తనంలో ఉన్నటువంటి చీడపీడలను చంపేస్తాయి. ఈ టాబ్లెట్స్ యొక్క వాయువులు ఎలుకలకు కూడా హానికరం. ఇది సాంకేతిక నిపుణుల పర్యవేక్షణలో మాత్రమే చేయాలి. ఫ్యూమిగేషన్ చేయని ఎడల మలాథియాన్ (5 మి.లీ. లీటరు నీటికి) లేదా డెల్టామెత్రిన్ (5 మి.లీ. లీటరు నీటికి) ద్రావణాన్ని లేదా వేపనూనె (5 మి.లీ. లీటరు నీటికి) విత్తనం సంచులపై పిచికారి చేయాలి. విత్తన నిల్వ కాలం పంట రకాన్ని బట్టి మారుతుంది. విత్తన నిల్వ వలన విత్తనం మొక్క నాణ్యత దెబ్బతినే ఆస్కారం చాలా ఉన్నందున నిల్వలో సరైన జాగ్రత్తలు పాటించడం ద్వారా విత్తన నాణ్యతను కాపాడి నాణ్యమైన విత్తనం రైతులకు అందించగలం.

**ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం.9951461694**

## టి.వి.ఛానళ్ళలో ప్రత్యక్ష ప్రసారాల ద్వారా వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలతో రైతుల ముఖాముఖి కార్యక్రమాలు

| క్రమ సంఖ్య | తేది | అంశము | సాంకేతిక సమాచారం అందిస్తున్న శాస్త్రవేత్త పేరు, హోదా మరియు ఫోన్ నెంబర్ |
|---|---|---|---|
| II. టి-శాట్ (రైతు మిత్ర - సోమవారం): సాయంత్రం 4.00-5.00 | | | |
| 1. | 05.05.2025 | మారుతున్న వాతావరణ పరిస్థితుల్లో నేల ద్వారా వ్యాపించే తెగుళ్ళ నివారణకు వేసవిలో చేయవలసిన పనులు | డా॥ ఎన్. బలరాం, శాస్త్రవేత్త (ప్లాంట్ పాథలజీ) ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, జగిత్యాల, 9821492644 |
| 2. | 12.05.2025 | వివిధ పంటలలో విత్తన ఎంపిక మెళకువలు మరియు విత్తన మొలక అవశ్యకత | డా॥ ఎస్. మహేశ్వరమ్మ, శాస్త్రవేత్త (ప్లాంట్ బ్రీడింగ్) ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, పాలెం, 9492278817 |
| 3. | 19.05.2025 | వ్యవసాయ రంగంలో రైతులకు అందుబాటులో గల సామాజిక మాధ్యమాలు మరియు చరవాణి అప్లికేషన్‌ల అవశ్యకత | డా॥ ఎన్. కిషోర్ కుమార్, ఎస్.యం.ఎస్. (విస్తరణ) కృషి విజ్ఞాన కేంద్రం, మల్యాల, 9959466904 |
| 4. | 26.05.2025 | వేసవిలో మట్టి నమూనా సేకరణ -మట్టి నమూనా ఫలితాల విశ్లేషణ | డా॥ టి. చైతన్య, శాస్త్రవేత్త (ఎస్. ఎస్.) ఎ.ఐ.సి.ఆర్.పి. అన్ అగ్రో ఫారెస్ట్రీ, 9032677235 |

# నేల ఆరోగ్యం మరియు పంట రక్షణలో వేప పాత్ర



ఎమ్. సాయి చరణ్, జి. నరేంధర్, డా॥ ఏ. కృష్ణ చైతన్య, డా॥ రమ్య రాథోడ్, బి. సౌందర్య, జి. రాకేష్, ఏ. దినేష్, డా॥ ఫిర్దోస్ షహన మరియు డా॥ బి. బాలాజీ నాయక్

ప్రాంతీయ చెఱకు మరియు వరి పరిశోధన స్థానం, రుద్రూర్, నిజామాబాద్

వేప భారత ఉపఖండానికి చెందిన ఒక బహుముఖ ప్రయోజనాలు కలిగిన, వేగంగా పెరిగే శాశ్వత హరిత వృక్షం. దృఢత్వం మరియు అనుకూలతకు ప్రసిద్ధి. వేప యొక్క అద్భుతమైన లక్షణాల కారణంగా వేల సంవత్సరాలుగా ఆయుర్వేదం, వ్యవసాయం మరియు రోజూవారి జీవితంలో ఉపయోగించబడుతోంది. దీని అనేక ఉపయోగాల కారణంగా ఈ వృక్షాన్ని భారతదేశంలో "గ్రామ ఔషధాలయం" అని పిలుస్తారు. ఇటీవలి సంవత్సరాలలో వేప పర్యావరణ, వ్యవసాయ మరియు ఔషధ ప్రయోజనాల కోసం ప్రపంచవ్యాప్తంగా దృష్టిని ఆకర్షిస్తోంది. రైతులు వేపను కీటక నాశినిగా, నేల యొక్క సామర్థ్యం పెంపొందించడానికి మరియు పశువులకు మేతగా ఉపయోగించడం జరుగుతుంది.

**వేప కీటకనాశినిగా:** వేప చెట్టు ప్రత్యేకించి దాని గింజలు మరియు ఆకులు, ప్రకృతి ప్రసాదించిన అద్భుతమైన కీటకనాశిని లక్షణాలను కలిగి ఉంటాయి. అజాడిరక్టిన్, నింబిన్ మరియు నింబిడిన్ వంటి జీవక్రియా సమ్మేళనాలు ఈ చెట్టులో పుష్కలంగా లభిస్తాయి. ఈ సమ్మేళనాలు విస్తృత శ్రేణి కీటకాలను నియంత్రించడంలో సహాయపడతాయి. వేప కీటకాలను నేరుగా చంపడమే కాకుండా, వాటి పెరుగుదలను అడ్డుకుంటాయి మరియు వాటిని మొక్కలను తినకుండా చేస్తాయి. వేపను కీటకనాశినిగా ఉపయోగించడం వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయి. ఇది పర్యావరణానికి హాని కలిగించదు, మానవులు మరియు జంతువులకు సురక్షితం. అంతేకాకుండా, వేపను ఉపయోగించడం వల్ల కీటకాలు కీటకనాశకాలకు నిరోధకతను పొందే అవకాశం తక్కువ. వేప నూనె మరియు వేప పిండి రూపంలో లభిస్తుంది. ఈ ఉత్పత్తులను మొక్కలపై నేరుగా పిచికారీ చేయవచ్చు లేదా నేలలో కలపవచ్చు. వేప పిండిని నేలలో వేసినప్పుడు అది కీటక నాశిని లాగ మరియు నేలకు ఎరువుగా కూడా ఉపయోగపడుతుంది. వేప సహజమైన, సురక్షితమైన మరియు సమర్థవంతమైన కీటకనాశిని. ఇది పర్యావరణానికి హాని కలిగించకుండా పంటలను రక్షించడంలో సహాయపడుతుంది. అందుకే వేపను సమీకృత కీటక నిర్వహణ (ఐపిఎమ్) వ్యూహాలలో విస్తృతంగా ఉపయోగిస్తారు.

**వేపతో నేల యొక్క సామర్థ్యం మెరుగుపరచుట:** నేల ఆరోగ్యం మరియు సారవంతాన్ని మెరుగుపరచే సామర్థ్యం కోసం వేప అధికంగా ఉపయోగపడ్తుంది. దీనిని పచ్చి ఎరువుగా ఉపయోగించవచ్చు, ఇక్కడ తాజా వేప ఆకులు, చిన్న కొమ్మలు లేదా పిండి (వేప గింజల నుండి నూనె తీసిన తర్వాత మిగిలిన పదార్థం) నేలలో కలుపుతారు. వేప నేల లక్షణాలను మెరుగుపరుస్తుంది మరియు మన్నికైన వ్యవసాయాన్ని ప్రోత్సహించే సేంద్రియ ఎరువుగా పని చేసి నేల సారవంతమవుతుంది. వేప ఆకులు 2-3% నత్రజని, 0.5-1% భాస్వరం మరియు 1-2% పోటాష్‌ని కలిగి ఉంటాయి. వేపలోని పోషకాలు నేలలోని సూక్ష్మజీవులను పెంచి, నేల యొక్క నిర్మాణాన్ని బలపరుస్తాయి. ఇది నేల యొక్క పిహెచ్ స్థాయిని సమతుల్యం చేసి, మొక్కలకు అవసరమైన పోషకాలను అందిస్తుంది. వేపలోని సహజ కీటకనాశిని లక్షణాలు నేలలోని హానికరమైన కీటకాలు మరియు వ్యాధులను నియంత్రిస్తాయి. వేప చెట్లను పొలాల చుట్టూ నాటితే నేల కోతను నిరోధించవచ్చు. ఈ విధంగా వేప మన్నికైన వ్యవసాయానికి దోహదపడుతుంది. వేపను ఉపయోగించడం వల్ల రసాయన ఎరువులు మరియు క్రిమిసంహారకాల వాడకం తగ్గుతుంది. దీనివల్ల పర్యావరణం కూడా పరిరక్షించబడుతుంది.

**వేపను పశుగ్రాసం (ఫాడర్) గా ఉపయోగించడం:** వేప ఆకులు తమ ఔషధ గుణాలతో పాటు, పశువులకు అద్భుతమైన ఆహారంగా కూడా పనిచేస్తాయి. ముఖ్యంగా పచ్చదనం తక్కువగా ఉండే ప్రాంతాల్లో, వేప ఆకులు పశువులకు అదనపు పోషణను

అందిస్తాయి. ఇవి ప్రోటీన్లు, ఫైబర్, విటమిన్లు మరియు ఖనిజాలతో నిండి ఉంటాయి, ఇవి పశువుల ఆరోగ్యం మరియు పెరుగుదలకు అవసరం. అంతేకాకుండా, వేప ఆకులలోని యాంటీ బ్యాక్టీరియల్ మరియు యాంటీ పరాసైటిక్ లక్షణాలు పశువులను వ్యాధుల నుండి రక్షిస్తాయి.

**వేప ఆకులను పశువులకు తినిపించడం వల్ల కలిగే ప్రయోజనాలు:**

- వేప ఆకులు పశువుల రోగ నిరోధక శక్తిని పెంచి, వ్యాధుల నుండి రక్షిస్తాయి.
- పాలను ఇచ్చే జంతువులలో పాల ఉత్పత్తి పెరుగుతుంది.
- జంతువుల బరువు త్వరగా పెరుగుతుంది.
- ఇతర వాణిజ్య మేతలపై ఆధారపడటం తగ్గుతుంది. దీని వల్ల పశువుల ఉత్పత్తి వ్యయం తగ్గుతుంది.
- వేప చెట్లు సులభంగా పెరుగుతాయి మరియు పర్యావరణానికి హాని చేయవు.

**ముఖ్యమైన విషయం:** వేప ఆకులను పశువులకు తినిపించే ముందు సరైన మోతాదు మరియు ప్రాసెసింగ్ పద్ధతుల గురించి వెటర్నరీ డాక్టర్లను సంప్రదించడం మంచిది.

**ముగింపు:** వేప చెట్టు వ్యవసాయం, పశుసంవర్ధనం మరియు పర్యావరణ పరిరక్షణలో అనేక రకాలుగా ఉపయోగపడుతుంది. ఈ చెట్టు యొక్క ఆకులు, కొమ్మలు మరియు గింజలు పశువులకు మంచి ఆహారంగా ఉపయోగపడతాయి. అంతేకాకుండా, వేప నేల సారాన్ని పెంచి, పంటల దిగుబడిని పెంచుతుంది. వేపలోని సహజ కీటకనాశిని లక్షణాలు పంటలను తెగుళ్ళ నుండి రక్షిస్తాయి. ఈ విధంగా వేప రైతులకు ఆర్థికంగా మేలు చేస్తుంది. అంతేకాకుండా, వేప పర్యావరణానికి కూడా మేలు చేస్తుంది. వేప చెట్లు నేల కోతను నిరోధిస్తాయి మరియు గాలిని శుద్ధి చేస్తాయి. అందుకే వేపను పర్యావరణ మిత్రుడు అని కూడా అంటారు.

**ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 8919798959**

## ఆకాశవాణి ప్రత్యక్ష ప్రసారాల ద్వారా వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలతో రైతుల ముఖాముఖి కార్యక్రమము

**పి.జె.టి.ఏ.యు, శాస్త్రవేత్తల ప్రత్యక్ష రేడియో ప్రసార కార్యక్రమం ప్రతి బుధవారం రాత్రి 7:15-7:45 ఆకాశవాణి, హైదరాబాద్-ఏ స్టేషన్ నుంచి ప్రసారమవుతుంది. మే, 2025 లో ప్రసారమయ్యే రేడియో కార్యక్రమాలు**

| తేది | అంశం | సాంకేతిక సమాచారం అందిస్తున్న శాస్త్రవేత్త పేరు, హోదా మరియు ఫోన్ నెంబర్ |
|---|---|---|
| 01.05.2025 | నేల ఆరోగ్యం మట్టినమూనా సేకరణ - మట్టి పరీక్ష ఫలితాల విశ్లేషణ | డా॥ యం. శంకరయ్య, ప్రధాన శాస్త్రవేత్త(ఎస్.ఎస్.) ఐ.ఎస్.హెచ్.యం., రాజేంద్రనగర్, 9121761352 |
| 08.05.2025 | మే మాసంలో ఉద్యాన పంటలలో చేపట్టవలసిన సేద్యపు పనులు | డా॥ ఎ. శంకర్, ఎస్.యం.ఎస్. (హార్టికల్చర్) కృషి విజ్ఞాన కేంద్రం, పాలెం, 9912604549 |
| 15.05.2025 | పచ్చిరొట్ట ఎరువులు - ఉపయోగాలు | డా॥ కె. శేఖర్, శాస్త్రవేత్త (అగ్రానమి) వ్యవసాయ పరిశోధన స్థానం, తాండూర్, 9032128124 |
| 22.05.2025 | పశుగ్రాసాల పంటలో కొత్త రకాలు - సాగు సూచనలు | డా॥ ఆర్.వి.టి. బాలాజీ నాయక్, ప్రధాన శాస్త్రవేత్త (అగ్రానమి) ఎ.ఐ.సి.ఆర్.పి. అన్ ఫోరేజ్ క్రాప్స్, రాజేంద్రనగర్, 9440104717 |
| 29.05.2025 | రైతు నేస్తం - ప్రత్యక్ష వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమము - డిజిటల్ విస్తరణలో నూతన అధ్యాయం | డా॥ యం. శ్రీనివాసులు, ప్రధాన శాస్త్రవేత్త & హెడ్ కో-అర్డినేటర్, ఎలక్ట్రానిక్ వింగ్, రాజేంద్రనగర్, 9550526096 |

# కిసాన్ క్రెడిట్ కార్డు రైతుల ఆర్థిక వెన్నుముక

కె. అభిలాష్ రెడ్డి, జి. పార్వతి, డా॥ కె. కళ్యాణి,
డా॥ సి. సుధాకర్ మరియు కె. శ్రీజ
వ్యవసాయ పాలిటెక్నిక్, పాలెం




దేశంలో రైతులు పంట పండించాలంటే ముందుగా వడ్డీ వ్యాపారుల గడప తొక్కాల్సిందే. దుక్కి దున్నడం దగ్గర్నుండి, విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు అంటూ పెట్టుబడి కోసం రైతు చేతిలో చాలా డబ్బు ఉండాలి. అందుకే చాలా మంది రైతులు వడ్డీ వ్యాపారుల వద్ద అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి వ్యవసాయం చేస్తుంటారు. అయితే ఇలాంటి దుస్థితి నుండి రైతన్నలను ఆదుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలు అమలు చేస్తున్నాయి. అలాంటి వాటిలో "కిసాన్ క్రెడిట్ కార్డు పథకం" ఒకటి. దీని ద్వారా రైతులు చాలా తక్కువ వడ్డీకి స్వల్పకాలిక ఋణం పొందవచ్చు. వ్యవసాయ కార్యకలాపాల్లో ఆర్థిక సాయం అందించేందుకు కిసాన్ క్రెడిట్ కార్డు పథకాన్ని కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తుంది. ఒకసారి కిసాన్ క్రెడిట్ కార్డు తీసుకుంటే ఐదు సంవత్సరాల పరిమితి ఉంటుంది. ఈ ఐదు ఏళ్ళ కాలంలో రూ. 3 లక్షల వరకు ఋణం పొందవచ్చు. ఈ ఋణం ఇచ్చే ముందు, రైతు ఆదాయం, గత ఋణ చరిత్ర, ఎంత వ్యవసాయ భూమి ఉంది వంటి అంశాలను పరిగణలోకి తీసుకొని ఎంత ఋణం ఇవ్వాలనేది నిర్ణయిస్తారు. వాస్తవానికి వడ్డీ రేటు ఏడాదికి 7% ఉంటుంది. అయితే తీసుకున్న ఋణాలు సంవత్సరంలోపు చెల్లించే రైతులకు వడ్డీ రేటు 3% తగ్గిస్తారు. అందువల్ల కిసాన్ క్రెడిట్ కార్డు వార్షిక వడ్డీ రేటు 4% మించదు.

### కిసాన్ క్రెడిట్ కార్డుతో సౌకర్యాలు:

కిసాన్ క్రెడిట్ కార్డు ఉన్న రైతులకు ఋణంతో పాటు మరికొన్ని సౌకర్యాలు కూడా లభిస్తాయి.

- కిసాన్ క్రెడిట్ కార్డు ఉన్నవారికి బీమా రక్షణ ఉంటుంది. రైతులు మరణిస్తే బీమా కంపెనీ నుండి అతని కుటుంబానికి రూ. 50 వేల వరకు ఆర్థిక సాయం అందుతుంది.
- ఒకవేళ ఆ రైతు శాశ్వత అంగవైకల్యానికి గురైతే రూ. 50 వేల సాయం లభిస్తుంది.
- ఇతర నష్టాలకు రూ. 25 వేల వరకు బీమా రక్షణ ఉంటుంది.
- కిసాన్ క్రెడిట్ కార్డుతో పాటు రైతులకు జమ పొదుపు ఖాతా డెబిట్ కార్డు అందిస్తారు. ఆ ఖాతాలో చేసే పొదుపులపై వడ్డీ లభిస్తుంది.

### ఎవరు అర్హులు: ఎవరికి ఇస్తారు?

- కిసాన్ క్రెడిట్ కార్డు కోసం దరఖాస్తు చేసుకునే రైతు వయస్సు 18 నుండి 75 సంవత్సరాల మధ్య ఉండాలి.
- వ్యవసాయ భూమి యాజమానులు ఆ భూమిని సాగు చేస్తూ ఉండాలి.
- కౌలు రైతులు, మత్స్యకారులు, రైతు సంఘాల గ్రూప్‌లోని వ్యక్తులు అందరూ అర్హులే.
- గొర్రెలు, కుందేళ్ళు, మేకలు, పందులు, పక్షులు, కోళ్ళ పెంపకం రైతులు కూడా అర్హులే.
- పశుపోషణ వంటి వ్యవసాయ అనుబంధ కార్యకలాపాల్లో ఉన్న రైతులు లేదా పాడి రైతులు ఈ పథకానికి అర్హులే.

### కిసాన్ క్రెడిట్ కార్డు పొందడానికి కావాల్సిన పత్రాలు:

- అప్లికేషన్ ఫారం
- ఆధార్ కార్డు / పాన్ కార్డు / ఓటర్ కార్డు / డ్రైవింగ్ లైసెన్స్ / వ్యక్తిగత గుర్తింపు, డాక్యుమెంట్, పాసు పుస్తకం ఇవి దరఖాస్తుదారు ప్రస్తుత చిరునామాతో ఉండాలి.
- భూమి ఉండాలి.
- ఒక పాస్ పోర్ట్ సైజ్ ఫోటో
- బ్యాంకు కోరిన సెక్యూరిటీ పత్రాలు


### దరఖాస్తు వివరాలు:

- మీరు లోను తీసుకోవాలనుకుంటున్న బ్యాంక్ బ్రాంచ్‌కు వెళ్ళి కిసాన్ క్రెడిట్ కార్డు ఫారం నింపాలి.
- ఆ ఫారానికి అవసరమైన పత్రాలు / ధస్తావేజులు జతచేసి బ్యాంక్‌లో అందజేయాలి.
- మీ దరఖాస్తుని బ్యాంకు వాళ్ళ ప్రాసెస్ చేసి కొన్ని రోజుల్లో కిసాన్ క్రెడిట్ కార్డుని జారీ చేస్తారు.

ఇతర వివరములకు సంప్రదించవలసిన
ఫోన్ నెం. 8790108097

# వ్యవసాయ పదవినోదం

కూర్పు : డా॥ ఆర్. సునీత దేవి



**అడ్డం:**

1. ఆమ్ల నేలల్లో నత్రజని, పొటాష్, భాస్వరం లభ్యత ఏ విధంగా ఉంటుంది? తక్కువ? ఎక్కువ? (3)
4. పాలీహౌస్‌లలో వాడే మట్టి మిశ్రమంలో కీటకాలు, వేరుపురుగులు, చెదలు, నులిపురుగులు, రోగకారక శిలీంద్రాలు లేకుండా చేయుటకు ఏ మందుతో ఫ్యూమిగేట్ చేయాలి? (5)
6. మూడు బస్తాల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ ఎరువులో ఎన్ని కిలోల గంధకం లభిస్తుంది? (5)
7. వరిని ఆశించే ఓ తెగులు ఆకులపై నూలు కండె ఆకారం మచ్చలు ఏర్పరస్తుంది? (5)
8. పురుగుమందు డబ్బా పైన త్రికోణాకారంలో ఉండే రంగు ఏమి తెలుపుతుంది? (7)
9. మంజీర రకం ఏ పంటకు చెందినది? (3)
11. తెల్లదోమ నివారణకు ఏ రంగు జిగురు అట్టలు పెట్టాలి? (3)

**నిలువు:**

1. పొగాకు లద్దెపురుగు నివారణకు వాడే విషపు ఎర తయారీకి పురుగుమందు, బెల్లంతో పాటు ఇంకా ఏమి కలపాలి? (3)
2. తెలంగాణలో అత్యధిక విస్తీర్ణంలో సాగు చేసే ప్రధాన పంట? (2)
3. సమగ్ర సస్యరక్షణలో భాగంగా రసంపీల్చే పురుగులను నివారించటానికి ఏమి ఉపయోగించాలి? (6)
5. నేల అవసరం లేకుండా నీటితో మొక్కలను పెంచే వినూత్న పద్ధతిని ఏమంటారు? (5)
7. బంచిటాప్ అనే తెగులు ఏ పంటలో ఆశించి నష్టం కలుగజేస్తుంది? (3)
10. నేలల్లో పచ్చిరొట్ట ఎరువు, పశువుల ఎరువు, గొర్రెల ఎరువు వాడటం వలన ఏమి పెరుగుతుంది? (5) (క్రింది నుండి పైకి)
12. వరిలో ఏ పురుగు ఆశించినప్పుడు పొలంలో నీరు తీసివేస్తే ఉధృతి తగ్గుతుంది? (4) (క్రింది నుండి పైకి)
13. ధాన్యానికి ఏ ఆకులను కలిపి నిల్వ చేస్తే పురుగుల నుండి కాపాడుకోవచ్చు? (2) (క్రింది నుండి పైకి)

సమాధానాలు 50వ పేజీలో

# పాలిహౌస్ సాగులో నెమటోడ్ యాజమాన్య పద్ధతులు

డా॥ ఎ. శంకర్, యం. రాజేష్ కుమార్, డా॥ టి. ప్రభాకర్ రెడ్డి, డా॥ ఓ. శైల, కె. రామకృష్ణ,
డా॥ బి. రాజశేఖర్ మరియు ఇ. జ్యోత్స్న
కృషి విజ్ఞాన కేంద్రం, పాలెం, నాగర్‌కర్నూల్



భారతదేశంలో పాలిహౌస్ సాగులో నెమటోడ్ నిర్వహణ ఒక క్లిష్టమైన సమస్యగా మారింది. నెమటోడ్ కారణంగా జాతీయస్థాయిలో సంవత్సరానికి దాదాపు రూ. 21,068.73 మిలియన్ల పంట నష్టం అంచనా వేయబడింది. ఉద్యానవన పంటలలో పాలిహౌస్ సాగులో నెమటోడ్ ముట్టడి అధికంగా ఉంది. మట్టిలో మరియు పంట అవశేషాలు వల్ల వేగంగా వ్యాప్తి చెందుతుంది.

పాలిహౌస్ సాగులో నెమటోడ్ విస్తరణ రెట్లు బహిరంగ సాగు కంటే 10-30 రెట్లు ఎక్కువగా ఉంటుంది. క్లోరోసిస్ మరియు మొక్కలు కుంగుబాటు వంటి లక్షణాలు నష్టం జరిగిన తర్వాత కనిపిస్తాయి. పాలిహౌస్‌లో నెమటోడ్ జనాభా ఆర్థిక నష్టపరిమితి స్థాయి కంటే 5-6 రెట్లకి చేరుకుంటుంది. 6 నుండి 12 నెలలు వ్యవధిలో 10 రూట్‌నాట్ నెమటోడ్ యొక్క జనాభా సంఖ్య 1 నుండి 30 జువనైల్స్ వరకు పెరుగుతుంది.

పాలిహౌస్ సాగులో పండించే పంటలో కాప్సికం, టమాట, మిరపకాయలు, మస్క్‌మిలన్, పుచ్చకాయ, కార్నేషన్స్, గులాబీలు, జెర్బరా మరియు అంథురియం వంటి పంటలను తీవ్రంగా మెలోయిడోగైన్ ఇన్కాగ్నిటా, మెలోయిడోగైన్ జవానికా (రూట్-నాట్) మరియు లోటెలెంచులస్ మరియు పంగల్ వ్యాధుల తీవ్రతను పెంచుతాయి.

పైటోఫ్థోరా పారాసైటికా + మెలోయిడోగైన్ ఇన్కాగ్నిటా కలిసి జెర్బెరాలలో ఒక్క వ్యాధి సంక్లిష్టతను అధికం చేస్తుంది. ఇది దిగుబడిని 40-60% వరకు తగ్గిస్తుంది. ఐఐహెచ్ఆర్ బెంగుళూర్‌లోని నెమటాలజిస్టులు సూచించిన జీవ పురుగు మందులైన ప్రెసిలోమైసెన్ లిలాసినస్, పోచోనియా క్లామిడో స్పోరా, ట్రైకోడెర్మా హర్జియానమ్, ట్రైకోడెర్మా విరిడి మరియు సుడోమోనాస్ ఫ్లోరోసెన్స్ వంటి మందులు వాడిన రైతులు రసాయనాల వాడకాన్ని 40-45% తగ్గించారు మరియు జెర్బెరా, కార్నేషన్లలో 30 నుండి 35% పెరిగిన దిగుబడిని పొందారు.

- పాలిహౌస్‌లో ఎత్తు మడులు తయారీకి ముందు మట్టిలో బయో-పెస్టిసైడ్లతో పాటు సుసంపన్నమైన 20 టన్నుల పశువుల ఎరువులను చేర్చాలి.
- సిఫారసు చేసిన ఎరువుల మోతాదులతోపాటు కార్బోఫ్యూరాన్ లేదా ఫోరేట్ 50 గ్రా. చదరపు మీటర్లు + 200 గ్రా. వేప / కానుగ / మహువా కేక్లు కూడా వాడవచ్చు.
- బయో-పెస్టిసైడ్‌తో సమృద్ధి చేసిన ఎన్రిచ్డ్ పశువుల ఎరువు 2 కిలోలు లేదా బయో పురుగుమందులు వర్మికంపోస్టు 500 గ్రా. చదరపు మీటర్లను 18 సెం.మీ. మందం మట్టితో కలియబెట్టాలి.
- ఈ మడుల్లో సేంద్రియ పదార్థాలు కుళ్ళడం కోసం 7 నుండి 10 రోజుల వరకు నీటితో తడపాలి.

**జీవనియంత్రకాలతో సమృద్ధి చేయు ప్రక్రియ:**

- 1 టన్ను పశువుల ఎరువుతోపాటు సుడోమోనాస్ ఫ్లోరోసెన్స్ + ట్రైకోడెర్మా హర్జియానం+పెసిలోమైసెన్ లిలాసినస్+ ట్రైకోడెర్మా హర్జియానం+పెసిలోమైసెన్ లిలాసినస్‌ని

ఒక్కొక్కటి 2 కిలోలతో కలపడం ద్వారా ఎరువును సమృద్ధి చేయాలి. ఇది మల్చ్‌తో కప్పబడి ఉండాలి మరియు 15 రోజులపాటు 25-30% తేమను ఉండేలాగా చూసుకోవాలి.

**జీవనియంత్రకాలతో కానుగ మహువా కేక్‌ను సమృద్ధి చేసే ప్రక్రియ:**

- 1 టన్ను వేప / కానుగ / మహువా కేక్‌లో 2 కిలోల సూడోమోనాస్ ఫ్లోరోసెన్స్ + ట్రైకోడెర్మా హర్జియానం + ఫెనిలోమైసెన్ లిలాసినస్‌లను కలిపి సమృద్ధిగా చేయాలి. ఇది మల్చ్‌తో కప్పబడి 15 రోజులపాటు 25-30% తేమ ఉండేలాగా చూసుకోవాలి.
- వారానికి ఒకసారి వేపపిండిని కలపడం వలన సూక్ష్మజీవుల సంఖ్య వృద్ధి చెందుతుంది.

**జీవనియంత్రకాలతో (వానపాముల ఎరువు) సమృద్ధి చేసే ప్రక్రియ:**

- 1 టన్ను వర్మికంపోస్ట్‌లో 2 కిలోల సూడోమోనాస్ ఫ్లోరోసెన్స్ + ట్రైకోడెర్మా హర్జియానం + పెసిలోమైసెన్ లాలినినస్‌ను కలిపి శుద్ధి చేయాలి. ఇది మల్చ్‌తో కప్పబడి 15 రోజులపాటు 25-30% తేమను ఉండేలాగా చూసుకోవాలి. వారానికి ఒకసారి ఎరువుని కలపడం వలన సూక్ష్మజీవుల సంఖ్య వృద్ధి చెందుతుంది.

**పిచికారి చేసే పద్ధతి:**

- సూడోమోనాస్ ఫ్లోరోసెన్స్ మరియు ట్రైకోడెర్మా హర్జియానమ్ కలిగిన సేంద్రియ ఫార్ములాను 5 గ్రా. లీటరు లేదా 5 మి.లీ. లీటరు మోతాదులో 20 రోజుల వ్యవధిలో మొక్కలపై పిచికారి చేయాలి.

**డ్రెంచింగ్ ద్వారా అందించడం:**

- ఐఐహెచ్ఆర్ పేటెంట్ పొందిన సేంద్రియ సూత్రాకరణను 20 రోజుల వ్యవధిలో 5 గ్రా. లీటరు లేదా 5 మి.లీ. డ్రిప్ / డ్రెంచింగ్ ద్వారా ఇవ్వాలి.

**పంటకు జీవ పురుగుమందుల వాడకం:**

1. నేలకు అందించడం: మొక్కల చుట్టూ 100 గ్రా. వేప / కానుగ / మహువా కేక్ లేదా 250 గ్రా. వర్మికంపోస్ట్‌లో సూడోమోనాస్ ఫ్లోరోసెన్స్ + ట్రైకోడెర్మా హర్జియానమ్ + పెసిలోమైసెన్ లిలాసినస్ వృద్ధి చెందిన 1 చదరపు అడుగుల విస్తీర్ణంలో అప్లై చేయడం వలన నేలకు అందుతుంది.
2. డ్రిప్ / డ్రెంచింగ్ ద్వారా అందించడం: ఐఐహెచ్ఆర్ పేటెంట్ పొందిన ఆర్గానిక్ ఫార్ములేషన్ 5 గ్రా. లేదా 5 మి.లీ. లీటరు 20 రోజుల క్రమంలో డ్రిప్ / డ్రెంచింగ్ ద్వారా అందించాలి.

   లేదా పై విధంగా సమృద్ధి చేసిన వేప లేదా వర్మికంపోస్ట్ 20 కిలోలను 200 మి.లీ. నీటికి 2-3 రోజులు నానబెట్టి, వడకట్టి 20 రోజులకు ఒకసారి ఎకరా పొలానికి డ్రిప్ ద్వారా అందించాలి.

ఈ పద్ధతులన్నింటిని అనుసరించడం ద్వారా రైతులు పంటల దిగుబడిలో గణనీయమైన పెరుగుదలను పొందవచ్చు మరియు ఆదాయ ఖర్చుల నిష్పత్తి 5:1 కంటే ఎక్కువగా ఉంటుంది.

**ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 9912604549**

**టి.వి.ఛానళ్ళలో ప్రత్యక్ష ప్రసారాల ద్వారా వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలతో రైతుల ముఖాముఖి కార్యక్రమాలు**

| క్రమ సంఖ్య | తేది | అంశము | సాంకేతిక సమాచారం అందిస్తున్న శాస్త్రవేత్త పేరు, హోదా మరియు ఫోన్ నెంబర్ |
|---|---|---|---|
| | | **III. టి-శాట్ (రైతు బంధు సమితి - శనివారం) సాయంత్రం 4.00-5.00** | |
| 1. | 03.05.2025 | సమగ్ర వ్యవసాయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు | **డా॥ కె. చిరంజీవి,** శాస్త్రవేత్త (అగ్రానమి)<br>ఎ.ఐ.సి.ఆర్.పి. ఆన్ ఐ.ఎఫ్.ఎస్., రాజేంద్రనగర్, 8374334031 |
| 2 | 17.05.2025 | జీవన ఎరువుల ప్రాముఖ్యత | **డా॥ ఎస్. త్రివేణి,** ప్రొఫెసర్ & యూనివర్శిటీ హెడ్<br>వ్యవసాయ కళాశాల, రాజేంద్రనగర్, 7032924539 |
| 3 | 24.05.2025 | చిరుధ్యానాలతో విలువధారిత ఉత్పత్తులు తయారుచేసే విధానం | **డా॥ బి. అనీల కుమారి,** అసిస్టెంట్ ప్రొఫెసర్ (ఎఫ్.డి.ఎన్.టి.)<br>కాలేజ్ ఆఫ్ కమ్యూనిటీ సైన్స్, సైఫాబాద్, హైదరాబాద్, 9948123355 |
| 4 | 31.05.2025 | వానాకాలం మొక్కజొన్న సాగులో యాజమాన్య పద్ధతులు | **డా॥ సమత పరమేశ్వరి,** శాస్త్రవేత్త (అగ్రానమి)<br>మొక్కజొన్న పరిశోధన స్థానం, రాజేంద్రనగర్, హైదరాబాద్, 9440396819 |







# ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ద్వారా 2024 లో విడుదలైన వంగడాలు

జాతీయ స్థాయిలో 93వ కేంద్ర ఉప కమిటీ సమావేశం మార్చి 13, 2025 తేదీన ఢిల్లీలో జరిగింది. ఈ సమావేశంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం రూపొందించిన వివిధ పంటలలో పదిహేను రకాలు (15) మరియు ఒక హైబ్రిడ్ (1) జాతీయ స్థాయి వంగడాల విడుదల మరియు నొటిఫికేషన్ కమిటీ సమావేశంలో చర్చించి బాగున్నట్టు గుర్తించి నొటిఫికేషన్‌కు సిఫారసు చేయబడ్డాయి.

వరిలో వరంగల్ వరి 1246, జగిత్యాల వరి 33124, జగిత్యాల వరి 28639, కంపాసాగర్ వరి 6251, రుద్రూర్ వరి 1200, రుద్రూర్ వరి 1162; మొక్కజొన్నలో హైబ్రిడ్ రాజేంద్రనగర్ మక్కా 182; కందిలో తెలంగాణ కంది-4 (టిడిఆర్‌జి-272); శనగలో ఆదిలాబాద్ శనగ - 2(ఎడిబిఇజి-2); వేరుశనగలో జగిత్యాల పల్లి-1 (జెజిఎల్- 2141); సోయాబీన్‌లో ఆదిలాబాద్ ఇండోర్ సోయాబీన్-1 (ఎఐఎస్‌బి 50); నువ్వులో జగిత్యాల నువ్వులు 3287, జగిత్యాల తిల్-1, (జెసిఎస్ 1020), తెలంగాణ తిల్- 1, (జెసిఎస్ 3202), జగిత్యాలతిల్- 2, (జెసిఎస్ 2454), మరియు చెఱకులో రుద్రూర్ చెఱకు 81 లను జాతీయ స్థాయి వంగడాల విడుదల మరియు నొటిఫికేషన్ కమిటీ సమావేశంలో అధికారికంగా ప్రకటన చేయటం జరిగింది.

**పంట : వరి**

రకం పేరు : వరంగల్ వరి 1246
పంట కాలం : 125 రోజులు
దిగుబడి : 28-32 క్వి/ఎ,
లక్షణాలు : అధిక దిగుబడినిచ్చే స్వల్పకాలిక, సన్న గింజ రకం. మెడవిరుపు, కంకినల్లిను తట్టుకుంటుంది

**పంట : వరి**

రకం పేరు : జగిత్యాల వరి 33124
పంట కాలం : 135-140 రోజులు
దిగుబడి : 30 క్వి/ఎ
లక్షణాలు : అధిక దిగుబడినిచ్చే, మధ్యకాలిక, మధ్యస్థ సన్న గింజ రకం. సుడిదోమ, అగ్గితెగులు, కంకినల్లి, పొట్టకుళ్లును తట్టుకుంటుంది

**పంట : వరి**

రకం పేరు : జగిత్యాల వరి 28639
పంట కాలం : 120-125 రోజులు








జగిత్యాల నువ్వులు జెసిఎస్ 3287



జగిత్యాల వరి 28639

దిగుబడి : 32-34 క్వి/ఎ

లక్షణాలు : అధిక దిగుబడినిచ్చే, స్వల్పకాలిక, దొడ్డుగింజ రకం. సుడిదోమ, అగ్గితెగులు, కంకినల్లి, పొట్ట కుళ్లు, బాక్టీరియా ఎండాకు తెగులును తట్టుకుంటుంది. వర్షాకాలం మరియు వేసవి కాలాలకు అనుకూలం.

**పంట : వరి**

రకం పేరు : కంపాసాగర్ వరి 6251

పంట కాలం : 115-120 రోజులు

దిగుబడి : 30-32క్వి/ఎ

లక్షణాలు : అధిక దిగుబడినిచ్చే, స్వల్పకాలిక, సన్నగింజ రకం. అగ్గితెగులు, దోమపోటును తట్టు కుంటుంది. చౌడు నేలలకు అనుకూలం.

**పంట : వరి**

రకం పేరు : రుద్రూర్ వరి 1200

పంట కాలం : 130-135 రోజులు

దిగుబడి : 30-32క్వి/ఎ

లక్షణాలు : అధిక దిగుబడినిచ్చే, మధ్యకాలిక, మిక్కిలి సన్న గింజ రకం. సుడిదోమ, ఉల్లికోడు, ఆకు మరియు మెడవిరుపు తెగులను తట్టుకుంటుంది. కాండం దృఢంగా ఉండి చేను పడిపోకుండా ఉంటుంది.

**పంట : వరి**

రకం పేరు : రుద్రూర్ వరి 1162

పంట కాలం : 120-125 రోజులు

దిగుబడ : 30-32క్వి/ఎ

లక్షణాలు : అధిక దిగుబడినిచ్చే, స్వల్పకాలిక, మిక్కిలి సన్నగింజ రకం. రెండు కాలాలకు అనువైన రకం. కంకినల్లిని, ఉల్లికోడు, ఆకు మరియు మెడవిరుపు తెగులను తట్టుకుంటుంది.

**పంట : మొక్కజొన్న హైబ్రిడ్**

రకం పేరు : రాజేంద్రనగర్ మక్కా 182

పంట కాలం :

దిగుబడి : 40 క్వి/ఎ

లక్షణాలు : అధిక దిగుబడినిచ్చే, పూత అనంతరం వచ్చే కాండం కుళ్ళు తెగులను తట్టుకునే మధ్యకాలిక హైబ్రిడ్.


**పంట : కంది**

రకం పేరు : తెలంగాణ కంది- 4 (టిడిఆర్జి 272)

పంట కాలం : 102-107 రోజులు

దిగుబడి : 7 క్వి/ఎ

లక్షణాలు : అధిక దిగుబడినిచ్చే, ఎండు తెగులను తట్టుకునే రకం



కంది- 4
272)



ఆదిలాబాద్ శనగ- 2
(ఎడిబిఇజి - 2)

**పంట : శనగ**

రకం పేరు : ఆదిలాబాద్ శనగ- 2 (ఎడిబిఇజి - 2)

పంట కాలం : 102-107 రోజులు

దిగుబడి : 8-11 క్వి/ఎ

లక్షణాలు : అధిక దిగుబడినిచ్చే, మధ్యకాలిక, ఎండు తెగులను తట్టుకునే రకం.

**పంట : వేరుశనగ**

రకం పేరు : జగిత్యాల పల్లి- 1 (జెజిఎల్ - 2141)

పంట కాల : 105 రోజులు

దిగుబడి : 12 క్వి/ఎ

లక్షణాలు : అధిక దిగుబడినిచ్చే, ఆలస్యంగా వచ్చే ఆకుమచ్చ తెగులు మరియు తుప్పు తెగులను తట్టు కుంటుంది.

**పంట : సోయాబీన్**

రకం పేరు : ఆదిలాబాద్ ఇండోర్ సోయాబీన్-1(ఎఐఎస్‌బి - 50)

పంట కాలం : 99-104 రోజులు

దిగుబడి : 10-12 క్వి/ఎ

లక్షణాలు : అధిక దిగుబడినిచ్చే, మధ్యకాలిక, కాయకుళ్ళును తట్టుకునే రకం

**పంట : నువ్వులు**

రకం పేరు : జగిత్యాల నువ్వులు (జెసిఎస్ 3287)

పంట కాలం : 90-95 రోజులు

దిగుబడి : 948-1227 కి/హె.

నూనెశాతం : 44-47%.

లక్షణాలు : నల్లగింజ రకం. కొంతవరకు బూడిద తెగులు, వెర్రి తెగులు, కాండం తెగులు మరియు వేరుకుళ్ళు తెగులను తట్టుకుంటుంది. ఈ రకంలో అధిక కాల్షియం మరియు జింక్ ఉన్నాయి.

**పంట : నువ్వులు**

రకం పేరు : తెలంగాణ తిల్-1 (జెసిఎస్ 3202)

పంట కాలం : 91-95 రోజులు

దిగుబడి : 851 కి/హె.

నూనెశాతం : 44-49%.

లక్షణాలు : తెల్లగింజ రకం.

లక్షణాలు : కొంతవరకు ఆకుమచ్చ తెగులు, వెర్రి తెగులు మరియు వేరుకుళ్ళు తెగులను తట్టుకుంటుంది.

**పంట : నువ్వులు**

రకం పేరు : జగిత్యాల తిల్-1 (జెసిఎస్ 1020)

దిగుబడి : 1050-1100 కి/హె.

పంట కాలం : 85-95 రోజులు

నూనెశాతం : 46-49%

లక్షణాలు : తెల్ల గింజ రకం. కొంతవరకు బూడిద తెగులు మరియు ఆకుమచ్చ తెగులును తట్టుకుంటుంది.

**పంట : నువ్వులు**

రకం పేరు : జగిత్యాల తిల్-2 (జెసిఎస్ 2454)

దిగుబడి : 947-1030 కి/హె.

పంట కాలం : 90-95 రోజులు

నూనెశాతం : 46-48.7%.

లక్షణాలు : తెల్లగింజ రకం. కొంతవరకు బూడిద తెగులు మరియు ఆకుమచ్చ తెగులను తట్టుకుంటుంది. కొంతవరకు నీటి ఎద్దడి పరిస్థితులను తట్టుకోగలదు.

**పంట : చెఱకు**

రకం పేరు : రుద్రూర్ చెఱకు 81

పంట కాలం :

దిగుబడి : 50 టన్నులు/ఎకరాకు

లక్షణాలు : అధిక దిగుబడి, అధిక చెక్కర శాతం (19.2%) కలిగిన మధ్యకాలిక రకం.

# మిద్దె తోటల సాగుతో ఆహారం - ఆరోగ్యం

ఎండి సాదిక్ పాషా, డా॥ జె. చీనా, డా॥ ఎ. నిర్మల, డా॥ యస్. మల్లేష్ మరియు కె. నాగరాజు
శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం, రాజేంద్రనగర్, హైదరాబాద్





ఆరోగ్యకరమైన పోషకాలతో కూడిన ఆహారం కావాలంటే రసాయనాల వాడకం ఉండకూడదనేది నిపుణుల మాట. ఇప్పుడు ఎటు చూసినా చీడపీడల నివారణ కోసం, అధిక దిగుబడుల కోసం వ్యవసాయంలో రసాయనాల వాడకం ఎక్కువైంది. ఇవి దీర్ఘకాలంలో అనేక తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు కారణవుతున్నాయి. ఈ తరుణంలో చాలా మంది ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించే కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు కొనేందుకు ఆసక్తి చూపుతున్నారు. మరికొందకు మాత్రం సేంద్రియ వ్యవసాయ విధానంపై అవగాహన పెంచుకొని మిద్దె తోటల సాగువైపు అడుగులు వేస్తున్నారు. ఎలాంటి రసాయనాలను వాడకుండా తమకు నచ్చిన కూరగాయలు, పండ్లు, ఆకుకూరలను తామే స్వయంగా పండించుకుంటున్నారు. కాంక్రీట్ జంగిల్లా మారిన ప్రస్తుత నగరాలు, పట్టణాల్లో ఈ మధ్యకాలంలో మిద్దె తోట సాగు చేస్తున్న వారి సంఖ్య పెరుగుతోంది. ఇంటి ముందు, మేడపైన, బాల్కనీల్లో తమకు అందుబాటులో ఉన్న స్థలాల్లోనే మిద్దె తోట సాగు చేపడుతున్నారు. దీని వల్ల ఆహారం లభించడంతో పాటు ఆరోగ్యానికి మేలు జరుగుతోంది. తోటలో రోజూ కాసేపు చేసే పని వల్ల వ్యాయామం చేసినట్లు అవుతోంది. అలాగే పర్యావరణానికి ఎంతో మేలు జరుగుతోంది.

**సాగులో రసాయనాల వినియోగం ఆరోగ్యానికి హానికరం:** వ్యవసాయంలో రోజురోజుకు రసాయనాల వినియోగం పెరుగుతోంది. చీడపీడల నివారణ కోసం కొందరు రైతులు పరిమితికి మించి రసాయనాలను వినియోగిస్తున్నారు. ఇవి కూరగాయలు, ఆకుకూరలు, పండ్ల ఉపరితలాలపై అలాగే ఉండిపోతున్నాయి. వీటిని సరిగా శుభ్రం చేయకుండా తినడం వల్ల అవి శరీరంలోకి చేరి క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులకు కారణమవుతున్నాయి. అలాగే కూరగాయలు తాజాగా కనిపించడం కోసం, కొన్ని రకాల పండ్లు త్వరగా పక్వానికి రావడం కోసం, కొన్ని ఎక్కువకాలం నిల్వ ఉండటం కోసం వినియోగించే రసాయనాలు ఆరోగ్యానికి హానికరంగా మారుతున్నాయి. ఈ తరుణంలో ప్రకృతి సేద్యం విధానంలో మిద్దెతోట సాగువైపు పట్టణవాసులు అడుగులు వేస్తున్నారు.

**మిద్దె తోట ప్రాధాన్యత:** సహజ పద్దతుల్లో మన పెరట్లో లేదా బాల్కనీలో లేదా మిద్దెపై పెంచుకునే పంట ఎంతో ఆరోగ్యాన్ని ఇస్తుంది అనటంలో ఎలాంటి సందేహం లేదు. ముఖ్యంగా తాజా ఆకుకూరలు, కూరగాయల వాడకంతో చక్కని పోషకాలు లభించి మానవ ఆరోగ్యానికి మేలు చేస్తుంది. మనం పెంచే మొక్కల నుంచే కూరగాయలు, ఆకుకూరలను సేకరించి వంట చేసుకుంటే ఆ ఆనందం గొప్పగా ఉంటుంది. ఈ ఆలోచనే పట్టణ వాసులను మిద్దె సాగువైపు ఆకర్షితులను చేస్తోంది.

**మిద్దె తోట వ్యవసాయంతో ప్రయోజనాలు**

- కూరగాయలు, ఆకుకూరలను తాజాగా కోసి వండుకోవచ్చు.
- రైతు బజార్లో ఎక్కువ కూరగాయలను కొనాల్సిన అవసరం ఉండదు.
- అవకాశం ఉండి ఎక్కువ స్థలంలో ఎక్కువ రకాలను సాగు చేస్తే ఏడాది పొడవునా కూరగాయలు లభిస్తాయి.
- రసాయనాలు, క్రిమిసంహారకాలు లేని ఆహారం పొందవచ్చు. అలాగే ఆహారంలో పోషకాల నష్టం జరిగే అవకాశం తక్కువ.
- మొక్కల వల్ల ఇంటి పరిసరాల్లో ఆక్సిజన్ లభ్యత పెరగడంతో పాటు ఆహ్లాదకరమైన వాతావరణం ఉంటుంది. తోట పనులతో శారీరక వ్యాయామం, మానసిక సంతృప్తి లభిస్తాయి.
- వేసవిలో ఎండ తీవ్రత ప్రభావం కాస్త తగ్గుతుంది.
- పదవీ విరమణ చేసిన వారికి, ఇంట్లోనే ఉండే మహిళలకు మిద్దెతోట సాగుతో చక్కని కాలక్షేపం లభిస్తుంది.

### మిద్దె తోట సాగు ఎక్కడ అనుకూలం?

- తమ ఇంటి పక్కన పెరటి స్థలం ఉన్నవారు, మేడలు, మిద్దెలు పైన, అపార్ట్ మెంట్ల బాల్కనీలు, కారిడార్లు, టెర్రస్లు ఇలా ఏ కొద్దిపాటి స్థలం అందుబాటులో ఉన్నా పూలు, కూరగాయలు, ఆకుకూరలు, ఔషధ మొక్కలు, పండ్ల మొక్కలను పెంచవచ్చు.
- టెర్రస్‌పై ఎండ, గాలి, వెలుతురుతో అనువైన వాతావరణం ఉంటుంది. ఇక్కడ ఎక్కువ స్థలం ఉన్నవారికి రకరకాల మొక్కలను పెంచడానికి అవకాశం ఉంటుంది.
- మిద్దె సాగు చేయాలనుకునేవారికి కావాల్సిన మొక్కల కుండీలు, పాలిథీన్ బ్యాగులు, నల్ల మట్టి, ఎర్ర మట్టి, విత్తనాలు, షేడ్ నెట్లు, పనిముట్లు, స్ప్రేయర్, వాటర్ క్యాన్లు విక్రయించేందుకు అనేక దుకాణాలు, వెబ్ సైట్లు అందుబాటులో ఉన్నాయి.
- మొక్కల పెంపకానికి అవసరమైన పోషకాలను కూడా పలువురు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచుతున్నారు. వీటిని పెంచేందుకు తగిన శిక్షణ ఇచ్చే సంస్థలు కూడా ఉన్నాయి. అలాగే ఉద్యానశాఖ కూడా వీటి పెంపకానికి అవసరమైన కిట్లతో పాటు సాంకేతిక సలహాలు కూడా అందిస్తోంది.

### ఏయే రకాల మొక్కలను పెంచొచ్చు

ప్రధానంగా ఆకుకూరలతో పాటు టమోట, వంగ, బెండ, క్యాప్సికం, కరివేపాకు, మునగ, కూరమిరపలతో పాటు బీర, దోస, కాకర, దొండ వంటి తీగ జాతి మొక్కలు పెంచుతున్నారు. అలాగే జామ, నిమ్మ, దానిమ్మ, బొప్పాయి, సపోటా, స్ట్రాబెర్రీ వంటి పండ్ల మొక్కలను కూడా మిద్దెలపై అందుబాటులో ఉన్న స్థలాన్ని బట్టి పెంచుకోవచ్చు. అలాగే పూలు, ఔషధ మొక్కలను కూడా పెంచుకోవచ్చు.

### మిద్దె వ్యవసాయం చేసేవారికి కొన్ని సూచనలు

- ఆర్గానిక్ ఎరువులను, విత్తనాలను మాత్రమే వినియోగించాలి. రసాయన ఎరువులను ఉపయోగించకూడదు.
- పశువులు, కోళ్ళ ఎరువులు అందుబాటులో ఉంటే వాటిని వాడుకుంటే మంచిది. వర్మీకంపోస్ట్ (వానపాముల ఎరువు) నేడు దుకాణాలు, ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంది. దీన్ని వాడుకుంటే ఎక్కువ ప్రయోజనం.
- విత్తనాలను సేకరించేటప్పుడు ఉద్యానశాఖ అధికారులను సంప్రదించాలి (లేదా) నమ్మకమైన నర్సరీల నుంచి సేకరించుకోవాలి. మళ్లీ వేయబోయే పంట కోసం చేతికొచ్చిన పంట విత్తనాలను జాగ్రత్త చేసుకోవాలి.
- మొక్కలు పెరిగే కొద్దీ కత్తిరింపులు జరపాలి. తీగజాతి రకాలైతే కర్రలు ఏర్పాటు చేసి తీగ పారించాలి.

ఇతర వివరములకు సంప్రదించవలసిన
ఫోన్ నెం. **6305114171**

### టి.వి.ఛానళ్ళలో ప్రత్యక్ష ప్రసారాల ద్వారా వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలతో రైతుల ముఖాముఖి కార్యక్రమాలు

| క్రమ సంఖ్య | తేది | అంశము | సాంకేతిక సమాచారం అందిస్తున్న శాస్త్రవేత్త పేరు, హోదా మరియు ఫోన్ నెంబర్ |
|---|---|---|---|
| I. డిడి - యాదగిరి (రైతు నేస్తం): సాయంత్రం 6.00-7.00 | | | |
| 1. | 02.05.2025 | నేల ద్వారా వ్యాపించే తెగుళ్ళు - వేసవిలో చేపట్టవలసిన యాజమాన్య పద్ధతులు | డా॥ టి. కిరణ్ బాబు, శాస్త్రవేత్త (ప్లాంట్ పాథలజీ) ఆర్.ఆర్.యు., ఏ.ఆర్.ఐ., రాజేంద్రనగర్, 9848329394 |
| 2. | 09.05.2025 | తెలంగాణలో వానాకాలానికి అనువైన వరి రకాలు మరియు వాటి యాజమాన్య పద్ధతులు | డా॥ శ్రీధర్ సిద్ది, శాస్త్రవేత్త (అగ్రానమి) &హెడ్ వ్యవసాయ పరిశోధన స్థానం, కునారం, 9849635235 |
| 3. | 14.05.2025 | వేసవిలో మొండిజాతి కలుపు నివారణకు చేపట్టవలసిన పనులు | శ్రీమతి సిహెచ్. పల్లవి, శాస్త్రవేత్త (అగ్రానమి) ఏరువాక కేంద్రం, తోర్నాల, 9963164507 |
| 4 | 19.05.2025 | భూసార పరీక్షల అవశ్యకత మరియు భూసార పరిరక్షణలో సేంద్రియ, పచ్చిరోట్ట ఎరువుల ప్రాముఖ్యత | డా॥ ఐ. తిరుపతి, ఎస్.యం.ఎస్. (క్రాప్ పొడక్షన్) కృషి విజ్ఞాన కేంద్రం, బెల్లంపల్లి, 9494030004 |
| 5 | 30.05.2025 | తెలంగాణలో పంటల సరళిలో మార్పులు కాల వైపరిత్య పరిస్థితులలో ప్రత్యమ్నాయ పంటలు | డా॥ పి. లీలా రాణి, ప్రధాన శాస్త్రవేత్త (అగ్రానమి) ఎ.సి.ఆర్.సి., ఎ.ఆర్.ఐ., రాజేంద్రనగర్, 9704157445 |





# అన్నదాతకు లాభం - వేసవి కూరగాయల సాగుతో సాధ్యం

డా॥ యూ. స్రవంతి, డా॥ శివకృష్ణ కోట, డా॥ జి. ప్రియా సుగంధి, డా॥ ఐ. తిరుపతి మరియు ఏ. నాగరాజు
కృషి విజ్ఞాన కేంద్రం, బెల్లంపల్లి, మంచిర్యాల జిల్లా

కూరగాయలు శరీరానికి కావలసిన పిండి పదార్థాలు, ఇనుము, పొటాషియం, విటమిన్లు, ఖనిజ లవణాలను అతి తక్కువ ధరలో అందించడమే కాకుండా ఆరోగ్యాన్ని సంరక్షించే ఆహారంగా ప్రాధాన్యతను పొందాయి. వర్షాకాలం, శీతాకాలం మరియు వేసవిలో కూరగాయలను సాగు చేయవచ్చు. మార్కెట్ డిమాండ్‌ను అనుసరించి కూరగాయల పెంపకం చేపడితే అధిక లాభాలను ఆర్జించవచ్చును.

వేసవి కూరగాయలుగా పండించే వాటిలో ముఖ్యమైనవి వంగ, టమాటా, మిరప మొదలైనవి. రైతులు తమకున్న పరిమిత వనరులతో మార్కెట్ అవసరాలకు అనుగుణంగా కొద్దిపాటి విస్తీర్ణంలో ఆకుకూరలను సాగు చేసుకుంటే తక్కువ ఖర్చుతో అధిక ఆదాయాన్ని పొందవచ్చు. పాలకూర, కొత్తిమీర, చుక్కకూర తప్పించి మిగతా ఆకుకూరలన్నీ వేసవిలో కూడా సాగు చేసుకోవచ్చు. వేసవిలోని అధిక ఉష్ణోగ్రత, వడగాల్పుల వల్ల మొక్క పెరుగుదల తక్కువగా ఉండి, పూత, పిందె తగ్గి తద్వారా దిగుబడులు తగ్గుతాయి. అందువల్ల రైతులు కొన్ని ప్రత్యేక యాజమాన్య పద్ధతులను చేపట్టాలి. నీటి సౌకర్యం ఉన్న రైతులు అధిక ఉష్ణోగ్రతల్లో సైతం, కూరగాయ పంటలు సాగు చేసి మంచి లాభాలను పొందవచ్చు. అయితే వేడిని తట్టుకునే రకాల ఎంపికతో పాటు, మేలైన యాజమాన్య పద్ధతులు పాటించటం వల్లే ఆశించిన ఫలితాలు వస్తాయి. వేసవి కూరగాయల సాగులో పాటించవలసిన మెళకువలను క్రింద వివరించడం జరిగినది.

**నేలలు:** బాగా నీరు ఇంకే ఇసుక మరియు గరప నేలలు మరియు మురుగు నీరు వసతి గల నల్ల నేలలు అనుకూలం. చౌడు భూములు అనుకూలం కాదు.

**నేల తయారీ:** నేలను 4-5 సార్లు దున్ని చదును చేయాలి. వర్షాకాలపు పంటకు బోదెలు, కాలువలు ఏర్పాటు చేయాలి. ఆఖరి దుక్కిలో 6 -8 టన్నుల ఎరువును కలియదున్నాలి.

- వేసవిలో దుక్కిదున్నుట వలన నేలలోని నిద్రావస్థ దశలోని పురుగులు, నులిపురుగులు మరియు మొండి జాతి కలుపు మొక్కల ఉధృతి తగ్గుతుంది.
- ఆఖరి దుక్కిలో ఎకరానికి 200 కిలోల వేప పిండి వేయాలి.
- ప్రారంభ దశలో ఆశించే చీడపీడల నివారణకు నారును నాటే ముందు 20 మి.లీ. డైమిథోయేట్ + 100 గ్రా. కార్బండాజిమ్ 10 లీటర్ల నీటికి కలిపిన ద్రావణంలో 20-30 నిమిషాలు ముంచి నాటుకోవాలి.
- టమాట, వంగ, మిరప మొ॥ పంటలకు ప్రతి 16 వరుసలకు ఒక వరుస బంతి, క్యాబేజి మరియు క్యాలిఫ్లవర్ పంటలకు ప్రతి 25 వరుసలకు రెండు వరుసల ఆవాలు 15 రోజుల వ్యవధిలో ఎర పంటలుగా నాటాలి.
- 5 శాతం వేప గింజల కషాయాన్ని 10 రోజుల వ్యవధిలో పిచికారి చేయాలి. పసుపు రంగు అట్టలకు గ్రీజు కాని ఆముదంకాని పూసి పొలంలో అక్కడక్కడ పెట్టి తెల్లదోమ ఉనికి గమనించాలి.

**విత్తనశుద్ధి:** వంగ, టమాటా, మిరప మొదలైన వాటిని విత్తేముందు కిలో విత్తనానికి 3 గ్రా. థైరమ్ లేదా మ్యాంకోజెబ్ అనే మందుతో విత్తన శుద్ధి చేయాలి. తదనంతరం 2 గంటల తరువాత విత్తేముందు 4 గ్రా. ట్రైకోడెర్మా కల్చరుతో విత్తన శుద్ధి చేసి, విత్తుకోవాలి.

**నారుమడి–యాజమాన్యం:** వేసవిలో నారు నీడ క్రింద పెంచాలి. తప్పనిసరిగా రసం పురుగుల నివారణకు ఇమిడాక్లోప్రిడ్‌తో (5 గ్రా./కిలో విత్తనానికి) విత్తనశుద్ధి చేయాలి. నారుమళ్ళ పై నైలాన్ వల ఏర్పాటు చేసుకుంటే కూడా రసంపీల్చే పురుగులు మరియు వైరస్ తెగుళ్ళ సమస్యను అధిగమించవచ్చు.

విత్తనము విత్తిన వెంటనే రోజ్ క్యాన్‌తో నీటిని చల్లి, వరిగడ్డితో నారుమళ్ళను కప్పాలి. విత్తనాలు మొలకెత్తిన వెంటనే వరిగడ్డిని తీసివేయాలి.

**ప్రో–ట్రేలలో కూరగాయల నారు పెంపకం:** ప్రస్తుత కాలంలో ఎత్తైన నారుమడుల పద్ధతి కంటే కూరగాయల నారును ప్రో–ట్రేలలో పెంచి, తద్వారా నాణ్యమైన దిగుబడులను పొందడానికి అస్కారముంది. సాధారణ పద్ధతిలో నారును పెంచడంలో గల నష్టాలను అధిగమించి, నాణ్యమైన నారును పొందడానికి ప్రో–ట్రేలలో నారును పెంచడం బహుళ ప్రాచుర్యంలోకి వచ్చింది.

**వేసవిలో పండిచే కూరగాయలు–అనువైన రకాలు:**

**బెండ:**

**సాధారణ రకాలు :** అర్కానామిక, అర్కాభయ్ ,పర్భని క్రాంతి.
**సంకర రకాలు:** వర్ష, మహికో–10, ప్రియ, సుప్రియ.

**టమాట:**

**సాధారణ రకాలు:** పూసా ఎర్లీడ్వార్ఫ్, మారుతమ్, అర్కవికాస్, పూసా–120.

**సంకర రకాలు:** రష్మి, నవీన, అవినాష్ 2, లక్ష్మి బి.యస్.యస్.–20, అన్నపూర్ణ

**సొర:**

**సాధారణ రకాలు :** పూసాసమ్మర్ ప్రొలిఫిక్ లాంగ్.

**సంకర రకాలు:** వరద్, కావేరీ, ఇండమ్ 104, స్వాతి

**బీర:**

**సాధారణ రకాలు:** పూసానస్ దర్ జైపూర్ లాంగ్.

**సంకర రకాలు:** ఎన్ ఎస్ –3, ఎన్ ఎన్ 401, 403, సురేఖ, సంజీవని, మహిమ.

**కాకర:**

**సాధారణ రకాలు:** కోయంబత్తూర్ లాంగ్ గ్రీన్, అర్క హరిత.

**సంకర రకాలు:** ఎం.బి.టి.హెచ్ 101,102, ఎన్.ఎస్. 431, 432, మహికో 10,13.

**తోటకూర:**

**సాధారణ రకాలు:** ఆర్.ఎన్.ఎ–1, అర్కఅరుణ (ఎరుపు).

**పాలకూర:** ఆల్ గ్రీన్.

**మెంతి:** పూసా ఎర్లీ బంచింగ్.

**కొత్తిమీర:** స్వాతి, సాధన.

**గోంగూర:** ఎర్ర గోంగూర.

**నీటి మరియు ఎరువుల యాజమాన్యం:** తేలిక నేలల్లో వారం రోజులకు ఒకసారి, బరువైన నేలల్లో 2–3 రోజులకు ఒకసారి నీటి తడులు ఇవ్వాలి.

నేలలోని తేమను సంరక్షించే చర్యలు చేపట్టాలి. వీలైనంత ఎక్కువ మోతాదులో సేంద్రియపు ఎరువులు, వాటితో పాటు జీవన ఎరువులను వాడితే మంచి ఫలితం ఉంటుంది. సేంద్రియపు ఎరువులు ఎక్కువగా వాడటం వలన నేల గుల్లబారి, తేమను ఎక్కువ రోజులు పట్టివుంచి మొక్కకు అందుబాటులో ఉండేటట్లు చేస్తుంది.

బిందుసేద్యం: బిందుసేద్యం పద్ధతిలో 90–95 శాతం వరకూ నీరు సద్వినియోగం అవుతుంది. విద్యుత్తు ఆదా అవుతుంది. వివిధ పోషకాలను నీటిలో కరిగించి ఫర్టిగేషన్ ద్వారా నేరుగా వేర్ల దగ్గర అందించటం వల్ల ఎరువుల వినియోగ సామర్థ్యం పెరిగి 20–43 శాతం ఆదా అవుతాయి. నేలను చదును చేయడం, కాలువలు, బోదెలు చేసి నీరు పెట్టడం వగైరా పనులు ఉండవు గనుక సాగు ఖర్చు, కలుపు సమస్య తగ్గుతుంది. పూలు, పండ్లతోటలు, వాణిజ్యపంటలు, దుంప పైర్లు, కూరగాయలు, ఔషధ, కలప పంటలను డ్రిప్‌తో పండించవచ్చు. డ్రిప్ పద్ధతిలో మాదిరిగానే స్ప్రింక్లర్ పద్ధతితో కూడా లాభాలున్నాయి. 5–20 శాతం దిగుబడి పెరుగుతుంది. ఆకుకూరలను ఈ విధంగా సేద్యం చేస్తే మంచి లాభాలు పొందవచ్చు. అంతేగాక నీరు సక్రమంగా ఇవ్వటం వలన తుంపర్ల ద్వారా కలిపి పూతదశలో ఎండవేడి తగ్గి మంచి దిగుబడులు పొందవచ్చు. సాధారణ పద్ధతిలో నీరు ఇచ్చే పంటలలో ఎండతీవ్రత తగ్గించటానికి అప్పుడప్పుడు సాయంత్రం వేళలో నీటిని పిచికారి చేయాలి.

టమాట, పుచ్చలో నీటి యాజమాన్యం సరిగా లేకపోతే కాయపగుళ్ళు కనబడతాయి. నీటి యాజమాన్యం సక్రమంగా ఉండేటట్లు చూడాలి. ఆ తర్వాత కాయపగుళ్ళ నివారణకు బోరాక్స్ 3 గ్రా. లీటరు నీటికి కలిపి వారం వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేయాలి.

**హార్మోన్ల వాడకం:** తీగజాతి కూరగాయలలో అధిక ఉష్ణోగ్రతకు మగ పూలు ఎక్కువగా వస్తాయి. దీని నివారణకు పూత దశలో సైకోసిల్ (సిసిసి) 2.5 గ్రా. లేదా 0.5 గ్రా. మాలిక్ హైడ్రజైడ్ 10 లీటర్ల నీటికి కలిపి పిచికారి చేయాలి లేదా గింజ విత్తిన 15 రోజులకు, 2–4 ఆకుల దశలోనే 3–4 గ్రా. బోరాక్స్ లీటరు నీటికి లేదా ఇథరిల్ 2.5 మి.లీ 10 లీటర్ల నీటికి కలిపి వారం వ్యవధితో రెండు సార్లు పిచికారి చేస్తే తర్వాత దశలో ఆడపూల సంఖ్య పెరిగి అధిక దిగుబడులు వస్తాయి. పూత, పిందె రాలకుండా పిందె బాగా పట్టడానికి టమాట, వంగ లాంటి పంటకు ఒక మి.లీ ప్లానోఫిక్స్ అంతేగాక (ఎన్ ఎ.ఎ) 4.5 లీటర్ల నీటిలో కలిపి పూతదశలో వారం వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేయాలి.

- మిరపలో పూతదశలో ట్రైకాంటినాల్ 2.0 మి.గ్రా. లేదా 2.5 మి.లీ ప్లానోఫిక్స్ 10 లీటర్ల నీటిలో కలిపి వారం వ్యవధిలో రెండుసార్లు పిచికారి చేస్తే పిందె నిలిచి కాత బాగా ఉంటుంది.
- కాయగూరలను, ఆకుకూరలను, చల్లటి పూటకోసి, తడిగోనె సంచి కప్పి మార్కెట్‌కి పంపాలి.

**మల్చింగ్:** నేలలోని సారాన్ని కాపాడటంలో ఈ మల్చింగ్ ప్రధాన పాత్ర వహిస్తుంది. పంటలు సాగు చేయని కాలంలో సారవంతమైన మట్టిని కప్పి ఉంచుతుంది. మొక్కల మధ్య మల్చింగ్ పదార్థాలు ఉండడం వలన కలుపును బాగా నియంత్రిస్తుంది. దీని వలన పోషకాలన్నీ పంట తీసుకొనేందుకు వీలుంటుంది. ఆధునిక వ్యవసాయ పద్ధతుల్లో ఒకటైన ప్లాస్టిక్ మల్చింగ్ విధానం ద్వారా నేలలోని తేమను కాపాడుకోవడంతో పాటు నీటిని కూడా ఆదా చేసుకోవచ్చు. ఈ విధానం రైతులకు చాలా ఉపయోగంగా ఉంటుంది. పెరుగుతున్న ఉష్ణోగ్రతల కారణంగా మొక్కలకు సరైన నీటితడులు అందక వడలి పోతున్నాయి. ఈ పరిస్థితుల్లో అందుబాటులో ఉన్న నీటిని సమర్థవంతంగా ఉపయోగించి పంటలను సాగు చేసేందుకు మల్చింగ్ విధానం ఎంతగానో తోడ్పడుతుంది. దీని వలన తేమ ఆవిరైపోకుండా మొక్క చుట్టూ ఎక్కువ కాలం ఉంటుంది. ఉష్ణోగ్రత వ్యత్యాసాల వలన నేల భౌతిక స్థితి దెబ్బతినకుండా ఉంటుంది.

**కలుపు నివారణ:** పెండిమిథాలిన్ 30 % ఎకరానికి 1.25 లీటర్ల లేదా అలాక్లోర్ 1.0 లీటర్ల (తేలిక నేలలు), 1 .2 లీటర్ల (బరువైన నేలలు) చొప్పున 200 లీటర్ల నీటిలో కలిపి నాటిన 24-28 గంటలలోపు పిచికారీ చేయాలి. నాటిన 20-25 రోజులప్పుడు అంతర కృషి చేయాలి.

## చీడ పీడలు మరియు తెగుళ్ళ యాజమాన్యం

**రసం పీల్చే పురుగులు (దీపపు పురుగులు, పేనుబంక, తెల్లదోమ):** ఆకుల అడుగు భాగానే చేరి రసాన్ని పీల్చేయడం వలన ఆకులు పసుపు రంగుకు మారిపైకి ముడుచుకొని ఎండిపోతాయి. వీటి నివారణకు డైమిథోయేట్ లీటరు నీటికి 2 మి.లీ. చొప్పున కలిపి పిచికారి చేయాలి. రసం పీల్చు పురుగుల వ్యాప్తిని అరికట్టడానికి పొలంలో చుట్టూ ఎత్తుగా పెరిగే జొన్న లేదా మొక్క జొన్న పంటలను 4–5 వరుసల్లో రక్షక పంటలుగా వేయాలి. రసం పీల్చు పురుగుల నివారణకు అవసరాన్ని బట్టి 10 రోజుల వ్యవధిలో అంతర్వాహిక క్రిమిసంహారక మందులను పిచికారీ చేయాలి.

**కాయతొలుచు పురుగు:** మొక్క పెరుగుదల దశలో మొవ్వను, పూత, కాయ దశలో కాయలను తొలచి నష్టం కలిగిస్తుంది. దీని నివారణకు లీటరు నీటికి క్వినాల్‌ఫాస్ లేదా ప్రొపినోఫాస్ 2 మి.లీ. చొప్పున 10 రోజుల వ్యవధిలో రెండుసార్లు కాయలు కోసిన తరువాత పిచికారీ చేయాలి. క్యాబేజి, కాలిఫ్లవర్‌లో డైమండ్ రెక్కల పురుగు ఉధృతిని బట్టి నోవాల్యురాన్ 1 మి.లీ. లేదా స్పైనోసాడ్ 0.3 మి.లీ. చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**తెగుళ్ళు:** కూరగాయలలో ఆకుమచ్చ, వేరుకుళ్ళు, ఎండుతెగులు, బూడిద తెగులు మొదలైనవి సాధారణంగా వాతావరణంలోని మార్పులను బట్టి పంటనాశించి నష్టం కలుగజేస్తాయి. తెగులును గుర్తించిన వెంటనే సిఫారసు మేరకు తెగులు ఉధృతి ఉన్నప్పుడు నీటిలో కరిగే గంధకం 3 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. సూక్ష్మధాతు లోపాలు కనిపించినప్పుడు విధిగా సూక్ష్మపోషక మిశ్రమాన్ని పంట కాలంలో రెండుసార్లు పిచికారి చేయాలి. బోరాన్ లోప నివారణకు బోరాక్స్ పొడి మందును 1.25 గ్రా లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం.9490844782







# మే మాసంలో ఉద్యాన పంటల్లో చేపట్టవలసిన సేద్యపు పనులు

డా॥ ఐ.వి. శ్రీనివాస రెడ్డి
వ్యవసాయ కళాశాల, అశ్వారావుపేట

**మామిడి:** పండు ఈగ నివారణకు 2 మి.లీ. మలాథియాన్ లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. కోతానంతరం కాయకుళ్ళును నివారించడానికి కాయకోతకు 15 రోజుల ముందు కార్బండాజిమ్ 1 గ్రా. లేదా కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రా. లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేసుకోవాలి. మధ్యాహ్నపు ఎండ తగిలే వైపు మామిడి కాయ రంగు మారి, పెరుగుదల సరిగా లేకుండా ఉంటాయి. నివారణకు ఎండ పడే వైపు రాళ్ళ సున్నం 20 గ్రా. లేదా బోంటోనైట్ 30 గ్రా. లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి. ఇవి తెల్లటి పొరలాగా ఏర్పడి ఎండ వేడిని తగ్గిస్తాయి. రసం పీల్చే పురుగుల వల్ల నల్లమసి మంగు కాయల మీద అధికంగా ఉంటే 4 లీ. గోరు వెచ్చటి నీటిలో 2 కిలోల గంజి పొడి బాగా కలిపి, దానిని తేలికపాటి తడి ఇవ్వాలి. దీని వల్ల ఎండిన గంజి పగిలి, మసితో సహా రాలిపోతుంది. దీని వల్ల మసి మంగు వచ్చిన కాయల నాణ్యత పెరుగుతుంది. పక్వానికి వచ్చిన (3 వంతులు తయారైన) కాయలను కోసి, రైపనింగ్ చాంబర్‌లో ఉంచి 100 పిపియం ఇథిలీన్ వాయువును ప్రవేశపెట్టి, 24 గంటలు చాంబర్ తలుపులు తెరవకుండా ఉంచాలి. తరువాత బయటకు తీస్తే 4-5 రోజుల్లో మంచి రంగును సంతరించుకొని పక్వానికి వస్తాయి.

**జామ:** ఈ మాసంలో మెగ్నీషియం లోపం వల్ల ఆకులు ఎరుపు రంగుకు మారతాయి. నివారణకు 2 గ్రా. మెగ్నీషియం సల్ఫేట్‌ను లీటరు నీటిలో కలిపి 15 రోజుల వ్యవధిలో 2 సార్లు పిచికారి చేయాలి. పిండినల్లి నివారణకు ఎసిఫేట్ 1 గ్రా. లేదా డైక్లోరోవాస్ 1 మి.లీ. లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి.

**అరటి:** తేలిక నేలల్లో ప్రతి రెండు రోజులకు, బరువు నేలలో 4 రోజులకు నీటి తడులు ఇవ్వాలి. లీటరు నీటికి 5 గ్రా. పొటాషియం నైట్రేట్ మరియు సల్ఫేట్ ఆఫ్ పొటాష్‌లను మార్చి మార్చి జిగురుతో కలిపి వారం రోజుల వ్యవధిలో 3-4 సార్లు ఆకులు, గెలలు పూర్తిగా తడిచే విధంగా పిచికారి చేసుకోవడం ద్వారా అధిక ఎండల నుండి అరటి చెట్లు, గెలలను ఎండల నుండి కాపాడుకోవచ్చు.

**బత్తాయి, నిమ్మ:** జూన్ నెలలో పూతకి రావాలంటే మే నెలలో నీటి తడులు ఆపివేయాలి. కొత్తగా బత్తాయి, నిమ్మ తోటను పెట్టదలుచుకున్న రైతులు ముందుగా ఈ మాసంలో 75×75×75 సెం.మీ. పొడవు, వెడల్పు, లోతు గల గుంతలను 6×6 మీ. దూరంలో తీసుకొని బాగా ఎండనివ్వాలి. 15 రోజుల వ్యవధిలో లీటరు నీటికి 1 గ్రా. కార్బండాజిమ్ మందును కలిపి రెండు సార్లు చెట్టు కొమ్మలపై తడిచేలా పిచికారి చేసి బంక తెగులును అరికట్టవచ్చు. ఇటీవల వచ్చిన వడగళ్ళు వానకు దెబ్బతిన్న మొదళ్ళు, కొమ్మల మీద బోర్డో పేస్టు రాస్తే శిలీంధ్రాల నుండి రక్షణ లభిస్తుంది.

**ద్రాక్ష:** వేసవి కత్తిరింపుల తర్వాత 9వ ఆకు ఏర్పడిన దశలో కొమ్మల కొనలను గిల్లడం ద్వారా పిల్ల కొమ్మల అభివృద్ధి జరుగుతుంది. కత్తిరించిన 30-60 రోజుల్లో 50 పిపియం యురాసిల్ పిచికారి చేయడం వల్ల పూమొగ్గలు ఏర్పడతాయి. కొత్త చిగుర్లలో





పక్షి కన్ను తెగులు సోకకుండా కార్బండాజిమ్ 1 గ్రా. లీటరు నీటికి కలిపి వారం వ్యవధితో 2-3 సార్లు పిచికారి చేయాలి.

**బొప్పాయి:** వైరస్ తెగుళ్ళు ఆశించిన మొక్కలపై సూక్ష్మధాతు పోషక మిశ్రమం 5 గ్రా. లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేసినచో ఆకులు విప్పారి దిగుబడులు పెరుగును. ఈ మాసంలో పెద్ద మొక్కలకు ప్రతి రోజు 20 లీ. నీటిని అందేటట్లు చూడాలి.

**సపోట:** 15 రోజులకొకసారి నీటి తడులు ఇవ్వాలి. కాయలను తొడిమతో సహా కోయాలి.

**కూరగాయలు:**

**బెండ:** పంట చివరి దశలో చిన్న, సన్నటి ఎర్ర పురుగులు ఆకుల అడుగు భాగాన చేరి ఎక్కువ సంఖ్యలను రసంపీల్చి వేయడం వల్ల ఆకులు తెల్లగా పాలిపోయి పండు బారుతాయి. దీని నివారణకు లీటరు నీటికి 5 మి.లీ. డైకోఫాల్ లేదా 1 మి.లీ. ఒమైట్ కలిపి పిచికారి చేయాలి.

**వంగ:** రసంపీల్చే పురగులు (దీపపు పురుగులు, పేనుబంక, తెల్లదోమ) ఆకుల అడుగుభాగాన చేరి రసాన్ని పీల్చివేయడం వల్ల ఆకులు పసుపు రంగుకు మారి పైకి ముడుచుకొని ఎండిపోతాయి. నివారణకు డైమిథోయేట్ లేదా మిథైల్ డెమటాన్ లేదా ఫిప్రోనిల్ 2 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి.

**టమాట:** ఈ మాసంలో పూత దశలో ఉన్నట్లైతే ఎకరాకు 400 మి.గ్రా. 2,4-డి మందును 200 లీటరు నీటికి కలిపి లేదా ప్లానోఫిక్స్ 1 మి.లీ.ను 4.5 లీ. నీటికి కలిపి పిచికారి చేస్తే పూత, పిందె నిలిచి మంచి దిగుబడి వస్తుంది.

కాయ తొలుచు పురుగు నివారణకు సైపర్‌మెత్రిన్ 1 మి.లీ. లీటరు నీటిలో కలిపి కాయలు కోసిన తరువాత పిచికారి చేయాలి.

**బీరకాయ:** బీరలో పాముపొడ తెగులు ఆశించడం వల్ల తెల్ల చారికలు కన్పిస్తుంటాయి. నివారణకు 3 మి.లీ. వేపనూనెను లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేసుకోవాలి. పందిరి కూరగాయల్లో పండు ఈగను నివారించుటకు పూత, పిందె దశల్లో మలాథియాన్ 2 మి.లీ. లీటరు నీటికి కలిపి 10 రోజుల వ్యవధితో రెండుసార్లు పిచికారి చేయాలి. 100 మి.లీ. మలాథియాన్ + 100 గ్రా. చక్కెర / బెల్లం పాకం లీటరు నీటిలో కలిపి మట్టి ప్రమిదల్లో పోసి పొలంలో అక్కడక్కడా పెట్టాలి.

**పుచ్చ:** కాయ ఎదిగే దశలో నీటిని అందించాలి. కాయలు పక్వానికి వచ్చినప్పుడు ఎక్కువ నీటిని ఇవ్వకూడదు. ఎక్కువ నీరు కడితే కాయలు పగిలి నాణ్యత తగ్గుతుంది.

**కాప్సికమ్:** పాలీహౌస్‌తో పెరిగే కాప్సికమ్ పై తామర పురుగులు ఆశించడం వల్ల ఆకుల అంచులు పైకి ముడుచుకుంటాయి. నివారణకు ఫిప్రోనిల్ 2 మి.లీ. లేదా ఫోసలోన్ 3 మి.లీ. లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి.

**కరివేపాకు:** పొలుసు పురుగులు కాండంపై చేరి రసాన్ని పీల్చివేస్తాయి. నివారణకు డైమిథోయేట్ 2 మి.లీ. లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి.

ఇతర వివరములకు సంప్రదించవలసిన
**ఫోన్ నెం. 9441168156**



# మల్లె మరియు నేల సంపంగి పంటలలో మిడ్జ్ సమగ్ర సమాచారం

డా॥ యూ. వేణుగోపాల్, డా॥ షహనాజ్, కె. మానస, ఏ.వి.ఎన్. లావణ్య మరియు కె. దిలీప్
ఉద్యాన కళాశాల రాజేంద్రనగర్
శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం, రాజేంద్రనగర్, హైదరాబాద్






### కాంటారినియా మాకులిపెన్నిస్

- పుష్ప పంటలలో ఉత్పత్తిని ప్రభావితం చేసే ప్రధానంగా పురుగులలో మొగ్గ ఈగ ముఖ్యమైనది. మొగ్గ ఈగ సెసిడోమైడియి కుటుంబానికి చెందిన ఈగ. ఇవి ప్రధానంగా మల్లె, నేల సంపంగి, గులాబీ, లిల్లీ, ఆర్కిడ్ పూలు ఇవి మాత్రమే కాకుండా ఇతర పంటలైన టమాట, వంగ, కాప్సికం పంటలను ఆశించి నష్ట పరుస్తాయి. ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రంలో రంగారెడ్డి జిల్లాలో నెలసంపంగిలో మొదటగా గుర్తించటం జరిగింది. మొగ్గ ఈగలు ఎక్కువగా వేసవిలో లేదా వర్షాకాల ప్రారంభంలో (జూన్-ఆగష్టు) లో ఎక్కువగా నష్టపరుస్తాయి. పూప్రారంభ దశల్లో ఎక్కవగా నష్టపరుస్తుంది

### అనుకూల వాతావరణ పరిస్థితులు:

- వేడి ఉష్ణోగ్రత 25-30°C మరియు అధిక ఆర్ద్రత ఉన్న వాతావరణంలో ఎక్కువగా అభివృద్ధి చెందుతాయి
- నీడ ఎక్కువగా ఉండి తేమగా ఉండే తేలిక పాటి మట్టి నేలల్లో ఈ పురుగు సమస్య ఎక్కువగా కనిపిస్తుంది
- పువ్వులు పుష్పించే దశలలో మొగ్గ ఈగల ప్రభావం అధికంగా ఉంటాయి

### మొగ్గ ఈగ మొక్క జీవన దశలు మరియు లక్షణాలు

- **గుడ్లు:** గుడ్లు సూక్ష్మంగా అండాకారంగా ఉండి గుడ్లు సాధారణంగా పుష్ప కొమ్మల మధ్యలో లేదా పూమొగ్గలపై ఉంటాయి.
- ఇవి సాధారణంగా మొగ్గలపై ఒక్కొక్కటిగా లేదా సమూహాలుగా పెడతాయి ఇవి తెలుపు లేదా పసుపు వర్ణాలలో ఉంటాయి.
- ఆడ మొగ్గ ఈగ సుమారు 30 -120 గుడ్లు పుష్ప భాగాలపై లేదా మొగ్గలలో పెడతాయి.
- అనుకూల వాతావరణ పరిస్థితులు (తేమ లేదా తక్కువ ఉష్ణోగ్రత) కలిగినప్పుడు గుడ్లు 2-4 రోజులు లార్వాగా మారుతుంది.
- **లార్వా దశ :** గ్రుడ్ల నుండి బయటకి వచ్చిన లార్వాలు పువ్వు మొగ్గలోకి ప్రవేశిస్తాయి. లార్వాలు మొదట రెండు రోజులు తెలుపు వర్ణంలో ఉంటాయి క్రమేపి నాలుగు రోజులలో పసుపు వర్ణంలోకి మారుతాయి. తల భాగం చిన్నగా కనిపిస్తుంది. పుష్పాల లోపల గుంపులుగా చూడవచ్చు. ఇవి మొక్కల పుష్పాల భాగాలను తిని ముడుచుకొని పోయేటట్లు చేస్తాయి. ఇవి వృద్ధి చెందకుండా చేస్తాయి. పుష్ప మిడ్జ్ లార్వాలు పుష్ప దళాల క్రింది భాగంలోఉన్న మొగ్గలలోకి ప్రవేశించి, పుష్పాల అభివృద్ధి చెందుతున్న భాగాలైన ఆకర్షక రక్షణ మరియు కేసరాల రసాన్ని పీల్చి అంతర్గతంగా దెబ్బతీస్తాయి మరియు మొగ్గ ఈగ ఆశించిన పూకాడ ఉబ్బెత్తు ఏర్పడి ఆ తరువాత పసుపు వర్ణంలోకి మారి రాలి పడిపోతాయి.
- **కోశస్థ దశ :** లార్వాలు మొగ్గలలో పూర్తిగా అభివృద్ధి చెందిన తర్వాత అవి బయటకి వచ్చి నేలలో లేదా పూ మొగ్గలలో కోశస్థ దశను పూర్తి చేసుకుంటాయి.

- **ఆడ ఈగ :** ఇవి సన్నగా నారింజ లేదా తేలిక పాటి బూడిద రంగులో ఉంటాయి.

**నష్ట లక్షణాలు**

1. మొగ్గలు పూర్తిగా వికసించకముందే మొగ్గల దశలోనే క్రింద పడి రాలిపోతాయి.
2. ఆశించిన మొగ్గలు ఎరుపు లేదా నీలం రంగు లోకి మారతాయి.
3. పువ్వుల పరిమాణంలో చిన్నవిగా ఉండి ఎదుగుదల లేకుండా ముడుచుచుకొనిపోతాయి.
4. పువ్వులలో పరిమాణం మరియు నాణ్యత లేకపోవడం వలన మార్కెట్ విలువ తగ్గుతుంది.

**నేల సంపంగిలో నష్ట లక్షణాలు :**

1. మొగ్గ ఈగ లార్వా మొగ్గలలోనికి చొచ్చుకొని పోయి లోపల తిని పూ మొగ్గలు పూర్తిగా వికసించకుండా చేస్తాయి.
2. పూ మొగ్గలు సాధారణంగా నిటారుగా కాకుండా ఆకృతి కోల్పోయి వంకరటింకరగా మారుతాయి.
3. పూమొగ్గలు వికసించక ముందే ఎండిపోతాయి లేదా మూసి వున్నట్లే ఉంటాయి.
4. మొగ్గ ఈగ ఆశించిన మొగ్గలపై బూడిద లేదా ముదురు మచ్చలు కనిపించవచ్చు.
5. పూల పరిమళం, రంగు ప్రభావితమవుతుంది.

**యాజమాన్య పద్ధతులు :**

- దెబ్బతిన్న పువ్వులను ఏరివేసి నాశనం చేయాలి.
- వేసవి కాలంలో లోతు దుక్కులు చేయడం వలన మట్టిలో ఉన్న గుడ్లు, కోశస్థదశదశను నాశనం చేయవచ్చు.
- కొమ్మ కత్తిరింపులు చేయడం వలన సూర్యరశ్మి బాగా సోకి మొక్క ఎదుగుదలకు ఉపయోగపడుతుంది.
- మొగ్గలు ప్రారంభ దశలలో మొక్కల చుట్టూ నైలాన్ వైర్ మెష్ నెట్ (0.4-0.6 mm) కప్పి ఉంచడం ద్వారా మొగ్గ ఈగలు లోపలికి ప్రవేశించకుండా చేయవచ్చు.
- ఈ పురుగు కోశస్థ దశలు భూమిలోఉంటాయి. కాబట్టి నలుపు రంగు గల మల్చింగ్ షీట్ (25 మైక్రాన్) మందం గల షీట్‌ను వేయటం ద్వారా కోశస్త దశలను అంతరింప చేయవచ్చు.
- పసుపు రంగు గల అట్టలను ఎకరానికి 40 చొప్పున అమర్చుకోవాలి.
- దీపపు ఎరలను లేదా సౌర ఫలకల ఎరలను ఎకరానికి ఒక్కటి చొప్పున పెట్టడం ద్వారా తల్లి ఈగలు ఆకర్షింపబడి అందులో పడి చనిపోతాయి.
- లార్వా పరాన్న జీవి ప్లాటిగాస్టార్ ఎకరాకు సుమారు 50,000 -75,000 3 విడతలుగా పుష్ప ప్రారంభ దశలో విడుదల చేయాలి.
- లింగాకర్షక బుట్టలను ఎకరాకు 5 చొప్పున పెట్టుకోవాలి.
- కొత్తిమీర లేదా బంతి పంట 1:3 నిష్పత్తిలో నాటుకోవడం వలన మిత్ర పురుగులను ఆకర్షింపచేయవచ్చు.
- మల్లె, నేల సంపంగి పంటలను వరుసల మధ్య నాటుకొని వాటి మధ్య ఖాళీ స్థలం పొడిగా ఉంచడం వలన ప్రభావం తగ్గించవచ్చు.
- వేపనూనె 1% EC @ 2-3 మి లీ/లీటరు నీటికి దానితో పాటు డిటర్జెంట్ పౌడర్ కలిపి పిచికారి చేయాలి
- జీవశిలీంద్ర నాశనకారిణి అయిన బవేరియా బసియానా మరియు మెటారీజియమ్ అనీస్లోపియం వంటి 5 గ్రా./ లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి
- థయోమిథాక్సామ్ 25, డబల్ జెఎ 0.25 గ్రా./ లీటర్ నీటికి

  లేదా
- ఇమిడాక్లోప్రిడ్ 17.8 SC @ 0.3 మి లీ./లీటరు నీటికి

  లేదా
- ఫిప్రోనిల్ 5% SC@ 2 మి. లీ./లీటరు నీటికి లేదా

  లేదా
- రైనాక్సిఫైర్ 20% SC @ 0.5 మి లీ. / లీటరు నీటికి

  లేదా
- స్పైనోసాడ్ 45% SC @ 0 3 మి లీ./ లీటరు నీటికి పూల ప్రారంభ దశలలో స్ప్రే చేయాలి .

  లేదా
- ఫ్లూబెండియామైడ్ 20% WG@ 0.3 మి లీ./లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. పైన తెలిపిన క్రిమిసంహారక మందులుఒకదానితోఒకటి మార్చిపిచికారించేయాలి 10-15 రోజుల వ్యవధిలో పిచికారి చేయాలి

సమగ్ర యాజమాన్య పద్ధతులను అమలు పరచటం వలన మొగ్గ ఈగ వలన కలిగే నష్టాన్ని గణనీయంగా తగ్గించవచ్చు

ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం.9533229343

# పసుపు కొమ్ములతో విలువ ఆధారిత పదార్థాల తయారీ

డా॥ బి. నీహారిక, డా॥ జి. ప్రసాద్ బాబు మరియు
డా॥ ఎం. శేషు మాధవ్
ఐ.సి.ఏ.ఆర్. – ఎన్.ఐ.ఆర్.సి.ఏ, కృషి విజ్ఞాన కేంద్రం,
కందుకూరు, ఆంధ్రప్రదేశ్



పసుపు అనేది పసుపు కొమ్ము నుండి వచ్చే సుగంధ ద్రవ్యం. పసుపును సాధారణంగా భారతీయ ఆహార పదార్థాల తయారీలో రుచి లేదా రంగును పెంపొందించడానికి మసాలా దినుసుగా ఉపయోగిస్తారు. పసుపు వేరు నందు 'కర్కుమిన్' అనే బయోయాక్టివ్ రసాయనం ఉండడంవలన ఆయుర్వేద వైద్యంలో ఔషధాల తయారీకి శతాబ్దాలుగా పసుపు కొమ్ములను ఉపయోగిస్తున్నారు. పసుపు అనేక ఆరోగ్య ప్రయోజనాలతో కూడి ఉంటుంది. దీనిని తీసుకోవడం వల్ల జీవక్రియ ప్రేగు కదలికలు మెరుగు అవుతాయి. జీర్ణశక్తి పెరగడం వల్ల కడుపు ఉబ్బటం, గ్యాస్ట్రిక్ సమస్యలు తగ్గుతాయి. పసుపులోని యాంటీ ఆక్సిడెంట్ మరియు యాంటీ ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలు శరీరానికి చాలా మేలు చేస్తాయి. పసుపు రోగ నిరోధక శక్తిని పెంచి ఆరోగ్యాన్ని కాపాడడమే కాకుండా చర్మ సమస్యల్ని కూడా దూరం చేస్తుంది. పసుపులోని ప్రత్యేక గుణాల వలన హార్ట్ ఫ్రెండ్లీ అని చెప్పవచ్చు. పసుపును ప్రతి రోజు తీసుకుంటే రక్తంలో కొలెస్ట్రాల్ తగ్గుతుంది. గుండె ధమనుల్లో కొవ్వు పెరగదు. శరీరంలో రక్త ప్రసరణ సాఫీగా సాగుతుంది. పసుపులో క్యాన్సర్ నిరోధక గుణాలు ఉంటాయి. ఇది కణాల నష్టాన్ని పూర్తిగా తగ్గించి కణితులు ఏర్పడకుండా చేస్తుంది. పసుపుతో తయారు చేయగల అనేక విలువలతో కూడిన ఉత్పత్తులు మార్కెట్లో భారీ వాణిజ్య ఆమోదయోగ్యత మరియు ఆరోగ్య ప్రయోజనాలు కలిగి ఉంటాయి. పసుపు ఒలియోరెసిన్, పసుపు చుక్కలు, కర్కుమిన్ పౌడర్, పసుపు పాలు మొదలైనవి కొన్ని ఉదాహరణలు. పసుపు కొమ్ములతో కింద తెలిపిన ఆరోగ్యవంతమైన విలువ ఆధారిత ఉత్పత్తులు తయారు చేసుకోవచ్చు.

## పసుపు పొడి

**కావలసిన పదార్థాలు:** తాజా పసుపు కొమ్ములు

**తయారీ విధానం:** తాజా పసుపు కొమ్ములు తీసుకొని, గ్రేడింగ్ చేసి, ముక్కలుగా కోసి, 70° సెం.గ్రే వద్ద 8-12 గంటలు ఎండబెట్టి, మెత్తని పొడి చేసి, జల్లడ పట్టుకోవాలి. ఈ పద్ధతిలో పసుపు పొడిని తక్కువ సమయములో తయారు చేసుకోవడమే కాకుండా 'కర్కుమిన్' శాతం అధికంగా ఉంటుంది.

## పచ్చి పసుపు ఊరగాయ

**కావలసిన పదార్థాలు:**

| | | |
|---|---|---|
| పసుపు కొమ్ములు | - | 1 కేజీ |
| ఆవ నూనె | - | 250 మి.లీ. |
| ఉప్పు | - | తగినంత |
| కారం | - | 5 గ్రా. |
| ఆవ పొడి | - | 30 గ్రా. |
| వెనిగర్ | - | 50 మి.లీ. |
| జీలకర్ర | - | 15 గ్రా. |
| సొంపు | - | 5 గ్రా. |

**తయారీ విధానం:** తాజా పసుపు కొమ్ములను శుభ్రముగా కడిగి, తొక్క తీయాలి. వీటిని తురిమి తడి లేనంత వరకు ఆరబెట్టుకోవాలి. కడాయిలో నూనె వేడి చేసి జీలకర్ర, సొంపు, పసుపు తురుము వేసి అయిదు నిమిషాలు ఉడికించాలి. చల్లారాక ఇందులో కారం, ఆవ పొడి, ఉప్పు వేసి బాగా కలపాలి. తరువాత వెనిగర్ వేసి బాగా కలిపి గాజు సీసాలో నింపి పొడి ప్రదేశంలో నిలువ చేసుకోవాలి. ఈ పసుపు ఊరగాయ ఎక్కువ కాలం నిల్వ ఉంటుంది మరియు ఎప్పటికీ తాజా పసుపు రుచిని ఇస్తుంది.

## పచ్చి పసుపు పచ్చడి

**కావలసిన పదార్థాలు:**

| | | |
|---|---|---|
| పసుపు కొమ్ములు | - | 1 కేజీ |
| ఆవ నూనె | - | 250 మి.లీ. |
| ఉప్పు | - | తగినంత |
| కారం | - | 5 గ్రా. |

| | | |
|---|---|---|
| బెల్లం పొడి | - | 250 గ్రా. |
| వెనిగర్ | - | 50 మి.లీ. |
| జీలకర్ర | - | 15 గ్రా. |
| సొంపు | - | 5 గ్రా. |

**తయారీ విధానం:** తాజా పసుపు కొమ్ములను శుభ్రముగా కడిగి, తొక్క తీయాలి. వీటిని చిన్న ముక్కలుగా కోసి కడాయిలో తీసుకొని మూత మూసి పది నిమిషాలు ఉడికించాలి. చల్లారాక మిక్సీలో మెత్తగా రుబ్బుకోవాలి. కడాయిలో నూనె వేడి చేసి జీలకర్ర, సొంపు, పసుపు పేస్ట్, ఉప్పు, కారం వేసి బాగా కలపాలి. తరువాత బెల్లం పొడి, వెనిగర్ వేసి చిక్కబడే వరకు ఉడికించాలి. చల్లారాక గాజు సీసాలో నింపి పొడి ప్రదేశంలో నిలువ చేసుకోవాలి. ఈ పసుపు పచ్చడి శీతాకాలంలో జలుబు మరియు ఫ్లూ నుండి కూడా రక్షణ కల్పిస్తుంది.

**పచ్చి పసుపు పంజిరి :** పసుపు పంజిరి ఒక సాంప్రదాయ భారతీయ ప్రసవానంతర వంటకం. ఇది పాలు ఇచ్చే తల్లులకు అనేక ప్రయోజనాలను అందిస్తుందని నమ్ముతారు. వాటిలో ముఖ్యమైనవి తల్లి పాల ప్రవాహాన్ని ప్రేరేపించడం, శక్తిని పెంచడం మరియు ప్రసవం తర్వాత తల్లి కోలుకోవడంలో సహాయపడటం.

**కావలసిన పదార్థాలు:**

| | | |
|---|---|---|
| పసుపు కొమ్ములు | - | 200 గ్రా. |
| నెయ్యి | - | 250 గ్రా. |
| గోధుమ పిండి | - | 100 గ్రా. |
| బాదం | - | 50 గ్రా. |
| ఎండు ద్రాక్ష | - | 20 గ్రా. |
| జీడిపప్పు | - | 50 గ్రా. |
| అల్లం పొడి | - | 50 గ్రా. |
| బెల్లం పొడి | - | 100 గ్రా. |

**తయారీ విధానం:** తాజా పసుపు కొమ్ములను శుభ్రముగా కడిగి, తొక్క తీసి, ముక్కలుగా కోసుకోవాలి. కడాయిలో నెయ్యి వేడి చేసి, పసుపు కొమ్ము ముక్కలను కరకరలాడే వరకు వేయించి పక్కన పెట్టుకోవాలి. చల్లారాక వీటిని మిక్సీలో మెత్తగా పొడి చేసుకోని పక్కన పెట్టుకోవాలి. అదే కడాయిలో మిగిలిన నెయ్యిలో, ఎండు ద్రాక్ష, తరిగిన బాదం మరియు జీడి పప్పును వేయించి పక్కన పెట్టుకోవాలి. తరువాత అదే కడాయిలో మిగిలిన నెయ్యిలో గోధుమ పిండిని 1-2 నిమిషాలు వేయించాలి. ఇందులో బెల్లం పొడి, అల్లం పొడి, పసుపు, ఎండు ద్రాక్ష, బాదం మరియు జీడి పప్పు వేసి చల్లబడే వరకు బాగా కలిపి సర్వ్ చేసుకోవాలి.

## పచ్చి పసుపు లడ్డు

**కావలసిన పదార్థాలు:**

| | | |
|---|---|---|
| పసుపు కొమ్ములు | - | 500 గ్రా. |
| నెయ్యి | - | 30 గ్రా. |
| మాఖానా | - | 150 గ్రా. |
| బాదం | - | 100 గ్రా. |
| ఎండు ద్రాక్ష | - | 20 గ్రా. |
| జీడిపప్పు | - | 100 గ్రా. |
| వాల్నట్ | - | 50 గ్రా. |
| తురిమిన కొబ్బరి | - | 100 గ్రా. |
| బెల్లం | - | 500 గ్రా. |
| నల్ల మిరియాల పొడి | - | 10 గ్రా. |

**తయారీ విధానం:** తాజా పసుపు కొమ్ములను శుభ్రముగా కడిగి తొక్క తీసి తురుముకోవాలి. కొద్దిగా నెయ్యి వేడి చేసి డ్రై ఫ్రూట్స్ వేయించి చల్లారాక పొడి చేసి పక్కన పెట్టుకోవాలి. అలాగే మాఖానాను చిన్న మంట మీద కర కర లాడే వరకు వేయించి, చల్లారాక పొడి చేసి పెట్టుకోవాలి. కడాయిలో కొద్దిగా నెయ్యి, తురిమిన పసుపును చిన్న మంట మీద పచ్చి వాసన పోయి నెయ్యి వేరుపడే వరకు వేయించి పక్కన పెట్టుకోవాలి. బెల్లంను నీటిలో కరిగించి తీగ పాకం తయారు చేసుకోవాలి. పసుపు తురుములో బెల్లం పాకం, తురిమిన కొబ్బరి, డ్రై ఫ్రూట్స్ పొడి, మాఖానా పొడి మరియు నల్ల మిరియాల పొడి వేసి బాగా కలుపుకోవాలి. ఈ మిశ్రమంలో నెయ్యి వేసుకుంటూ లడ్డులు చుట్టుకోవాలి.

## పచ్చి పసుపు హల్వా

**కావలసిన పదార్థాలు:**

| | | |
|---|---|---|
| పసుపు కొమ్ములు | - | 500 గ్రా. |
| నెయ్యి | - | 75 గ్రా. |
| పాలు | - | 200 మి.లీ. |
| బాదం | - | 100 గ్రా. |
| ఎండు ద్రాక్ష | - | 20 గ్రా. |
| జీడిపప్పు | - | 100 గ్రా. |
| వాల్నట్ | - | 50 గ్రా. |
| గోధుమ పిండి | - | 100 గ్రా. |
| బెల్లం పొడి | - | 100 గ్రా. |
| నల్ల మిరియాల పొడి | - | 10 గ్రా. |

**తయారీ విధానం:** తాజా పసుపు కొమ్ములను శుభ్రముగా కడిగి, తొక్క తీసి, తురుముకోవాలి. కొద్దిగా నెయ్యి వేడి చేసి డ్రై ఫ్రూట్స్ వేయించి పక్కన పెట్టుకోవాలి . అలాగే కొద్దిగా నెయ్యిలో గోధుమ పిండిని బంగారు రంగు వచ్చే వరకూ వేయించి పక్కన పెట్టుకోవాలి. మిగిలిన నెయ్యిని వేడి చేసి తురిమిన పసుపును వేసి చిన్న మంట మీద పచ్చి వాసన పోయే వరకు వేయించాలి. నెయ్యి విడిపోతుండగా ఇందులో గోధుమ పిండి వేసి బాగా కలపాలి. తరువాత పాలు, బెల్లం పొడి వేసి బాగా కలపాలి. మిశ్రమం దగ్గర పడ్డకా డ్రై ఫ్రూట్స్ వేసి బాగా కలిపి హల్వాను సర్వ్ చేసుకోవాలి.

### పచ్చి పసుపు కోవా బర్ఫీ

**కావలసిన పదార్థాలు:**

చిక్కటి పాలు - 2 లీ.

పసుపు కొమ్ములు - 100 గ్రా.

బెల్లం పొడి - 400 గ్రా.

బాదం పొడి - 200 గ్రా.

కొబ్బరి పొడి - 200 గ్రా.

యాలకుల పొడి - 5 గ్రా.

నెయ్యి - 15 గ్రా.

పుచ్చకాయ గింజలు - 10 గ్రా.

**తయారీ విధానం:** తాజా పసుపు కొమ్ములను శుభ్రముగా కడిగి, తొక్క తీసి, తురుముకోవాలి. కడాయిలో కొద్దిగా నెయ్యి, తురిమిన పసుపును చిన్న మంట మీద పచ్చి వాసన పోయి నెయ్యి వేరుపడే వరకు వేయించి పక్కన పెట్టుకోవాలి. అలాగే కడాయిలో చిన్న మంట మీద పాలను బాగా చిక్కబడే వరకు మధ్య మధ్యలో కలుపుకుంటూ మరగనివ్వాలి. ఇందులో పసుపు తురుము, బెల్లం పొడి, కొబ్బరి పొడి వేసి దగ్గర పడి నీటి బుడగలు రానంత వరకు చిన్న మంట మీద ఉడికించుకోవాలి. మిశ్రమంలో ఏలుకుల పొడి వేసి బాగా కలిపి నెయ్యి రాసిన పళ్ళెంలో రెండు అంగుళాల మందంతో సమానంగా విస్తరించాలి. మిశ్రమం పైన వేయించిన పుచ్చకాయ గింజలను వేసి అలంకరించుకోని రెండు గంటలు ఆరనివ్వాలి. గట్టి పడ్డకా బర్ఫీని ముక్కలు చేసుకోవాలి.

**ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 9581302892**

**పి.జె.టి.ఏ.యు వారి రేడియో కార్యక్రమం చేనుకబుర్లు ప్రతి బుధవారం మధ్యాహ్నం 1:30 నుండి 2:30 వరకు ఆకాశవాణి, హైదరాబాద్-ఏ స్టేషన్ నుంచి ప్రసారమవుతుంది.**

| తేది | అంశం |
|---|---|
| 07.05.2025 | సస్యరక్షణ మందుల కోనుగోలు, వాడకంలో పాటించవలసిన మెళకువలు |
| | మానసిక ఆరోగ్యం - ప్రాధాన్యత |
| 14.05.2025 | వ్యవసాయ ఉత్పత్తుల నిల్వ పద్ధతులు మరియు వాటి అమ్మకం మరియు చీడపురుగుల నివారణ |
| | 0-5 ఏళ్ల పిల్లల కోసం టీకాల(వెక్సీనేషన్) దశలు |
| 21.05.2025 | అయిల్‌ఫామ్‌లో అంతర పంటలు లాభసాటి |
| | అన్‌లైన్ వేదింపులు మరియు సైబర్ బెదిరింపులను ఎదుర్కోనే మహిళలకు డిజిటల్ భద్రత |
| 28.05.2025 | సమీకృత వ్యవసాయం (ఇంటిగ్రేటేడ్ ఫార్మింగ్ సిస్టమ్) |
| | మహిళలలో కనిపించే పోషక రుగ్మతలు మరియు సంబంధిత జాగ్రత్తలు (30-45 సంవత్సరాలు) |



# ఎకో-ఫ్రెండ్లీ పద్ధతిలో పశు ఆహారం - రైతులకు ఆధునిక పరిష్కారం

కె. ప్రవల్లిక, ఆర్. శివశంకర్ మరియు డా।। సిహెచ్. వేణు గోపాల రెడ్డి
వ్యవసాయ కళాశాల, రాజేంద్రనగర్, హైదరాబాద్

**సైలేజ్:** సైలేజ్ అనేది పశువులకు ఉపయోగించే ఒక పోషకమైన మేత రూపం. పచ్చిమేతను తడి స్థితిలోనే గాలి లేకుండా నిల్వ చేసి, కిణ్వ ప్రక్రియ ద్వారా సైలేజ్‌గా మార్చబడుతుంది. ఈ పద్ధతిలో మేత సురక్షితంగా నిల్వ ఉండి, దాని పోషక విలువలు పెరుగుతాయి. ముఖ్యంగా పాడి పశువులకు ప్రయోజకరమైన ఆహారం.

**సైలేజ్ ఉత్పత్తి ప్రాముఖ్యత:**

**సంవత్సరం పొడవునా పశువులకు మేత:** ఎండాకాలం లేదా వర్షాకాలంలో మేత కొరకు ఉంటుంది. 6 నెలలు నుండి సంవత్సరం వరకు నిల్వ చేసి, సైలేజ్ పశువులకు మేతగా అందుబాటులో ఉంటుంది.

**పాల ఉత్పత్తి:** పాడి పశువులకు సరైన ఆహారం అందించడం వల్ల 15-20% పాల ఉత్పత్తి పెరుగుతుంది. సైలేజ్‌లో అధికంగా శక్తి, ప్రోటీన్, ఖనిజాలు పశువుల ఆరోగ్యాన్ని మెరుగుపరచి, పాల ఉత్పత్తికి దోహదం చేస్తాయి.

**పోషకాహార నాణ్యత:** నిల్వ చేసిన పచ్చిగడ్డిలో ఉండే పోషకాలు, కొత్తగా కోసిన గడ్డి కన్నా మెరుగ్గా ఉంటుంది. దీని వలన పశువుల జీర్ణప్రక్రియ మెరుగుపడుతుంది.

**తక్కువ ఖర్చుతో మేతను నిల్వ పద్ధతి:** వ్యవసాయ పొలాల్లో పచ్చిగడ్డిని రోజూ కోయడం కంటే, ఒకేసారి కోసి, నిల్వ చేసి, రైతులకు తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందవచ్చు.

**సైలేజ్ ఉత్పత్తి ప్రక్రియ:** ఉత్పత్తి ప్రక్రియ 5 ప్రధాన దశలుగా విభజించవచ్చు.

**సరైన పంట ఎంపిక:** మొక్కజొన్న, జొన్నగడ్డి, నేపియర్ మరియు చెఱకు టాప్స్ వంటి అధిక పోషకాలు మరియు తేమ కలిగిన పంటలను ఎంచుకోవాలి. పంట పూర్తిగా ఎదిగినప్పుడు విత్తనాలు పూర్తిగా పరిపక్వత కాకముందు కోయాలి.

**తరిగిన గడ్డిని నిల్వ చేయడం:** పచ్చగడ్డిని 2-3 సెం.మీ. ముక్కలుగా తరిగితే కిణ్వ ప్రక్రియ సులభంగా జరుగుతుంది. చక్కెర శాతం ఎక్కువగా ఉన్న సమయంలో కోస్తే మంచి నాణ్యమైన సైలేజ్ తయారవుతుంది.

**సైలేజ్‌ను తయారీ:** దీనిని 4 రకాలుగా ఉపయోగించవచ్చు.

- పిట్‌సైలో - నేలలో గుంత త్రవ్వి నిల్వ చేయడం.
- ట్రెంచ్ సైలో - కొండ ప్రాంతాల్లో గోడలతో తయారు చేసిన నిల్వ.
- బంకర్ సైలో - పెద్ద మొత్తంలో పచ్చిమేతను నిల్వ చేయడానికి అనుకూలంగా ఉంటుంది. గోడలతో లేదా మట్టి గోడలతో నిర్మించి, పచ్చిగడ్డిని నింపి గట్టిగా నొక్కి, ప్లాస్టిక్ షీట్‌తో కప్పిగాలి లీకేజీ లేకుండా ఉంచాలి.
- బ్యాగ్ సైలో - తక్కువ స్థాయిలో రైతులకు అనువైనది.

**కిణ్వ ప్రక్రియ:** తరిగిన గడ్డిని ప్లాస్టిక్ కవర్లతో గట్టిగా మూసి, గాలి ప్రవేశం లేకుండా చేయాలి. 30-40 రోజులపాటు కిణ్వ ప్రక్రియ జరిగి, లాక్టిక్ ఆమ్లం ఏర్పడి మేత కుళ్ళకుండా ఉంటుంది. మంచి సైలేజ్ పసుపు-బ్రౌన్ రంగులో ఉండి, స్వల్పంగా పులుపు వాసనతో ఉంటుంది.

**పశు సంఖ్య & సైలేజ్ ఉత్పత్తి వ్యయం:** సైలేజ్ ఉత్పత్తి వ్యయం రైతుల పశు సంఖ్య మరియు ఉపయోగించే పంటలపై ఆధారపడి ఉంటుంది. చిన్న, మధ్యస్థ మరియు పెద్ద రైతుల కోసం వ్యయం భిన్నంగా ఉంటుంది.

| పశువుల సంఖ్య | నిల్వ విధానం | రోజుకు సైలేజ్ అవసరం (ఒక పశువుకి) | సంవత్సరానికి అవసరమైన సైలేజ్ |
|---|---|---|---|
| 1-5 పశువులు | బ్యాగ్ సైలో | 15-20 కిలోలు | 5-10 టన్నులు (5475 కిలోలు) |
| 6-20 పశువులు | పిట్ సైలో | 15-20 కిలోలు | 20-50 టన్నులు |
| 20+ పశువులు | బంకర్ సైలో | 20-25 కిలోలు | 50-200 టన్నులు |

పాడి పశువుల పాల ఉత్పత్తి పెంచడానికి, పశువుకు రోజుకు కనీసం 15-25 కిలోలు సైలేజ్ అవసరం.

## 2. మొక్కజొన్న సైలేజ్ ఉత్పత్తి వ్యయం

| ఆవశ్యకతలు | ఖర్చు (రూ./ఎకరానికి) |
|---|---|
| విత్తనాలు | రూ. 2500-3000 |
| ఎరువులు & పురుగుమందులు | రూ. 4000-6000 |
| పంటసాగు ఖర్చు | రూ. 4000-6000 |
| నిరుపయోగమైన కలుపు తొలగించు | రూ. 2000-3000 |
| పంట కోయడం & తరగించడం | రూ. 3000-5000 |
| సైలేజ్ నిల్వ బ్యాగ్ | రూ. 5000-10000 |
| మొత్తం ఖర్చు (ఎకరానికి) | రూ. 20,000-30,000 |
| సైలేజ్ దిగుబడి (ఎకరానికి) | 35-40 టన్నులు |
| టన్ను సైలేజ్ ఖర్చు | రూ. 500-750 |

## 3. పశుసంఖ్య ఆధారంగా సైలేజ్ వ్యయం

| పశువుల సంఖ్య | సంవత్సరానికి అవసరమైన సైలేజ్ | వ్యయం (రూ.) |
|---|---|---|
| 1-5 పశువులు | 5-10 టన్నులు | రూ. 5000-15,000 |
| 6-20 పశువులు | 20-50 టన్నులు | రూ. 20,000-50,000 |
| 20+ పశువులు | 50-200 టన్నులు | రూ. 50,000-2,00,000 |

**లాభదాయకత & ఆదాయ అవకాశాలు:**

- పాడి పశువుల పాల ఉత్పత్తి 15-20% పెరుగుతుంది.
- ఎండాకాలంలో మేత కొరత లేకుండా నిరంతరం పశువులకు పోషకాహారం అందుతుంది.
- అధిక ఉత్పత్తి ఉన్న రైతులు మార్కెట్‌కి సైలేజ్ విక్రయించవచ్చు (రూ. 800-1200/- టన్నుకు)
- వ్యవసాయ శాఖ మరియు ప్రభుత్వ పథకాల ద్వారా సబ్సిడీలు లభిస్తాయి.

**ముగింపు:** సైలేజ్ ఉత్పత్తి పశు సంఖ్యపై ఆధారపడి ఉంటుంది. చిన్న రైతులు తక్కువ స్థాయిలో, పెద్ద రైతులు అధిక స్థాయిలో ఉత్పత్తి చేస్తే పశువులకు తక్కువ ఖర్చుతో అధిక పోషకాహారం అందచేయవచ్చును.

**ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం.9705892837**

# పశువులలో వ్యాధుల నిర్ధారణకై ఆధునిక పరీక్షలు - వసతులు

డా|| జె. శశాంక్, డా|| ఎమ్. ఫిబి రాణి,
డా|| ఎమ్. ఎల్. నమ్రత, డా|| జె. జ్యోతి మరియు
డా|| వి.వి.వి. అమృత్ కుమార్
వెటర్నరీ కాలేజ్, పీవీ నరసింహారావు తెలంగాణ
వెటర్నరీ యూనివర్సిటీ, మామునూరు, వరంగల్





'ఆరోగ్యమే మహాభాగ్యం' అనే నానుడి మనుషులకు ఎలా వర్తిస్తుందో పశువులలో ఆరోగ్య పరిరక్షణ అధిక ఉత్పత్తికి అంతే వర్తిస్తుంది. ఇన్ని రోజులుగా మనం ఎన్నో పశు సంబంధ వ్యాధులను అరికట్టగలిగాము, పారుడు రోగాన్ని మన దేశంలో (ప్రపంచంలోనే) పూర్తిగా అరికట్టగలిగాము. గాలికుంటు, గొంతువాపు, జబ్బ వాపు, దొమ్మ వంటి వ్యాధులను అరికట్టడంలో కూడా ప్రగతి సాధించాము. వందల్లో ఉన్న అంటు వ్యాధుల సంఖ్యను అనూహ్యంగా తగ్గించగలిగాము. ఇవన్నీ కూడా సరైన సమయంలో వ్యాధి నిర్ధారణ, ముందు చూపు చర్యలు, సరైన సమయంలో వ్యాధి నిరోధక టీకా కార్యక్రమాలు చేపట్టడం ద్వారా సాధ్యపడింది. ఈ మధ్య కాలంలో పశువుల ధర కూడా అనూహ్యంగా పెరిగింది. అలాంటి పశువుల నుండి మంచి దిగుబడుల ద్వారా లబ్ది పొందకపోతే, రైతు ఎంతో నష్టపోవలసి ఉంటుంది. దీనికి గాను పశువులు ఎలాంటి రోగాల బారిన పడకుండా ముందుగానే రాబోయే రోగాలను గుర్తించడం, వ్యాధి బారిన పడిన పశువులైతే వెంటనే రోగాలను గుర్తించడం, తగిన చర్యలు తీసుకోవడం వంటి అవసరం ఉంది. దీనికై ఎలాంటి పరీక్షలు చేయాలి, వాటికి ఎలాంటి సదుపాయాలు కావాలి అనే అవగాహన ఎంతైనా అవసరం. వ్యాధి నిర్ధారణకు వేగంగా, సమయానికి అందించేందుకు సరైన పరీక్షలు, ఆధునిక యంత్ర పరికరాలు, సిబ్బంది నైపుణ్యత ఎంతో అవసరం. ఈ సందర్భంలో ఈ పరీక్షలు, వాటిపై అవగాహనకై పశువుల్లో సంక్రమించే వివిధ వ్యాధులకు ఎలాంటి పరీక్షలు అందుబాటులో ఉన్నవో ఒకసారి చూద్దాం.

**సూక్ష్మజీవుల ద్వారా వ్యాప్తి చెందే అంటువ్యాధుల నిర్ధారణకు పరీక్షలు:** మన రాష్ట్రంలో పశువులలో వ్యాపించే వ్యాధులలో గాలికుంటు, గొంతు వాపు, జబ్బ వాపు, దొమ్మ, పొదుగువాపు, ఐ.బి.ఆర్., గొర్రెలలో పి.పి.ఆర్., మశూచి, నీలినాలుక, చిటుక వ్యాధి, ఫుట్ రాట్, న్యుమోనియా ఎంతో ముఖ్యమైనవి. ఈ వ్యాధులను నిర్ధారించడానికి ఇప్పటి వరకు పశువుల నుండి సేకరించిన పేడ, రక్త, కణజాల నమూనాలను వివిధ స్టెయినింగ్ పద్ధతుల ద్వారా సూక్ష్మదర్శినిలో పరీక్షించి గుర్తించగలుగుతున్నాము. అలా బ్రతికివున్న, చనిపోయిన పశువుల నుండి శవపరీక్షలో (పోస్ట్ మార్టమ్) సేకరించిన వివిధ నమూనాలను ప్రయోగశాలలోని కృత్రిమ మీడియాలలో పెంచి, అలా పెరిగిన సూక్ష్మక్రిములను గుర్తించడం ద్వారా కూడా వ్యాధి నిర్ధారణ చేస్తున్నాము. ఇవే కాకుండా రక్తం నుండి సీరమ్ ను వేరు చేసి ఇమ్యునోడిఫ్యూషన్, జెల్ ఎలక్ట్రోఫోరోసిస్, హెచ్ఎ, హెచ్ఐ పరీక్షలు, ప్రెసిపిటేషన్, న్యూట్రలైజేషన్ వంటి సీరలాజికల్ పద్ధతుల ద్వారా కూడా వ్యాధి నిర్ధారణలో ఉపయోగిస్తున్నాము. ఈ పరీక్షలలో కొన్నింటికి కాలం చెల్లినప్పటికీ, కొన్ని పరీక్షలు ఇంకనూ ఉపయుక్తంగానే ఉన్నాయి. కాని ఈ పరీక్షలు చెయ్యడానికి తీసుకునే సమయం ఎక్కువగా ఉండడం, వ్యాధి కారక క్రిములను గుర్తించడంలోని సున్నితత్వం, ఖచ్చితత్వం తక్కువగా ఉండడం వలన వ్యాధి నిర్ధారణలో కొంత ఆలస్యం, ఇబ్బందులు ఎదురవుతున్నాయి. త్వరితగతిన, ఖచ్చితంగా గుర్తించే దిశలో గత రెండు, మూడు దశాబ్దాల కాలంలో జరిగిన పరిశోధనలు మంచి ఫలితాలను ఇచ్చాయి. వీటిలో వివిధ రకాలైన సబ్ క్లినికల్ మాస్టిటీస్, ఎలిసా, పి.సి.ఆర్. పరీక్షలు ఎంతో ముఖ్యమైనవి. ఈ పరీక్షలను ఉపయోగించి మనకు తెలిసిన అనేక పశువ్యాధులను 24-48 గంటలలో ఖచ్చితంగా నిర్ధారించే వీలుంది. మల్టీప్లెక్స్ పి.సి.ఆర్. వంటి పరీక్షల ద్వారా ఒకేసారి అనేక వ్యాధులను, ఒకే పరీక్ష ద్వారా ఏకకాలంలో గుర్తించే అవకాశం ఉంది.

పాశ్చాత్య దేశాలతో పోటీగా మన దేశంలోని అనేక ప్రయోగశాలల్లో ఈ సదుపాయాలను అందుబాటులోనికి తేవడం, సిబ్బందికి తగిన శిక్షణ ఇప్పించి ఈ పరీక్షల ద్వారా వ్యాధి నిర్ధారణ

అవకాశాలను మెరుగుపర్చుకున్నాము. ఇదే కాకుండా వ్యాధి కారక సూక్ష్మ క్రిములను వివిధ పద్ధతుల ద్వారా వేరుచేసి, గుర్తించి (ఐసోలేషన్ అండ్ అయిడెంటిఫికేషన్ ఆఫ్ ది ఆర్గనిజమ్) తద్వారా వ్యాధులను కనిపెట్టడం జరుగుతుంది. ఈ ఆధునిక పరీక్షలను ప్రపంచ పశు ఆరోగ్య పరిరక్షణా సంస్థ డబ్ల్యుఓఎహెచ్ / ఓఐఇ వివిధ వ్యాధుల నిర్ధారణలో ప్రపంచ వ్యాప్తంగా గుర్తించడం వలన వ్యాధి ప్రబలత ఏ దేశాల్లో ఉన్నదీ లేనిదీ ప్రకటించే ప్రక్రియలో ముఖ్య పాత్ర పోషిస్తున్నాయి. తద్వారా పశువులు, పశు ఉత్పత్తుల అంతర్జాతీయ రవాణా, వ్యాపార లావాదేవీలలో ఎంతో కీలకపాత్ర పోషిస్తున్నాయి.

**అంతర, బాహ్య, రక్త పరాన్న జీవుల ద్వారా సంక్రమించే వ్యాధుల నిర్ధారణ :** కాలేయ, పొట్ట జలగ రోగాలు, గుండ్రటి పురుగులు, బద్దె పురుగులు, సాధారణంగా పశువులలో కనిపించే అంతర పరాన్న జీవుల వ్యాధులు వీటిని పేడ విసర్జనలో లేదా శవపరీక్షలో చూసి గుర్తించవచ్చు లేదా పేడ పరీక్ష ద్వారా సూక్ష్మదర్శిని సహాయంతో గుర్తించవచ్చు వ్యాధి తీవ్రతను, పరాన్న జీవిని గుర్తించడానికి ఇ.పి.జి (ఎగ్గ్ పర్ గ్రామ్), ఫ్లోటేషన్, సెడిమెంటేషన్, కల్చరల్, స్టెయినింగ్ పరీక్షలను వాడవచ్చు. ఈ వ్యాధులను ఎలిసా, పి.సి.ఆర్. వంటి పరీక్షల ద్వారా కూడా గుర్తించడం జరుగుతున్నది. రక్తంలో ఉండే ఏక కణ పరాన్న జీవులను, రక్తచారలను స్టెయినింగ్ పద్ధతుల ద్వారా పరీక్షించడం జరుగుతుంది. వీటిని కూడా స్నాప్ హిమో ప్రోటోజోవల్, ఎలిసా, పి.సి.ఆర్. పరీక్షలతో గుర్తించవచ్చు. బాహ్య పరాన్న జీవులలో పిడుదులు, పేలు వంటి వాటి ద్వారా రక్త క్షీణత, మైట్స్ ద్వారా వచ్చే స్కేబీస్ వ్యాధులు ముఖ్యమైనవి. వీటిని చర్మ పొలుసులను సూక్ష్మదర్శిని ద్వారా పరీక్షించి గుర్తించవచ్చు.

**ప్రత్యుత్పత్తి, గర్భకోశ సంబంధ వ్యాధుల నిర్ధారణ:** ఈ వ్యాధులలో ఎదకు రాకపోవడం, అండాశయం సరిగ్గా వృద్ధి చెందకపోవడం, ఎంతకూ కట్టు నిలవకపోవడం, గర్భ స్రావం, మాయపడక పోవడం, మెట్రైటిస్, ఎండోమెట్రైటిస్, పయోమెట్రా మొదలగునవి ముఖ్యమైనవి. అంటు వ్యాధులను మినహాయిస్తే పైన పేర్కొన్న వ్యాధులు, హార్మోన్లు, ఖనిజ లవణ పోషణాలోపాల వలన, అసమానతల వలన వచ్చే అవకాశం ఉన్నందున పశువుల రక్తంలో వీటి పరిమాణం సక్రమంగా ఉన్నదీ లేనిదీ తెలుసుకునేందుకు బయోకెమికల్ ఎనాలిసిస్, హార్మోనల్ ఎస్సే వంటి పరీక్షలు బయోకెమికల్ ఎనలైజర్స్, హెచ్.పి.ఎల్.సి., లిక్విడ్ క్రొమటోగ్రఫీ వంటి ఆధునిక పరికరాల ద్వారా పరీక్షలు చేయించవచ్చు.

**పోషణలోప సంబంధిత వ్యాధులు-నిర్ధారణ:** పశుపోషణలో పిండి పదార్థాలు, మాంసకృత్తులు, క్రొవ్వు పదార్థాలు, ఖనిజలవణాలు, విటమిన్లు ఎంతో కీలకపాత్ర వహిస్తాయి. ఇవన్నీ సమపాళ్ళలో వున్నప్పుడే పశువు ఆరోగ్యంగా ఉండి అధిక ఉత్పత్తిని ఇవ్వగలుగుతుంది. వీటిలో అసమతుల్యం, లోపం ఏర్పడినప్పుడు కొన్ని లోప సంబంధ (డెఫిషిఎన్సీ డిసార్డర్) రోగాలు రావడమే కాకుండా పాడి ఉత్పత్తిపై ప్రభావం చూపే అవకాశం ఉంది. ఇలాంటి సందర్భాలలో పశువుల నుండి రక్త, సీరమ్ నమూనాలను పరీక్షించి, లోపాలను గుర్తించి తగిన విధంగా పోషణ చెయ్యడం ద్వారా ఈ లోపాలను అధిగమించవచ్చు. ఈ పోషక పదార్థాల, ఖనిజ లవణాల, విటమిన్ల, ఎంజైముల పరిమాణం తెలుసుకునేందుకు బయోకెమికల్ ఎనాలిసిస్, లిక్విడ్ క్రొమటోగ్రఫీ, హెచ్‌పిఎల్‌సి లాంటి ఆధునిక పరీక్షలను చేయించవలసి ఉంటుంది. పశుదాణా, మేతలలో ఏర్పడే / ఉండే ఎఫ్లాటాక్సిన్, అక్రోటాక్సిన్ వంటి విష పదార్థాలు, పశువులకు మేపే గడ్డి, ఇతర దాణాలలో / ధాన్యాలలో పంట సమయములో వినియోగించే క్రిమిసంహారక మందుల అవశేషాలను, హాని కలిగించే ఆర్సెనిక్, మెర్క్యురీ, క్రోమియం, కాడ్మియమ్ వంటి హెవీ మెటల్స్ ను గుర్తించడానికి కూడా ఈ హెచ్‌పిఎల్‌సి, గ్యాస్ ఎల్-ఎమ్ఎస్, అటామిక్ ఎబ్ సోర్బ్ షన్ స్పెక్ట్రోస్కోపి వంటి ఆధునిక పరీక్షలను ఉపయోగించవచ్చు. వీటినే కాకుండా ప్రస్తుతం అందుబాటులో వున్న ఎనలిటికల్ పరీక్షల ద్వారా కూడా తేలికగా గుర్తించవచ్చు.

**మెటబాలిక్ లోప సంబంధ వ్యాధులు- నిర్ధారణ:** పశు శరీరంలో ఎన్నో జీవ ప్రక్రియలు జరుగుతుంటాయి. వీటిని వివిధ ఎంజైములు, ఖనిజలవణాలు, హార్మోన్లు క్రమబద్దీకరించడం జరుగుతుంది. వీటి ఉత్పత్తిలో పరిమాణలోపం చూడి, అధిక పాల దిగుబడి లాంటి సందర్భాలలో ఉండే అధిక అవసరాలను అందుకోలేకపోవడం వలన పాల జ్వరం, గ్రాస్ టెటాని, కీటోసిస్ వంటి మెటబాలిక్ డిసార్డర్స్ (ఉత్పాదక వ్యాధులు) వచ్చే ప్రమాదం ఉంది. ఈ సందర్భాలలో సహితం ఈ ఎంజైములు, ఖనిజలవణ లోపాలను గుర్తించడానికి బయోకెమికల్ ఎనాలిసిస్, హెచ్‌పిఎల్‌సి పరీక్షలను ఉపయోగించవచ్చు.

ఈ పరీక్షలే కాకుండా, అనేక ఆధునిక పరీక్షలు కూడా పశువుల వ్యాధి నిర్ధారణలో ఎంతో ఉపయోగపడుతున్నాయి.

ఇతర వివరములకు సంప్రదించవలసిన
ఫోన్ నెం. 9866922336

# టి.వి. ఛానళ్ళలో ప్రత్యక్ష ప్రసారాల ద్వారా వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలతో రైతుల ముఖాముఖి కార్యక్రమాలు

డా॥ యం. శ్రీనివాసులు మరియు డా॥ జె.ఎస్. సుధా రాణి
ఎలక్ట్రానిక్ వింగ్, రాజేంద్రనగర్, హైదరాబాద్

| క్రమ సంఖ్య | తేది | అంశము | సాంకేతిక సమాచారం అందిస్తున్న శాస్త్రవేత్త పేరు, హోదా మరియు ఫోన్ నెంబర్ |
|---|---|---|---|
| ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ విశ్వవిద్యాలయం మరియు రాష్ట్ర వ్యవసాయశాఖ సంయుక్తంగా నిర్వహిస్తున్న రైతు నేస్తం | | | |
| 1. | 06.05.25 | విత్తన నాణ్యత మరియు మొలకశాతం నిర్ధారణ పరీక్షలు – అవశ్యకత | **డా॥ పి. సుజాత,** అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ రిసెర్చ్ (ఎ.డి.ఆర్.) పరిశోధన సంచాలకులు కార్యాలయం, రాజేంద్రనగర్, 7989007024 |
| | | నిమ్మ, బత్తాయిలో ప్రస్తుతం చేపట్టవలసిన యాజమాన్యం | **డా॥ సి.హెచ్. రాజా గౌడ్,** సీనియర్ శాస్త్రవేత్త ఉద్యాన పరిశోధన స్థానం, శ్రీ కొండాలక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం, మల్లేపల్లి, 7396400740 |
| | | పశువుల పోషణ, దాణా మరియు పశుగ్రాసాల పెంపకం | **డా॥ జె. నరసింహా,** ప్రొఫెసర్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎనిమల్ న్యూటిషన్, కాలేజ్ ఆఫ్ వెటర్నరీ సైన్స్ పి.వి.నరసింహారావు వెటర్నరీ యూనివర్సిటీ, రాజేంద్రనగర్, 9440671108 |
| 2. | 13.05.25 | భూసారం పెంచడానికి పచ్చిరొట్ట ఎరువుల వాడకం | **డా॥ జె.ఎస్. సుధారాణి,** శాస్త్రవేత్త (అగ్రానమి) ఎలక్ట్రానిక్ వింగ్, రాజేంద్రనగర్, 9550526096 |
| | | అయిల్‌ఫామ్ పంటలో అంతరపంటల సాగు | **డా॥ జి. విజయ్ కృష్ణ,** శాస్త్రవేత్త (హార్టికల్చర్) & హెడ్ ఉద్యాన పరిశోధన స్థానం, శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం, అశ్వారావుపేట, 7995890625 |
| | | పాలు, పాల పదార్థాల తయారీ | **డా॥ యం. సాహిత్య రాణి,** అసిస్టెంట్ ప్రొఫెసర్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ లైవ్‌స్టాక్ ప్రొడక్షన్ మేనేజ్‌మెంట్, కాలేజ్ ఆఫ్ వెటర్నరీ సైన్స్, పి.వి.నరసింహారావు వెటర్నరీ యూనివర్సిటీ, 8686385184 |
| 3. | 20.5.25 | వానాకాలం పంటల సాగు – సూచనలు | **ప్రధాన శాస్త్రవేత్త (వరి)** |
| | | | **ప్రధాన శాస్త్రవేత్త (మొక్కజొన్న&చిరుధాన్యాలు)** |
| | | | **ప్రధాన శాస్త్రవేత్త (ప్రత్తి)** |
| | | | **ప్రధాన శాస్త్రవేత్త (అపరాలు)** |
| 4. | 27.05.25 | వానాకాలం సాగుకు సమాయత్తం | **సహ పరిశోధన సంచాలకులు** ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం దక్షిణ తెలంగాణ మండలం, పాలెం |
| | | | **సహ పరిశోధన సంచాలకులు** ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం మధ్య తెలంగాణ మండలం, వరగల్ |
| | | | **సహ పరిశోధన సంచాలకులు** ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఉత్తర తెలంగాణ మండలం, జగిత్యాల |



# రైతన్నకో ప్రశ్న...

డా॥ ఆర్. సునీత దేవి
వ్యవసాయ సమాచార ప్రసార మరియు ముద్రణాలయం, రాజేంద్రనగర్, హైదరాబాద్

**1. రైతులు తమ పొలంలోని మట్టిని ఎన్ని సంవత్సరాలకు ఒకసారి పరీక్ష చేయించుకుంటే మంచిది?**

ఎ) 2 బి) 3 సి) 4 డి) 5

**2. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ విశ్వవిద్యాలయంలో ప్రతి సంవత్సరం విత్తన మేళా ఏ నెలలో నిర్వహిస్తారు?**

ఎ) మార్చి బి) ఏప్రిల్ సి) మే డి) జూన్

**3. వానాకాలంకు ముందు వేసే నువ్వుల పంటను ఎప్పుడిలోపు విత్తుకోవాలి?**

ఎ) ఏప్రిల్ మొదటి పక్షంలోపు
బి) ఏప్రిల్ రెండవ పక్షంలోపు
సి) మే మొదటి పక్షంలోపు
డి) మే రెండవ పక్షంలోపు

**4. వరి కోత దశలో గింజ రాలడం తగ్గించాలంటే ఎంత శాతం గింజలు పక్వానికి వచ్చినప్పుడు కోయాలి?**

ఎ) 60% బి) 70% సి) 80% డి) 90%

**5. సుస్థిరమైన దిగుబడుల కొరకు ఎలాంటి పద్ధతులను పంటల సాగులో భాగంగా చేసుకోవాలి?**

ఎ) పంట అవశేషాలను సద్వినియోగం చేసుకోవడం
బి) పచ్చిరొట్ట ఎరువుల పంటలను వేసుకోవడం
సి) రసాయన ఎరువులను వాడటం
డి) ఎ మరియు బి

**6. మనదేశంలో ప్రత్తి ఉత్పత్తిలో అగ్రగామి రాష్ట్రం ఏది?**

ఎ) మహారాష్ట్ర బి) ఉత్తరప్రదేశ్
సి) తెలంగాణ డి) గుజరాత్

**7. ఫాస్ఫోబ్యాక్టీరియా జీవన ఎరువు నేలలో లభ్యంకాని రూపంలో ఉన్న ఏ పోషకాన్ని లభ్యమయ్యేలా చేస్తుంది?**

ఎ) నత్రజని బి) భాస్వరం
సి) పొటాష్ డి) ఏదీకాదు

**8. రసాయన పురుగుమందులు విచక్షణారహితంగా వాడితే కలిగే అనర్థాలు?**

ఎ) పురుగులలో నిరోధక శక్తి పెరుగుతుంది
బి) పురుగు తిరిగి ఉధృతి అవుతుంది
సి) పురుగుమందుల అవశేషాలు ఉంటాయి
డి) పైవన్నీ

**9. విత్తనాలు నిల్వ సమయంలో చెడిపోవడానికి ముఖ్య కారణాలు ఏవి?**

ఎ) విత్తనంలో తేమ శాతం అధికంగా ఉండటం
బి) భద్రపరిచిన గదిలో తేమ మరియు ఉష్ణోగ్రత ఎక్కువగా ఉండటం
సి) పూర్తిగా శుభ్రం చేయకుండా విత్తనాలను నిల్వ చేయడం
డి) పైవన్నీ

**10. వేసవి కాలంలో లోతు దుక్కులు చేసుకోవడం వలన ఎలాంటి ప్రయోజనాలు ఉంటాయి?**

ఎ) భూమిలో దాగి ఉన్న కోశస్థ దశ పురుగులు బయటపడి ఎండ వేడిమికి చనిపోతాయి
బి) కలుపు మొక్కలు కదిలించబడి, వడలిపోయి చనిపోతాయి మరియు వానాకాలంలో కలుపు సమస్య తగ్గుతుంది.
సి) భూమి ఎక్కువ నీళ్ళను గ్రహించి నిల్వ చేసుకునే సామర్థ్యాన్ని పెంపొందించుకుంటుంది
డి) పైవన్నీ

పై ప్రశ్నలకు సమాధానాలు 50వ పేజీలో చూడవచ్చు

విశ్వవిద్యాలయ వార్తలు



## అధిక దిగుబడికి ఉత్తమ హైబ్రిడ్ రకాలు

భారత వ్యవసాయ పరిశోధన మండలి ఆధ్వర్యంలో కోయంబత్తూరు, తమిళనాడులో నిర్వహించిన అఖిల భారత మొక్కజొన్న పరిశోధన సమన్వయ సమావేశంలో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఇటీవల రూపొందించిన దక్కన్ హైబ్రిడ్ మక్కా 144, డి.హెచ్.యం. 182, డి.హెచ్.యం. 193, డి.హెచ్.యం. 206, డి.హెచ్.యం218 మొత్తం ఐదు మొక్కజొన్న హైబ్రిడ్ రకాలను విడుదల చేశారని ఏప్రిల్ 13న వర్సిటీ ఉపకులపతి ప్రొ. అల్దాస్ జానయ్య ఒక ప్రకటనలో తెలిపారు. డి.హెచ్.యం. 144 (తెలంగాణ మక్క-6) రకంలో అధిక పిండి పదార్థం ఉండటం వలన ఇథనాల్ ఉత్పత్తికి బాగా అనుకూలంగా ఉంటుందని, డి.హెచ్.యం. 206 (తెలంగాణ మక్క-3) మెట్ట సాగుకు అనుకూలమైనదని మరియు ఎండుతెగులును సమర్థవంతంగా తట్టుకుంటుందని అభిప్రాయపడ్డారు. అదేవిధంగా ఈ మధ్య కాలంలో వర్సిటీ విడుదల చేసిన 16 వివిధ పంటల రకాలను అధికారిక రకాలుగా (నోటిఫైడ్ వెరైటీస్) గుర్తిస్తూ కేంద్ర ప్రభుత్వ వ్యవసాయ మంత్రిత్వశాఖ ప్రకటన విడుదల చేసిందన్నారు. రాష్ట్రంలోని వివిధ విత్తన సంస్థలు ఈ రకాల మూల విత్తన సరఫరా కొరకు విశ్వవిద్యాలయ అధికారులను సంప్రదించాలని సూచించారు.

## రికార్డు స్థాయిలో వరి ధాన్యం ఉత్పత్తి చేసిన ఘనత తెలంగాణాదే

వర్సిటీ పరిధిలోని అగ్రిహబ్‌లో ఏప్రిల్ 15న జరిగిన రైస్ ఎక్స్‌పోర్టర్స్ వర్క్‌షాప్‌నకు రాష్ట్రం నుంచి తొలిసారిగా ఫిలిప్పైన్స్ దేశానికి బియ్యం ఎగుమతి ప్రారంభ కార్యక్రమానికి రాష్ట్ర పౌరసరఫరాల శాఖా మంత్రి గౌ॥ శ్రీ ఎన్. ఉత్తమ కుమార్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరైనారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశ స్థాయిలో మన తెలంగాణ రాష్ట్రం 2025-26 సంవత్సరంలో వరి ధాన్యం ఉత్పత్తిలో రికార్డును సృష్టించిందని అన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ కుమార్ రెడ్డి మాట్లాడుతూ 2025, 2026లో వరి పంటకు అనుకూలమైన వాతావరణ పరిస్థితులు, రైతుల కృషి వల్ల చేకూరుతాయని మరియు ఈ సందర్భంగా ప్రొ॥ అల్దాస్ జానయ్య, ఉపకులపతి మాట్లాడుతూ ఫిలిప్పైన్స్ దేశం ఎప్పటికీ దిగుమతి చేసుకునే దేశమేనని..ఎన్నటికీ స్వయం సమృద్ధి సాధించగలిగే దేశం కాదు అని, కావున ఆ దేశాన్ని తెలంగాణ బియ్యానికి అనుకూలమైన మార్కెట్‌గా గుర్తించి ఆ దిశగా చర్యలు తీసుకున్నట్లయితే బియ్యం నిల్వలకు శాశ్వత పరిష్కారం దొరికినట్లేనని చెప్పారు. ఈ కార్యక్రమంలో రైస్ మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షులు, ఫుడ్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా అధికారులు, వర్సిటీ అపెడా అధికారులు, ఉన్నతాధికారులు, రైతు నాయకులు మరియు పౌరసరఫరాల శాఖ అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రముఖుల జయంతి వేడుకలు

డా॥ బాబూ జగ్జీవన్ రాం 117వ జయంతి (5.4.2025), మహాత్మా జ్యోతిభా పూలే 198వ జయంతి (11.4.25) మరియు డా॥ బి. ఆర్. అంబేద్కర్ 135వ జయంతి (14.4.25) సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రొ॥ అల్దాస్ జానయ్య, గౌరవ ఉపకులపతి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ ఉన్నతాధికారులు, బోధన, బోధనేతర సిబ్బంది ప్రముఖుల చిత్రపటాల వద్ద పుష్పాంజలి ఘటించి ఘన నివాళులర్పించారు.

## పరిశోధన, విస్తరణ సలహా మండలి 48వ సమావేశం

విశ్వవిద్యాలయ పరిశోధన, విస్తరణ సలహా మండలి 48వ సమావేశం ఏప్రిల్ 17న విశ్వవిద్యాలయ ఆడిటోరియంలో జరిగింది. ఈ సందర్భంగా ప్రొ॥ అల్దాస్ జానయ్య, గౌరవ ఉపకులపతి మాట్లాడుతూ "పర్యావరణ పరిరక్షణ కొరకు మానవ రహిత వ్యవసాయం" దిశగా పరిశోధనలు సాగాలని అన్నారు. మారిన వాతావరణ పరిస్థితులు మరియు ఉత్పత్తి ఖర్చుల పెరుగుదల కారణంగా నేడు కొత్త సవాళ్ళు ఎదురవుతున్నాయని, సహజ వ్యవసాయం, సేంద్రియ వ్యవసాయ పద్ధతులు, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, డ్రోన్స్, రోబోటిక్ టెక్నాలజీ వినియోగాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. దేశవాళీ వంగడాల పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని, ఆహార ఉత్పత్తులకు విలువ జోడింపుకు అవసరమైన పరిశోధనలు జరగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వవిశ్వవిద్యాలయ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## వ్యవసాయంలో కృత్రిమ మేధ వినియోగంపై బిట్స్ పిలానీతో వర్సిటీ ఒప్పందం

వ్యవసాయంలో కృత్రిమ మేధ వినియోగంపై ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విద్యాలయం, బిట్స్‌పిలానిల మధ్య అవగాహన ఒప్పందం పత్రాలపై ఇరు సంస్థలు ఒప్పంద పత్రాల్ని ఏప్రిల్ 25న మార్చుకున్నారు. ఈ అవగాహన ఒప్పందం సంయుక్తంగా పరిశోధన ప్రాజెక్టుల రూపకల్పనకు, పిహెచ్‌డి విద్యార్థులకు పరిశోధన సలహాలు ఇవ్వడానికి దోహదం చేస్తుందని ప్రొ॥ వి. రాంగోపాల్ రావు, బిట్స్ పిలాని గౌరవ ఉపకులపతి అన్నారు. ప్రొ॥ అల్దాస్ జానయ్య, వర్సిటీ గౌరవ ఉపకులపతి మాట్లాడుతూ దేశంలోనే అత్యంత ప్రాచీన వ్యవసాయ విశ్వవిద్యాలయాల్లో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం రెండవదని, రెండు వేల నలభై సంవత్సరం నాటికి నాటికి మానవ రహిత వ్యవసాయం తీసుకురావాలనే లక్ష్యంతో తాము ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డా॥ బలరాం, పరిశోధనా సంచాలకులు, డా॥ జి.ఇ.సి.హెచ్. విద్యాసాగర్, రిజిస్ట్రార్, డా॥ సంకేత్ గోయల్, బిట్స్ పిలాని డీన్ ఆఫ్ రీసర్చ్ అండ్ ఇన్నోవేషన్ మరియు వర్సిటీ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

పి. సుధాకర్ మరియు మార్ల్వ బాబు

# గిరిజన ఉప ప్రణాళిక లబ్ధిదారుడి విజయ గాథ: మల్చింగ్ పద్ధతిలో టమాట సాగు

డా॥ యం. సునీల్ కుమార్, డా॥ జి. శివ చరణ్, ఎ. పోశాద్రి, డా॥ కె. రాజశేఖర్, డా॥ డి.మోహన్‌దాస్, డా॥ వై. ప్రవీణ్ కుమార్
కృషి విజ్ఞాన కేంద్రం, ఆదిలాబాద్





ఆదిలాబాద్ జిల్లాలో సుమారు 76.34% గ్రామీణ జనాభా ఉన్నది, వీరిలో ఆదివాసి గిరిజనులు అత్యధికం. గిరిజన ప్రాంతాలలో ప్రధానంగా పత్తి, సోయాబీన్, కందులు, శనగలు, జొన్నలు, పెసర్లు మొదలైన పంటలను ఎక్కువగా సాగు చేస్తున్నారు. సరైన నీటి వసతులు లేక పోవడం మరియు నీటి యాజమాన్య పద్ధతులు పాటించకపోవడం వలన అధిక విస్తీర్ణంలో వర్షాధారంగా ప్రత్తి సాగు చేయబడుతుంది. రైతు ఆదాయాన్ని రెట్టింపు చేయడానికి పంట మార్పిడి, ఉద్యాన పంటల సాగు, సాంకేతికత మరియు సమగ్ర యజమాన్య పద్ధతులు మొదలైన వాటిపైన ఆదివాసి రైతులకు అవగాహన లేకపోవడం వలన కేవలం వర్షాధార పంటలు మాత్రమే పండిస్తూ జీవనం కొనసాగిస్తున్నారు.

ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలో పనిచేస్తున్న కృషి విజ్ఞాన కేంద్రం ఆదిలాబాద్ జిల్లాలోని రైతు సోదరులకు కావలసిన వ్యవసాయ సమాచారంతో పాటు ఆధునిక వ్యవసాయ సాంకేతిక అంశాల పైనా, సస్యరక్షణ, నేల రక్షణ, నీటి యాజమాన్య పద్ధతులు, కొత్త వంగడాలు, పంట కోత మరియు పంట కొతానంతర సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తల పైన వివిధ శిక్షణ కార్యక్రమాలను, క్షేత్ర స్థాయి ప్రదర్శనలు, ప్రథమ శ్రేణి ప్రదర్శనలను ఏర్పాటు చేసి రైతులను చైతన్య పరుస్తుంది. వివిధ దత్తత గ్రామాలలో ఏడాది పొడవునా ఆదివాసి చిన్న, సన్నకారు రైతులను భాగస్వామిగా చేసి వారి క్షేత్రాలలో అధిక ఆదాయం కోసం వివిధ కార్యక్రమాలను చేపడుతుంది. కృషి విజ్ఞాన కేంద్రం, ఆదిలాబాద్ జిల్లాలోని తలమడుగు మండలం, సకినాపూర్ గ్రామాన్ని దత్తత గ్రామంగా తీసుకొని వ్యవసాయ మరియు అనుబంధ రంగాల అభివృద్ధికి చేపట్టవలసిన వివిధ కార్యక్రమాలను చేపట్టి రైతులు, మహిళలు మరియు యువతీ యువకులను ప్రోత్సహించి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడానికి కృషి చేస్తుంది. గ్రామంలో ఏర్పాటు చేసిన రైతు సదస్సు ద్వారా రైతుల సమస్యలను సేకరించి, క్రోడీకరించి కృషి విజ్ఞాన కేంద్రం గిరిజన ఉప ప్రణాళికలో భాగంగా రైతులకు కావలసిన వ్యవసాయ పనిముట్లతోపాటు అనుబంధ రంగాల అభివృద్ధికి కావలసిన పెరటికోళ్ళు, మేకలు, బహుళార్థసాధక ప్రాసెసింగ్ మిల్లులను, మహిళలకు కుట్టు మిషన్లు వంటివి ఇవ్వడం జరిగింది. రైతుల యొక్క నల్లరేగడి భూములను, నీటి లభ్యతను పరిగణలోకి తీసుకొని టమాట పంటను పత్తికి ప్రత్యామ్నాయంగా సాగు చేయాలని వారికి సూచించడమైనది.

ఆత్రం లక్ష్మణ్, వయసు 26, సన్నకారు ఆదివాసి రైతు, గ్రామం సకినాపూర్, మండలం తలమడుగు. ఈ రైతు గత 10 సంవత్సరాల నుండి వర్షాధార పంటలైన ప్రత్తి, సోయాబీన్, కందులు సాగు చేస్తున్నారు. గత 5 సంవత్సరాల నుండి పెరుగుతున్న సాగు ఖర్చు, చీడపీడల వలన పంట నష్టం మరియు సరైన మార్కెట్ ధర లేకపోవడం వలన సంప్రదాయ పంటల సాగు వలన ఆర్థికంగా నష్టపోతున్నారు. లక్ష్మణ్, కుటుంబ సభ్యులు అందరూ కలిసి కూడా తాను సాగు చేస్తున్న పొలములో కష్టపడి

రోజంతా పనిచేసినా సంవత్సరానికి లక్ష రూపాయల ఆదాయం రావడంలేదని రైతు సదస్సులో తెలిపారు. ఆత్రం లక్ష్మణ్ గారు ఒక ఎకరానికి సరిపడా ప్లాస్టిక్ మల్చింగ్ షీట్లను కె.వి.కె గిరిజన ఉప ప్రణాళిక ద్వారా అందించినట్లయితే తనకు ఉన్న నీటి లభ్యతతో టమాట సాగు చేస్తానని రైతు సదస్సులో శాస్త్రవేత్తలను కోరడమైనది. ఈ క్రమంలో 21 మైక్రాన్ల మందం, 1 మీటరు వెడల్పు కలిగిన ప్లాస్టిక్ మల్చింగ్ షీట్లను రైతుకు అందజేసి నేల తయారీ నుండి పంట కోత వరకు తీసుకోవలసిన జాగ్రత్తలను తెలియజేసి క్షేత్ర ప్రదర్శన ఏర్పాటు చేయడం జరిగినది. టమాట సాగులో చేపట్టవలసిన మెళకువలను దృశ్యమాలిక ద్వారా మరియు క్షేత్ర సందర్శనల ద్వారా రైతుకు సమయానుగుణంగా తెలియజేయటం జరిగింది.

**రైతు సాగు చేసిన విధానం:**

**నేల తయారీ:** నేలను 2 సార్లు దుక్కి దున్నిన తర్వాత ఎకరానికి 5 టన్నుల పశువుల ఎరువు అందించి కలియదున్నడం జరిగింది. తర్వాత 15 సెం.మీ. ఎత్తు, 90 సెం.మీ. వెడల్పు గల మడులను 45 సెం.మీ. ఎడంతో తయారు చేసి గంటకు 16 లీటర్ల నీటిని అందించే సామర్థ్యం కలిగిన డ్రిప్ లేటరల్ పైపులను మడులపై అమర్చి 21 మైక్రాన్ల మందం, 1 మీటరు వెడల్పు కలిగిన ప్లాస్టిక్ మల్చింగ్ షీట్లను మడుల పై పరచడం జరిగింది.

**నారుశుద్ధి మరియు నాటడం:** 25 రోజుల వయసు ఉండి 3-4 ఆకులు గల ఆరోగ్యమంతమైన నారును ట్రైకోడెర్మ ద్రావణం (5 గ్రా./లీటరు నీటికి) లో 15 నిమిషాల పాటు వేర్లు తడిచేలా శుద్ధి చేసి ఎత్తుమడల పై 45 సెం.మీ. ఎడంతో నాటుకోవడం జరిగింది.

**ఎరువుల యాజమాన్యం:** ఎకరానికి 5 టన్నుల పశువుల ఎరువుతో పాటుగా రసాయన ఎరువులను సిఫారసు చేసిన మోతాదు (నత్రజని 90 కిలోలు, భాస్వరం 36 కిలోలు, పొటాష్ 36 కిలోలు) లో అందించడం జరిగింది.

**నీటి యాజమాన్యం:** మల్చింగ్ షీటు పరచడం వలన ప్రతి రోజు కేవలం 60 నిమిషాల పాటు నీటిని అందించడం జరిగింది.

**సస్యరక్షణ:** శాస్త్రవేత్తలు సమయానుగుణంగా క్షేత్ర సందర్శనలు మరియు సోషల్ మీడియా ద్వారా తెలియజేసిన రసాయనాలను రైతు పిచికారి చేసి చీడపీడల నివారణ చేపట్టడం జరిగింది.

**పట్టిక: టమాట సాగులో ఖర్చు మరియు ఆదాయం వివరాలు**

| క్ర.సం. | వివరాలు | (రూ.) |
|---|---|---|
| 1. | నేల తయారీ | 3000/- |
| 2. | విత్తనం | 8300/- |
| 3. | నారుమడి | 1000/- |
| 4. | నాటడం | 1600/- |
| 5. | మల్చింగ్ | 16300/- |
| 6. | ఎరువులు | 15600/- |
| 7. | సస్యరక్షణ | 14250/- |
| 8. | పంటకోత కూలీలు | 12000/- |
| 9. | రవాణ మరియు ఇతర ఖర్చులు | 2800/- |
| 10. | మొత్తం సాగు ఖర్చు | 74850/- |
| 11. | దిగుబడి (క్వి.) | 199 |
| 12. | స్థూల ఆదాయం | 199000 |
| 13. | నికర ఆదాయం | 124150 |
| 14. | ఆదాయ వ్యయాల నిష్పత్తి | 2.65:1 |

కృషి విజ్ఞాన కేంద్రం, ఆదిలాబాద్ శాస్త్రవేత్తల సలహాలు మరియు మెరుగైన యజమాన్య పద్ధతులను పాటించడం వలన ఆత్రం లక్ష్మణ్ గారు టమాట సాగు ద్వారా సుమారు రూ. 1,24,150/- రూపాయల నికర ఆదాయాన్ని గడించారు. ఎకరం తోట నుండి 199 క్వింటాళ్ల టమాట ను పండించి కిలో 10 చొప్పున అమ్మి రూ. 1,99,000/- రూపాయల స్థూల ఆదాయాన్ని పొందారు. సాగుకు మొత్తం అయిన ఖర్చు రూ. 74,850/- రూపాయలు. ఆదివాసి రైతు మొదటిసారిగా టమాట పండించి రెండింతలు ఆదాయాన్ని పొందడం ఆ చుట్టుపక్కల గల ఆదివాసి గ్రామాలలో ఇది ప్రథమం. దీన్ని పరిశీలించిన ఇతర ఆదివాసి రైతులు వారి పొలంలో కూడా మల్చింగ్ పద్ధతిలో టమాట పండించడానికి ఆసక్తి చూపుతున్నారు.

**ఇతర వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నెం. 9182180171**

## 23వ పేజీలోని పదవినోదం సమాధానాలు


| | | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| త | క్కు | వ | | జి | | పా | ర్మా | ల్డి | హై | డ్ | |
| వు | | రి | | గు | | | | | డ్రో | | |
| డు | | | | రు | | | | | ఫో | | |
| | | | | అ | | | ప | ద్దె | ని | మి | ది |
| | | | | ట్ట | | | | | క్స్ | | |
| ఆ | మ్ల | నే | ల | లు | | | | | | యి | |
| వా | | | | | వి | ష | పూ | రి | త | స్థ | యి |
| లు | | | | | | | | | | న | |
| | | కు | సు | మ | | | | | | ర్భ | |
| | | | | దో | | | | | | క | |
| | | | | డి | | | ప | సు | వు | | |
| | | | | సు | | | వే | | | | |

**46వ పేజీలోని ప్రశ్నలకు సమాధానాలు 1. ఎ 2. సి 3. డి 4. సి 5. డి 6. ఎ 7. బి 8. డి 9. డి 10. డి**

# మామిడిలో కోతానంతరం యాజమాన్య పద్ధతులు

డా॥ ఇ. రాంబాబు, డా॥ ఎస్. మాలతి, డా॥ ఎన్. కిషోర్ కుమార్ మరియు బి. క్రాంతి కుమార్

కృషి విజ్ఞాన కేంద్రం, మల్యాల్, మహబూబాబాద్




1. మంచి సైజు, ముదిరిన, పక్వానికి వచ్చిన కాయలను మాత్రమే కోయాలి.
2. కాయల కోతకు పొడువాటి వెదురు బొంగు చివరన కొడవలితోపాటు వల కలిగి ఉన్న పరికరాన్ని వాడాలి.
3. కోసిన కాయల నుండి సోన తీసివేయడానికి కాయలను తల క్రిందులుగా వెదురు బొంగు కర్రల మీద 2–3 గంటలు ఉంచాలి.
4. కాయల మీద ఉన్న సోన, మచ్చలను నీటితో శుభ్రం చేసుకోవాలి.
5. కడిగిన కాయలను 4–5 నిమిషాల పాటు 46–50 డిగ్రీల వేడి నీళ్ళలో / నీటి ఆవిరి (హాట్ వాటర్ / వేపర్ హీట్ ట్రీట్మెంట్) తో శుద్ధి చేసి నీడలో ఆరబెట్టాలి.
6. కాయ సైజుని బట్టి చిన్న, పెద్ద కాయలను వేరు చేయాలి.
7. కాయలను ప్లాస్టిక్ క్రేట్‌లో/కార్టూన్ బాక్సులో ప్యాకింగ్ చేయాలి
8. ప్యాకింగ్ చేసిన కాయలను రవాణా మార్గం ద్వారా మార్కెట్‌కి పంపాలి

RNI No : TELTEL/2015/60296
May, 2025
Postal Regd.No:HSE/1013/2024-2026
Total No. of Pages : 52
Date of Publication : 06.05.2025
Date of Posting : 09.05.2025

Posting at BPC - IV Patrika Channel, Nampally, Hyderabad- 500 001



# పచ్చిరొట్ట పంటలను వేయండి
# భూసారాన్ని పెంపొందించండి

Striving for a greener tomorrow...

ముద్రణ మరియు ప్రచురణ: ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం

Printed and Published by Dr. R. Sunitha Devi on behalf of Professor Jayashankar Telangana Agricultural University,
Owned by Professor Jayashankar Telangana Agricultural University,
Printed at: PJTAU Press, ARI Campus, Rajendranagar, Ranga Reddy (Dist.), Hyderabad, Telangana
Published From: Professor Jayashankar Telangana Agricultural University, ARI Campus, Rajendranagar, Ranga Reddy (Dist.), Hyderabad, Telangana
Editor: Dr. R. Sunitha Devi, RNI File No. 1262077, Title-Code: TELTEL00152